www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
శుక్రవారం 25 ఏప్రిల్ 2025
సంపుటి :06 సంచిక : 324 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## పోలీస్ శాఖకు సిఎం రేవంత్ అభినందనలు

**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):** ఇండియా జస్టిస్ రిపోర్ట్ - 2025 లో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి లను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సిఎస్ శాంతికుమారి కూడా వారిని అభినందించారు.

## ట్రంప్ నిర్ణయానికి కోర్టులో చుక్కెదురు

- స్వల్ప కారణాలతో విద్యార్థుల వీసాల రద్దు
- వాటిని పునరుద్ధరిస్తూ న్యాయస్థానం ఆదేశాలు



**వాషింగ్టన్,ఏప్రిల్24( వెలుతురు):** వీసాల రద్దుతో ఇబ్బంది పడ్డ భారత్ విద్యార్థులకు ఊరట దక్కింది. వీరితో పాటు పలుదేశాలకు చెందిన వారు కూడా ఉన్నారు. అమెరికాలో ట్రంప్ కార్యవర్గం 133 మంది విద్యార్థులకు నిలిపేసిన ఎస్ఈవీఐఎస్ అంటే స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను న్యాయస్థానం పునరుద్ధరించింది. దీనిలో అధిక మంది భారత్‌కు చెందినవారున్నారు. అమెరికా విదేశాంగశాఖ వీరి వీసాలను రద్దు చేయడంతోపాటు ఎస్ఈవీఐఎస్‌ను టెర్మినేట్ చేయడంపై వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అమెరికాలో 2 లో..

## నేడు కాశ్మీర్‌కు ఆర్మీ చీఫ్



2 లో..

## బిఆర్ఎస్ ధరణితో రైతులకు తీవ్ర నష్టం

- భూభారతితో పారదర్శక విధానం
- దరఖాస్తు చేసుకున్న వారి సమస్యలు తీరుస్తాం
- అక్కన్నపేట సదస్సులో మంత్రి పొన్నం



**సిద్దిపేట,ఏప్రిల్24( వెలుతురు):** గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ ద్వారా చాలా మంది రైతులకు నష్టం జరిగిందని.. అలాంటి తప్పులు మళ్లీ జరగొద్దనే రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో భూ భారతి తీసుకొచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగానే భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. గురువారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో భూ భారతి 2 లో..

## భారత్‌తో మేమూ కటీఫ్

- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాం
- సైన్యం అందుకు సన్నద్ధంగా ఉంది
- ప్రకటించిన ఇస్లామాబాద్

2 లో..

## రాష్ట్రపతితో అమిత్ షా, జైశంకర్‌ల భేటీ


- కాశ్మీర్ దాగి ఘటన పరిణామాలపై చర్చ
- రెడ్ ఫైల్‌తో వెళ్లడంపై సర్వత్రా ఆసక్తి



**న్యూఢిల్లీ,ఏప్రిల్24( వెలుతురు):** కాశ్మీర్ ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో అమిత్ షా, విదేశాంగ మంత్రి జై శంకర్‌లు రాష్ట్రపతిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. సర్వ సైన్యాధ్యక్షుడు అయిన రాష్ట్రపతిని కలవడంతో 2 లో..

## ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా

# వెతికి శిక్షిస్తాం



- వారికి మద్దతు ఇస్తున్న వారిని సైతం వదలబోం
- కలలో కూడా ఊహించని విధంగా శిక్ష వేస్తాం
- వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే
- బీహార్ పర్యటనలో ప్రధాని మోడీ ఘాటు హెచ్చరిక

*ఉగ్రవాది ఎక్కడ నక్కినా సరే వెతికి మరీ శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామన్నారు. ఇది భారతీయ ఆత్మపై జరిగిన దాడి అని ప్రధాని అభివర్ణించారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లిచుకోక తప్పదన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బిహార్‌లోని మధుబనిలో ఏర్పాటు-చేసిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాంలో ఉగ్రదాడి గురించి ఆయన ప్రస్తావిస్తూ.. ముష్కరులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.*

**పట్నా,ఏప్రిల్24( వెలుతురు):** తొలుత తన ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. మోదీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు. అనంతరం దాడి గురించి ప్రధాని స్పందించారు. వారు భారత్ ఆత్మపై దాడి చేసే దుస్సాహసం చేశారు. ప్రపంచానికి మేము చెప్పేది ఒక్కటే.. ఉగ్రవాదులను, వారికి సాయమందించిన వారందరికీ గుర్తించి శిక్షిస్తాము. భూమి అంచుల వరకూ వారిని వెంటాడి పట్టుకుం టాము. ఉగ్రవాదంతో భారత్ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయలేరని మోదీ నిప్పులు చెరిగారు. పహెల్గామ్‌లోని బైసారంలో పర్యటనకు వచ్చిన టూరిస్టులను మంగళవారం నాడు ఉగ్రవాదులు కిరాతకంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది మృతి చెందారు. ఈ దాడి కుట్రదారు పాక్‌పై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బుధవారం మోదీ అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ కమిటీ- పాక్‌పై పలు చర్యలకు ఉపక్రమించింది. సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలుపుదల చేయడంతో పాటు- దౌత్య పరమైన చర్యలకు ఉపక్రమించింది. పాక్‌లో భారత సాయుధదళాల సలహాదారులను వెనక్కు పిలిపించుకోవడంతో పాటు- ఇక్కడున్న పాక్ రక్షణ శాఖ సలహాదారులను 2 లో..

## ఉగ్రవాద నిరోధక చర్యలకు పూర్తి మద్దతు

- పహల్గామ్ దాడి హేయమైన చర్య
- అఖిలపక్ష సమావేశం తీవ్రంగా ఖండన
- భవిష్యత్‌లో మళ్లీ దాడులు జరక్కుండా చర్యలు
- విపక్షాల సూచనకు ప్రభుత్వం అంగీకారం



**న్యూఢిల్లీ,ఏప్రిల్24( వెలుతురు):** ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటామని అఖిలపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశం వివరాలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. జమ్మూకశ్మీర్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుని, పర్యాటకం వృద్ధి చెందుతున్న సమయంలో స్థానిక 2 లో..

## రియల్ టైమ్ గవర్నెన్స్ ముఖ్యం

- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లోనూ మానవీయ కోణం
- రెండురోజుల వర్క్‌షాపులో సిఎం చంద్రబాబునాయుడు



**అమరావతి, ఏప్రిల్24 (వెలుతురు):** మానవీయకోణంలో పాలనలో ఏఐ వినియోగించడం ముఖ్యంఅని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.. పాలనలో ఏఐ వినియోగించినా మానవీయకోణం 2 లో..

## ముగిసిన వాన్స్ భారత పర్యటన

- జైపూర్ నుంచి అమెరికాకు తిరుగు ప్రయాణం



**న్యూఢిల్లీ,ఏప్రిల్24( వెలుతురు):** అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ భారత్ పర్యటన ముగిసింది. జె.డి. వాన్స్ తన భార్య, ముగ్గురు పిల్లలు గురువారం జైపూర్ 2 లో..

## పదేళ్ల బిఆర్ఎస్ పాలన స్వర్ణయుగం

- గ్రామస్వరాజ్యం కోసం గాంధీ కలలను నిజం చేసాం
- ఉద్యమ కలను సాకారం చేసిన కెసిఆర్
- ఎక్స్‌లో పోస్ట్ చేసిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):** తన పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ ఉద్యమ నినాదాలను నిజం చేశారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్మాగాంధీ కన్న కలలను కూడా సాకారం చేశారని చెప్పారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కేటీఆర్.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పల్లె ప్రగతిని గుర్తుచేస్తూ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. ఆ పోస్టులో కేటీఆర్.. 'పదేళ్ల పాలనలో ఉద్యమ నినాదాలను నిజం చేయడమేగాక గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్ముడు కన్న కలలను కూడా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సాకారం చేశారు. ఇవాళ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటు-న్న వేళ.. పల్లెసీమలే దేశానికి పట్టు-గొమ్మలన్న మహాత్మా గాంధీ ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పాలనలో ప్రాణం పోసిన 'పల్లెప్రగతి'ని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. సమైక్య పాలనలో దశాబ్దాలపాటు- దగాపడ్డ పల్లెలను దర్జాగా కాలర్ ఎగరేసుకునే స్థాయికి తీర్చిదిద్దిన సందర్భాలు అపూర్వం. అనితర సాధ్యం.' అని పేర్కొన్నారు. సమస్యల సుడిగుండంలో విలవిలలాడిన ప్రతి పల్లె నాడు సకల సౌకర్యాల హరివి÷-లలైంది. కేసీఆర్ సంకల్పంతో ప్రతి పల్లెసీమ ప్రగతిసీమగా మారింది. ప్రతి పల్లెలో డంప్ యార్డు తప్పు.. చెత్త కంపు లేని స్థితి వచ్చింది. కూలిపోయే స్థితి ఉన్న ఖాళీ ఇండ్ల కిరికిరి నుంచి పొంగిపొర్లే మురికి కాలువల శుభ్రత వరకూ ప్రతి సమస్యకు పదేళ్ల పాలనలో శాశ్వత పరిష్కారం 2 లో..

## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

- డైవర్షన్ పాలిటిక్స్‌లో ఆరితేరారు
- అవినీతి మితిమీరిపోయింది
- అప్పనంగా విశాఖలో భూముల పందేరం
- తెగువ చూపిన వైఎస్సార్ కార్యకర్తలకు సెల్యూట్
- బాబు సింగిల్ డిజిట్‌కు రాక తప్పదు
- ప్రజాప్రతినిధుల భేటీలో జగన్ కీలక వ్యాఖ్యలు



**అమరావతి,ఏప్రిల్24( వెలుతురు):** ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. యుద్ధ వాతావరణంలో ప్రజలు బతుకుతున్నారు. దుర్మార్గమైన రెడ్‌బుక్ పాలన జరుగుతోందని వైఎస్ జగన్ మండిపడ్డారు. 6 లో..

## గ్రామాలు స్వయం ప్రతిపత్తి సాధించాలి

- గాంధీ మహాత్ముడి ఆశయం కూడా అదే
- పంచాయితీ నిధులు వాటికే ఖర్చు చేస్తున్నాం
- జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవంలో డిప్యూటీ సిఎం పవన్

**అమరావతి,ఏప్రిల్24( వెలుతురు):** గ్రామాలు స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలుగా ఏర్పడాలని గాంధీజీ చెప్పేవారని, తాను నగరాల్లో ఉన్నా.. పల్లెల్లో ఉండాలనే కోరిక ఉండేదని డిప్యూటీ సీఎం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పల్లెల అభివృద్ధి ఎంతో కీలకం అని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. పంచాయతీలకు ఇచ్చిన నిధులు వాటికే ఖర్చు చేయాలని చెప్పానని.. అలాగే అమలు చేస్తున్నానని అన్నారు. ఈ విషయంలో తనకు సహాయ సహకారాలు అందిస్తున్న శశిభూషణ్, కృష్ణ తేజ , ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ సభ






గురువారం అమరావతి లోని సికె కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## ట్రంప్ నిర్ణయానికి కోర్టులో చుక్కెదురు

చాలామంది భారతీయులు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ అంటే ఓటిపి కింద ఉన్నారు. దీంతో వారికి తాత్కాలికంగా పనిచేసే అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా స్టెమ్ సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్ చేసిన వారికి ఈ అవకాశం లభిస్తుంది. దాదాపు 36 నెలల పాటు– అక్కడ పని చేయవచ్చు. ఈ సమయాన్ని వారు హెచ్–1బీ వర్క్ వీసా వంటివి సాధించేందుకు వారధిగా వాడుకొంటారు. ఓపీటీ– స్టేటస్ పోతే అమెరికాలో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. మరోవైపు అక్కడి ప్రభుత్వ ఏజెన్సీల వాదన భిన్నంగా ఉంది. ఈ విద్యార్థులు పలు సందర్భాల్లో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల దృష్టిలోపడ్డారని చెబుతున్నాయి. ఈనేపథ్యంలో తాము తాత్కాలికంగా అడ్డుకొనేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు చెబుతున్నాయి. కానీ, ఈ విద్యార్థులకు ఎటువంటి నేర చరిత్ర లేదు. ఇక ఇమిగ్రేషన్ లాయర్లు మాత్రం ప్రభుత్వ నిర్ణయం సరికాదని పేర్కొంటున్నారు. విద్యార్థులు ఏ తీవ్ర నేరాలు చేయకపోయినా.. వారి లీగల్ స్టేటస్‌లను తొలగించారన్నారు. తాజాగా ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటి చాలా చిన్న కారణాలతోనే విద్యార్థి వీసాలను రద్దు చేస్తున్నారని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఒక విద్యార్థిపై గృహహింస కేసు నమోదైందని వీసా రద్దు చేశారు. తాజాగా రద్దయిన 327 మందిలో కేవలం ఇద్దరు మాత్రమే స్వల్ప రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అసలు అమెరికా విదేశాంగ శాఖ వీసాలను రద్దు చేయడానికి సరైన నిబంధనలు కూడా లేవని లాయర్లు పేర్కొంటు–న్నారు. 'క్యాచ్ అండ్ రివోక్' పేరిట అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో విద్యార్థి వీసా ఉన్నవారి పరిస్థితిని ఏఐ టూల్స్‌తో సమీక్షిస్తారు. చివరికి వారి సోషల్ మీడియాను కూడా పరిశీలిస్తారు. ఈ ప్రోగ్రామ్ కింద దాదాపు 300 మంది విద్యార్థుల వీసాలు రద్దయ్యాయి. వీరిలో సగం మంది భారతీయులు, చైనీయులు, నేపాలీలు, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ వాసులున్నారు.

# నేడు కాశ్మీర్‌కు ఆర్మీ చీఫ్

**శ్రీనగర్ న్యూఢిల్లీ,ఏప్రిల్24( వెలుతురు):**
ఇండియన్ ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం జమ్ము కశ్మీర్‌కు వెళుతున్నారు. పహల్గాంలో ఉగ్రమూకల దాడి తర్వాత శ్రీనగర్‌లో భద్రతా పరిస్థితులను స్వయంగా సమీక్షించాలని ఆయన నిర్ణయించుకున్నారు. అంతేకాదు.. భారత్ కౌంటర్ ఆపరేషన్స్‌పై సీనియర్ మిలటరీ కమాండర్లతో ఆయన చర్చించనున్నారు. ఎల్‌ఓసీ దగ్గర తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై కూడా ఆయన చర్చిస్తారు. పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన నరమేధం ఘటన తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పర్యాటకులే లక్ష్యంగా జమ్ముకాశ్మీర్‌లో టెర్రరిస్టులు తెగబడ్డారు. ఆర్మీ యూనిఫాంలో వచ్చి, మతం అడిగి మరీ కాల్పులు జరిపారు. దొరికిన వాళ్లను దొరికినట్లు– పిట్టలను కాల్చినట్లు– కాల్చి చంపేశారు.

# భారత్‌తో మేమూ కటీఫ్

**ఇస్లామాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**
భారత్‌తో పూర్తిగా తెగదెంపులు చేసుకుంటున్నట్టు పాకిస్తాన్ నేషనల్ సెక్యూరిటీ కమిటీ ప్రకటించింది. పహల్గాంలో ఉగ్రదాడితో పాకిస్తాన్‌కు ఎలాంటి సంబంధం లేదని ఇండియాకు స్పష్టంగా చెప్పినా తమ దేశంపై చర్యలకు సిద్ధమవుతోందని తెలిపింది. తాము కూడా అంతే ధీటు–గా సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నట్టు– ప్రకటించింది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సైన్యం సిద్ధంగా ఉందని తెలిపింది. తక్షణం సైన్యానికి సెలవులు రద్దు చేస్తున్నట్టు స్పష్టం చేసింది. వాఘాబార్డర్ మూసి వేస్తున్నట్టు తెలిపారు. వాణిజ్యపరమైన ఎగుమతులు, దిగుమతులు ఈ రెండు దేశాల మధ్య ఇకపై ఉండబోవని స్పష్టం చేసింది. పాకిస్తాన్ లో ఉంటు–న్న భారతీయులు 48 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని సూచించింది. యాత్రికులు, టూరిస్ట్ వీసాలపై వచ్చిన వారు వెంటనే వెళ్లి పోవాలని తెలిపింది. సింధూ నదిలో నీటి వాటాపై తాము ఐక్యరాజ్య సమితిలో సవాలు చేస్తామని స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రభుత్వ పక్షాన ఐదుగురు సభ్యులతో కమిటీ– వేయనున్నట్టు– తెలిపింది. అంతర్జాతీయ కోర్టులో ఎదుర్కోవాలని నిర్ణయించింది. బీఎల్ఏ ఉగ్రవాద సంస్థ కీలక నాయకులు భారత్ లోనే ఉన్నారని, కానీ ఎక్కడ ఉగ్రదాడి జరిగినా పాకిస్తాన్ ను నిందించడం ఫ్యాషన్ అయిపోయిందని ఫైర్ అయ్యింది. బీఎల్ఏ ఉగ్రవాదులు తమ వారిపై దాడి చేశారని తెలిపింది. ఉగ్రవాదులు భారత్ భూభాగంలో ఉండటం వల్ల తాము ఏమీ చేయలేకపోతున్నామని కమిటీ– తెలిపింది.

## రాష్ట్రపతితో అమిత్ షా, జైశంకర్‌ల భేటీ

ఏదో పెద్దగా జరగబోతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, ఈ సమావేశానికి వెళ్లిన ఇద్దరు మంత్రులు, రాష్ట్రపతి ముందు 'రెడ్ ఫైల్' ఉంచారు. ఇప్పుడు ఈ రెడ్ ఫైల్ హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో ఏముందనే విషయం ఆసక్తిగా మారింది. పాకిస్తాన్‌పై ఏదైనా సైనిక చర్య ఉంటుందా..? మరేదైనా చర్య తీసుకుంటారా..? అని అంతా ఎదురుచూస్తున్నారు. పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత్ – పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. పహల్గాంలో 26మంది భారతీయుల్ని ఉగ్రవాదులు కిరాతకంగా కాల్చి చంపిన ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణించిన కేంద్రం.. పాక్‌తో సింధు నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే, పాక్ జాతీయులకు అన్ని వీసాలను రద్దు చేస్తున్నట్లు– తాజాగా ప్రకటించింది. ఇందుకు ప్రతిగా పాక్ సైతం భారత విమానాలకు గగనతలాన్ని మూసివేయడం వంటి చర్యలు తీసుకుంది. ఇరుదేశాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ కావడం కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాం ఉగ్రదాడి ఘటనకు సంబంధించి పలు అంశాలను ఆమెకు వివరించినట్లు– సమాచారం. ఈ భేటీకి సంబంధించిన ఫొటోను రాష్ట్రపతి తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ చైనా, కెనడాతో సహా జి20 దేశాల ఎంపిక చేసిన రాయబారులతో సమావేశం నిర్వహించింది. ఈ భేటీ– దాదాపు 30 నిమిషాల పాటు కొనసాగినట్లు సమాచారం.

## రియల్ టైమ్ గవర్నెన్స్ ముఖ్యం

ముఖ్యమని స్పష్టం చేశారు.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్సఫర్మేషన్' అంశంపై సచివాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. సచివాలయంలో రెండు రోజులపాటు– జరగనున్న ఏఐ వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ.. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైనా ఉన్నతాధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఈ వర్క్‌షాప్‌నకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల అధికారులు, కేంద్ర ఐటీశాఖ మాజీ సెక్రెటరీ చంద్రశేఖర్ సహా పలువురు నిపుణులు హాజరయ్యారు. గుడ్ గవర్నెన్స్ కోసం ఏఐ సహా నూతన –టె–క్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై చర్చించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పౌర సేవల్లో –టె–క్నాలజీ వాడకం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, ఫలితాలను పరిశీలించారు. ఏయే విభాగాల్లో ఎలాంటి సాంకేతికత వాడొచ్చు. ప్రస్తుత సమాచారం ఆధారంగా సేవలను ఎలా విస్తృత పరచవచ్చు అనే అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పాలనలో ఏఐ వినియోగించినా.. మానవీయ కోణం ముఖ్యమని సీఎం అన్నారు. –టె–క్నాలజీ వినియోగంతో రియల్–టైమ్‌లో సేవలు అందిస్తామన్నారు. స్మార్ట్ పాలనకు ప్రాధాన్యత ఇస్తూ త్వరలో 'డేటా లేక్' ఏర్పాటు చేస్తామన్నారు. భూ రికార్డుల డిజిటలైజేషన్ వేగంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఈ వర్క్‌షాప్ రెండు రోజుల పాటు జరగనుంది. టెక్నాలజీ వినియోగంతో రియల్–టైమ్‌లో సేవల డెలివరీ చేయవచ్చు అని.. స్మార్ట్ పాలనకు ప్రాధాన్యత ఇస్తాం.. త్వరలో భారీ డేటా లేక్ ఏర్పాటు– చేయనున్నట్టు వెల్లడించారు..పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూనే, ప్రజలకు సేవల విషయంలో మానవీయకోణం చూపాలన్నారు. ఏఐ ఆధారిత స్మార్ట్ వ్యవస్థ ఏర్పాటుతో రియల్ టైమ్‌లో సేవలు అందించవచ్చని పేర్కొన్నారు.. ఇందుకోసం పాత విధానాల స్థానంలో నూతన సాంకేతికతను ప్రవేశ పెట్టాలి.. టెక్నాలజీ అనేది ప్రజల కోసం ఉపయోగపడాలని స్పష్టం చేశారు.. రాష్ట్రంలో భారీ డేటా లేక్‌ను ఏర్పాటు– చేయడంపై దృష్టి పెట్టాం అన్నారు. ఇంటర్నెట్ కోసం ఎదురుచూసిన రోజుల నుంచి డేటా ఆధారిత పాలన దిశగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దామన్నారు.. వేగంగా భూరికార్డుల డిజిటలైజేషన్ చేయాలన్న సీఎం చంద్రబాబు.. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల్లో అధికంగా 75 శాతం భూసంబంధితమైనవే ఉన్నాయని తెలిపారు.. ఈ సమస్య పరిష్కారానికి త్వరితగతిన భూ రికార్డుల డిజిటలైజేషన్ చేయాలన్నారు.

# ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా వెతికి శిక్షిస్తాం

కూడా దేశం వీడాలని ఆదేశించింది. ఈ క్రమంలో ప్రధాని మాట్లాడుతూ ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంది. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయింది. ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి. ఇది కేవలం పర్యాటకులకు జరిగిన దాడి మాత్రమే కాదు.. భారత ఆత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన సాహసం అని మోదీ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా. బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది. ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసేందుకు సమయం ఆసన్నమైంది. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారని ప్రధాని గట్టిగా హెచ్చరించారు. ఈ సందర్భంగా భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతిఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలు కొట్టలేరు. ఉగ్రవాదానికి శిక్ష తప్పదని మోదీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా ఉగ్రవాదుల ఘాతుకాన్ని ఖండించారు. ఉగ్రవాదంపై పోరులో యావత్ దేశం ఏకమైందని అన్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు నరమేధానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

# బిఆర్ఎస్ ధరణితో రైతులకు తీవ్ర నష్టం

చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి అంటేనే ఆత్మగౌరవం. అలాంటి భూమి వివాదాల్లో ఉండకుండా సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టం తీసుకొచ్చామని, రైతులకు భూ భారతి ఎంతగానో ఉపయోగ పడుతోందన్నారు. ధరణిలో 30 లక్షల మంది భూ సమస్య ఉందని పిటిషన్ పెట్టుకున్నారు. ఆ సమస్యలు భూ భారతి ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. త్వరలోనే గౌరవెల్లి కాలువల నిర్మాణం పూర్తవుతుందని.. ప్రాజెక్ట్ ద్వారా నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ భూ సేకరణ సమయంలో కొంత మంది రైతులకు నష్టం జరిగిన వారిని ఆదుకుంటామని భరోసా కల్పించారు. భూ భారతి చట్టాన్ని అందరి ఆమోదంతోనే అమలు చేశామని మంత్రి అన్నారు. కొంతమంది వీఆర్వోలు కేసీఆర్ చెప్పిన పనులు చేయలేదని అర్ధరాత్రికి రాత్రి వీఆర్వో వ్యవస్థను రద్దు చేశారన్నారు. త్వరలో రెవిన్యూ వ్యవస్థలో జీపీఏ వ్యవస్థను తీసుకొస్తామని అన్నారు. కొత్త చట్టం తీసుకొస్తే ప్రజలకు ఉపయోగపడాలి కాని భారంగా మారకూడదన్నారు. గత ప్రభుత్వంలో కబ్జా చేసిన ప్రభుత్వ భూములను.. అక్రమ పట్టాలను రద్దు చేస్తామన్నారు. భూభారతిపై రైతులు అవగాహన కల్పించేందుకే అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని.. భూభారతి చట్టంలో తహశీల్దార్ నుంచి సీసీఎల్ఏ స్థాయి వరకు సమస్యలు పరిష్కరించేందుకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. భూమి రిజిస్ట్రేషన్ కు ముందు తప్పనిసరిగా భూ సర్వే చేసి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుదని.. భూభారతి పోర్టల్ లో అన్ని సమస్యలకు స్వయంగా దరఖాస్తు చేసుకునేలా రూపొందించారు. భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి ఫీజు లేకుండా భూ సమస్యలను పరిష్కరిస్తామని.., అధికారులనే క్షేత్రస్థాయికి పంపిస్తున్నామన్నారు. నెలాఖరులోగా నాలుగు మండలాల్లో అన్ని వివరాలు సేకరించి, జూన్ 2న పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నా రు. మే1వ తేదీ నుంచి మరో 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని భూభారతిని అమలు చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఏమైనా సూచనలు వస్తే నియమనిబంధనల్లో మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. గత ప్రభుత్వం అనాలోచనతో 2020 ధరణి చట్టాన్ని తీసుకొచ్చి... ప్రజలకు అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ధరణి చట్టాన్ని తీసుకొచ్చిన మూడేళ్ల వరకు నియమ నిబంధనలు రూపొందించలేదని... విధివిధానాలు స్పష్టంగా తెలియజేయలేదని.. కేసీఆర్ నోట ఏది వస్తే ఆ మాట ప్రకారమే నడుచుకుందన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి చేసేందుకు ఇందిరమ్మ రాజ్యంలో 2025లో భూభారతి చట్టాన్ని తెచ్చామన్నారు. అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా తప్పులు చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సాదాబైనామాల కింద ఆన్‌లైన్‌లో ఉన్నటు–వంటి అర్హత గల దరఖాస్తులను పరిష్కరిస్తామన్నారు.

# ఉగ్రవాద నిరోధక చర్యలకు పూర్తి మద్దతు

పరిస్థితులను ప్రభావితం చేసే లక్ష్యంతోనే పహల్గాం ఉగ్రదాడి జరిగింది. ఈ ఘటన, తదనంతరం తీసుకున్న చర్యలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అఖిలపక్ష నేతలకు వివరించారు. ఉగ్రదాడికి దారితీసిన లోపాలు, అవి పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యల గురించి ఇంటెలిజెన్స్ బ్యూరో, కేంద్ర హోంశాఖ అధికారులు వివరించారు. ఉగ్రవాదంపై పోరులో ప్రభుత్వం వెన్నంటే ఉన్నట్లు అన్ని పార్టీల నేతలు చెప్పారని కిరణ్ రిజిజు తెలిపారు. పార్లమెంట్ సముదాయంలోని భవనంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ కీలక భేటీ నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నేతలందరూ నిలబడి రెండు నిమిషాల పాటు– మౌనం పాటించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు జైశంకర్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజుజు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సహా ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. పహల్గాం ఉగ్రదాడిని అందరం ముక్తకంఠంతో ఖండించాం. కేంద్రం తీసుకునే ఏ చర్యకై–నా పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చినట్లు రాహుల్ గాంధీ తెలిపారు. కశ్మీర్‌లో శాంతియుత పరిస్థితుల కోసం కేంద్రం తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని మల్లికార్జున ఖర్గే అన్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో ప్రభుత్వం వెన్నంటే ఉన్నాం. ప్రధాని మోదీ వీలైనంత త్వరగా అన్ని పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశామని టిఎంసి నేత సుదీప్ బందోపాధ్యాయ అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో అమాయక పౌరులపై జరిగిన దారుణమైన ఉగ్రదాడి దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని అన్ని పార్టీల నేతలు ముక్తకంఠంతో ఖండించారు. ఈ ఘటన నేపథ్యంలో దేశ రాజకీయ వర్గాలన్నీ భద్రతా అంశంపై ఒక్కటై చర్చలకు సిద్ధమయ్యాయి. భవిష్యత్తులో ఇటు–వంటి దాడులు మరలా జరగకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా ఉగ్రదాడి జరిగిన తీరును వివరాయించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన తక్షణ చర్యలను సమావేశంలో పాల్గొన్న నేతలకు తెలిపారు. దేశ భద్రత విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఒకటిగా ఉండాలని సమావేశం సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. మొత్తంగా ఈ సమావేశం దాదాపు రెండు గంటలు జరిగింది. ఈ సమావేశంలో ఉగ్రదాడులను అఖిలపక్ష పార్టీలు ఖండించాయి.

## పదేళ్ల బిఆర్ఎస్ పాలన స్వర్ణయుగం

దొరికింది. కలుషిత నీటి కలకలం లేకుండా, సీజనల్ రోగాల చింతలేకుండా సాగిన పంచాయతీల ప్రస్థానం గ్రామ స్వరాజ్యంలో ఓ స్వర్ణయుగం.' అని కేటీఆర్ రాసుకొచ్చారు. పచ్చదనానికి కొదవ లేకుండా, నిధులకు కొరత లేకుండా, విధులకు ఆటంకం లేకుండా, ప్రతి ఊరును మెరుగైన జీవనానికి మారుపేరుగా మార్చింది కేసీఆర్ విజన్. దేశంలో 3 శాతం జనాభా ఉన్న తెలంగాణ, పల్లెప్రగతిలో 30 శాతం అవార్డులను గెలుచుకోవడం పల్లె ప్రగతిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి విజయం. నాడు పదేళ్లపాటు– మురిసిన పల్లె, కాంగ్రెస్ పాలనలో నేడు మళ్లీ కన్నీరు పెడుతోంది. కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం పూర్తిగా గాడితప్పింది. ఏడాదిన్నర గడిచినా స్థానిక సంస్థలకు ఎన్నికలు లేవు. 15వ ఆర్థిక సంఘం నిధులు లేవు. గ్రామాల్లో కనీస వసతులు లేవు. పల్లె ప్రజలకు గుక్కెడు మంచినీళ్లు దిక్కు లేవు.' అని కేటీ–ఆర్ నేటి దుస్థితిని వివరించారు. చివరికి రాష్ట్రంలో పంచాయతీ సిబ్బందికి వేతనాలు లేవు.

ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు లేవు. మాజీ సర్పంచ్‌ల బిల్లులకే మోక్షం లేదు. దేశంలోనే ఆదర్శ గ్రామాలకు చిరునామాగా నిలిచిన తెలంగాణ పల్లెలు అధ్వాన పరిస్థితులకు అడ్రస్‌గా మారడం అత్యంత బాధాకరం. ఢిల్లీ పార్టీలను నమ్మిన పాపానికి పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన తీరును తెలంగాణ పల్లె ప్రజలు గమనిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీకి, పచ్చని పల్లెలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీకి జనం క్రరుకాల్చి వాతపెడుతరని హెచ్చరించారు.

### ముగిసిన వాన్స్ భారత పర్యటన

అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో వాషింగ్టన్‌కు బయలుదేరినట్లు– అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి వాన్స్ కుటుంబం ఢిల్లీ నుండి జైపూర్ చేరుకుంది. మంగళవారం రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో దౌత్యవేత్తలు, మేధావులను ఉద్దేశించి అమెరికా– భారత్ సంబంధాలపై ప్రసంగించారు. అంతకు ముందు ఆయన కుటుంబసమేతంతగా అంబర్ కోటను సందర్శించారు. జైపూర్ చేరుకోవడానికి ముందు బుధవారం ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను కూడా సందర్శించారు. వాన్స్ సోమవారం ఢిల్లీలోని అక్షర్‌ధామ్ ఆలయ సందర్శనతో తన భారత పర్యటనను ప్రారంభించిన సంగతి తెలిసిందే. అనంతరం ప్రధాని మోడీతో సమావేశమయ్యారు.


# గ్రామాలు స్వయం ప్రతిపత్తి సాధించాలి

గ్రామీణాభివృద్ధిని చూపిస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. గ్రామాల్లో రోడ్లు, మంచినీరు, మౌలిక వసతుల కల్పన వంటి పురోగతిని పవన్‌కు అధికారులు వివరించారు. అంతకుముందు కార్యక్రమంలో పహెల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ అందరూ మౌనం పాటించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటు– అయిన సందర్భంగా తాను పంచాయతీ రాజ్ శాఖను ఇష్టంగా ఎంచుకున్నానని చెప్పారు. నేడు గ్రామాల్లో రోడ్లు, నీరు, ఇతర మౌలిక వసతులు కల్పించడంలో కీలక పాత్ర వారిదేనన్నారు. ఈ అభివృద్ధి పనులకోసం నగలు తాకట్టు– పెట్టి పనులు చేశారని, నిధులు రావడంలో కొంత జాప్యం జరిగిందన్నారు. దీని వల్ల కాంట్రాక్టర్‌లకు బిల్లులు ఇవ్వలేక పోయామన్నారు. త్వరలో నిధులు వస్తాయని... అందరికీ బిల్లులు చెల్లిస్తామని పవన్ కల్యాణ్ భరోసా ఇస్తున్నామన్నారు. పంచాయతీల వ్యవస్థ బలోపేతం చేయడం కోసం తొలుత అధ్యయనం చేశానని, సిఫార్సులు, డబ్బులు లేకుండా బదిలీ ఉండదనే అభిప్రాయం ఉందన్నారు. ఎవరూ పైరవీలు చేయవద్దని తన పేషీ నుంచి ఆదేశాలు స్పష్టంగా ఇచ్చానని చెప్పారు. ఈసారి అన్ని స్థాయిల్లో అవినీతి లేకుండా బదిలీలు జరిగాయన్నారు. తాను సమర్థవంతంగా పని చేసే అధికారులను వెతికి పట్టు–కున్నానని, గతంలో నిర్లక్ష్యానికి గురి కాబడిన వారిని గుర్తించి ప్రతిభ ఆధారంగా పోస్టింగ్ ఇచ్చానని చెప్పారు. తనకు అనేక రూపాల్లో సిఫార్సులు వచ్చినా తాను నిబంధనల ప్రకారం వెళతానని చెప్పి అమలు చేశానన్నారు. కొన్ని గ్రామాలు వర్గ పోరు, కులాలపోరు వల్ల నష్టపోయాయని, కూటమికి చెందిన సర్పంచ్‌లు లేకపోయినా.. మేము ప్రజలకోసం ఆలోచన చేశామన్నారు. పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటీసీ, ఎంపిపిలకు ఇచ్చే మర్యాద, గౌరవం ఇచ్చామని అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి, వారి నిధులు కూడా మళ్లించిందని, రూ. 1120 కోట్లు మన ప్రభుత్వం వచ్చాక పంచాయతీల అభివృద్ధికి వినియోగించామని పవన్ చెప్పారు. 100 నుంచి పది వేలు, 250 నుంచి 25 వేలు పంచాయతీల కు పెంచామన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీ అనే పదం వాడకూడదన్నారు. గ్రామాల అభివృద్ధికి వాడే శ్రామికులు అంటే బాగుంటు–ందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కూడా దీనిపై ఆలోచన చేయాలని, నరేగా శ్రామికులు గానే ఇక నుంచి అందరూ పిలవాలని, ఉపాధి శ్రామికులకు వంద రోజుల పనికల్పించామన్నారు. గ్రామ సభల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి పనులు చేశామని, రూ. 10,690 కోట్లు– తొమ్మిది నెలల పాలనలో ఖర్చు చేసి గ్రామాలు అభివృద్ధి చేశామన్నారు. రూ. 1005 కోట్లతో గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి చేశామన్నారు. ఏపీ అభివృద్ధిలో పంచాయతీ రాజ్ శాఖ పని తీరు చాలా కీలకమని, ఉద్యోగులు, సిబ్బందికి మేము ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని



పవన్ కల్యాణ్ తెలిపారు. గ్రామీణాభివృద్ధిలో మోదీ, చంద్రబాబు నాయకత్వంలో మన ఎపి 24వ స్థానం నుంచి రెండో స్థానంలోకి వచ్చిందన్నారు. చిత్తశుద్ధితో పని చేస్తే మంచి ఫలితాలు ఉంటాయ నేందుకు ఇదే నిదర్శనమన్నారు. గ్రామాల్లో కలప మొక్కలు పెంచాలని నిర్ణయించామని, ఎపిలో నాలుగో వంతు ఉన్న దేశాల్లో కలప ప్రధాన ఆదాయ వనరుగా ఉందన్నారు. ఏపిలో కూడా కలప పెంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలన్నారు. గ్రామాల్లో ఉష్ణోగ్రతలు తగ్గించడంతో పాటు–, ఆదాయం కూడా వస్తుందని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అందరూ ఈ దిశగా ఆలోచన చేయాలని సూచించారు. స్వర్ణంధ్ర, ఆత్మ నిర్భర్ భారత్ సాధించేలా అందరూ కలిసి నడవాలని పిలుపిచ్చారు. చాలా ప్రాంతాల్లో పాఠశాలలకు ఆట స్థలాలు లేవని, రైల్వే కోడూరులో ఒక గ్రామంలో ఆట స్థలం కొని ఇవ్వాల్సి వచ్చిందన్నారు. చాలా గ్రామాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, గ్రామాల్లో అసలు ఎంత భూమి ఉంది... ఎవరెవరు స్వాధీనం చేసుకున్నారో తేల్చలని అధికారులకు సూచించారు. ఎటు–వంటి రాజకీయ పక్షాల అడ్డంకులు ఉన్నా తనకు చెప్పాలన్నారు. అన్ని గ్రామాల్లో స్థలాల వివరాలు తనకు అందించాలి పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మహిళా వర్సిటీ విద్యార్థుల ఆందోళన




**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**
మహిళా వర్సిటీ వసతి గృహంలో మౌలిక సదుపాయాలు లేవంటూ కోఠిలోని 'వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ' విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఉపకులపతి ఛాంబర్ ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. హాస్టల్‌లో మంచినీరు, మరుగుదొడ్లు సరిగా లేవని, క్యాంపస్‌లో పాములు తిరుగుతున్నాయని, ఎలుకలు, కుక్కలు కొరుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల నుంచి ఆందోళన చేస్తున్నా వీసీ (ఉపకులపతి) పట్టించుకోవడం లేదని, సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని చెబుతున్నారు.

# కెసిఆర్ సభ అంటే జనం వస్తారు

- వరంగల్ వజ్రోత్సవ సభలపై దానం



**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**
బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న సిల్వర్ జూబ్లీ మహాసభపై రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఏప్రిల్ 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ మహాసభ విజయవంతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో జరిగే ఈ సభకు ప్రజలు భారీగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్‌ను చూసేందుకు, ఆయన ఏమి మాట్లాడతారన్న విషయం పై ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఇకపోతే, కంచ గచ్చిబౌలి భూముల వివాదం రాజకీయంగా హాట్ టాపిక్ అయింది. ఈ వ్యవహారంలో సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ చేసిన రీటీవట్ పట్ల దానం నాగేందర్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆమె రీటీవట్ చేసిన విషయాల్లో తప్పేమీ లేదని, ఆమె అక్కడి వాస్తవ పరిస్థితినే ప్రజలతో పంచుకున్నారని అన్నారు. ఇందులో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశించి ఆమె ఏమి అనలేదని, ఆమెపై విమర్శలు అనవసరమని ఆయన స్పష్టం చేస్తూ సంఘీభావం తెలిపారు.

# పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో ఊరట

- సుబేదారి పిఎస్ కేసులో అరెస్ట్ చేయొద్దని ఆదేశం



**హైదరాబాద్,ఏప్రిల్24(వెలుతురు):**
పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది.. సుబేదారి పీఎస్‌లో నమోదైన కేసులో అరెస్ట్ చేయొద్దంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.. సోమవారం వరకు కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేయొద్దంటూ హైకోర్టు ఆదేశించింది. దర్యాప్తు కొనసాగించొచ్చని, పోలీసులకు సహకరించాలని కౌశిక్ రెడ్డికి సూచించింది.. క్వారీ యజమాని మనోజ్‌ను 50లక్షల ఇవ్వాలంటూ బెదిరించాడని కౌశిక్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. మనోజ్ భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు సుబేదారి పీఎస్‌లో కేసు నమోదైంది. కేసును కొట్టేయాలంటూ పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ కక్షల కారణంగానే కేసు నమోదు చేశారని కౌశిక్ రెడ్డి న్యాయవాది కోర్టులో వాదించారు.. 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు ఉన్నాయని న్యాయవాది కోర్టుకు తెలిపారు.. కమలాపూరం మండలం వంగపల్లిలో క్వారీ నిర్వహిస్తున్న మనోజ్.. 2023 అక్టోబర్25న 25లక్షల రూపాయలు కౌశిక్ రెడ్డికి మనోజ్ చెల్లించినట్లు-వాంగ్మూలం ఉంది కదా అని పీపీని హైకోర్టు ప్రశ్నించింది.. బెదిరించడంతో రూ. 25లక్షలను కౌశిక్ రెడ్డికి మనోజ్ చెల్లించాడని పీపీ స్పష్టం చేశారు. ఇప్పుడు రూ. 50లక్షలు ఇవ్వాలని బెదిరించడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు- పేర్కొన్నారు. 2023లో ఎందుకు ఫిర్యాదు చేయలేదని పీపీని హైకోర్టు ప్రశ్నించింది. కౌశిక్ రెడ్డిని తదుపరి విచారణ వరకు అరెస్ట్ చేయొద్దని ఆదేశిస్తూ 28వ తేదీకి విచారణ వాయిదా వేసింది.

# హైదరాబాద్ మెట్రోలో బెట్టింగ్ యాడ్స్

- పిల్ దాఖలు..వచ్చే వారానికి వాయిదా




**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**
మెట్రో రైలు లో బెట్టింగ్ ప్రమోషన్ ఫై హైకోర్టు విచారణ చేపట్టింది. మెట్రో రైల్లో బెట్టింగ్ ఆప్ ప్రమోషన్‌పై హైకోర్టులో పిల్ దాఖలైంది. అడ్వకేట్ నాగూర్ బాబు ఈ పిల్ దాఖలు చేశారు. హైదరాబాద్ మెట్రో రైలు లిమి-టె-డ్ బోర్డ్ డైరెక్టర్స్ పై సీబీఐ ఎంక్వయిరీ వెయ్యాలని అందులో పేర్కొన్నారు. రోజుకి 5 లక్షల మంది ప్రయాణించే మెట్రో రైలులో ఐఏఎస్, ఐపీఎస్ లు బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ గా ఎలా ప్రమోషన్ అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. హెచ్ఎంఆర్ఎల్ లేదా అనుబంధ సంస్థలు ఇల్లిగల్ బెట్టింగ్ అప్ ప్రమోట్ చేయడానికి ఎన్నికోట్ల ముడుపులు తీసుకొన్నారో ఈడీ దర్యాప్తు చేయాలని పిటిషనర్ కోరారు.. తెలంగాణ గేమింగ్ అమండమెంట్ యాక్ట్ 2017, అమల్లో ఉందని పిటిషనర్ కోర్టుకు తెలిపారు.. పిటిషన్‌పై విచారించి హైకోర్టు మెట్రో రైలు ఎండీకి నోటీ-సులు జారీ చేసింది.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతి వాదులకు హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

# 32 సంవత్సరాల తర్వాత ఆదర్శ ఉపాధ్యాయుల అపూర్వ సమ్మేళనం

- సమాజంతో మమేకం కావాలి
- పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో గురువుల సందేశం



**ఖమ్మం జిల్లా వెలుతురు ఏప్రిల్ 24:**
ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం డైట్ లో 32 సంవత్సరాల తర్వాత ఆనాడు చదువుకున్న ఛాత్రోపాధ్యాయులు నేడు అపూర్వ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అప్పటి గురువులతో పాటు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో పనిచేస్తున్నటువంటి పలువురు ఉపాధ్యాయులు హాజరైనారు. డైట్ కళాశాలలో తాము చదువుకున్న మధురస్మృతులను గుర్తు చేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ పూర్వస్మృతులను గుర్తు చేసుకుంటూ, ఉపాధ్యాయులుగా తాము సాధించిన విజయాలను, వ్యక్తిగత విషయాలను మిత్రులతో పంచుకుంటూ ఉల్లాసంగా గడిపారు. సరస్వతి ప్రార్థనతో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమతోపాటు విద్య నభ్యసించి నేడు ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న డాక్టర్ కే మల్లేశం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. తమకు చదువు చెప్పిన గురువులు తోటి మిత్రులు కొంతమంది చనిపోగా రెండు నిమిషాలు మౌనం పాటించి వారికి సంతాపం ప్రకటించారు.
అప్పటి గురువులు ప్రిన్సిపాల్ బాలయ్య,రాంప్రసాద్, రాజేశ్వరరావు, వజ్రయ్య, సుదర్శన్ రెడ్డి, సత్యనారాయణ, బసవరాజు, విష్ణుమూర్తి ఈ కార్యక్రమంలో హాజరై తమ సందేశాలను వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1992 93 లో టిటిసి విద్యను అభ్యసించి నేడు ఆదర్శ ఉపాధ్యాయులుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన ఉపాధ్యాయులందరూ తమ విద్యార్థులే కావడం గర్వకారణంగా ఉందన్నారు. పేద బడుగు బలహీనవర్గాల ప్రజల పిల్లలు ప్రభుత్వ పాఠశాలకు వస్తున్నందున వారిని తమ పిల్లలుగా భావించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ వారి భావి జీవితానికి చక్కని పునాదులు వేయాలని సూచించారు. అనంతరం బ్యాచ్ విద్యార్థులందరూ తమ గురువు లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరాజు, భాస్కర్, బైరెడ్డి వెంకటరెడ్డి, హరిత, సుజాత, అంకం శ్రీనివాస్, ఆర్ లక్ష్మణరావు, రాజ నరేష్ జి వెంకటేశ్వర్లు, ఆర్ శ్రీనివాస్ బుచ్చి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో వరుస ఈవెంట్స్

- నిఘా హెచ్చరికలతో భద్రత కట్టుదిట్టం




**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**
కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడి జరిగిన తరుణంలో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని కేంద్ర నిఘావర్గాల హెచ్చరికతో తెలంగాణ ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. నిఘా హెచ్చరికలతో పోలీసు శాఖ అప్రమత్తం అయ్యింది. హైదరాబాద్ లో ప్రతిష్టాత్మకమైన ఈవెంట్లు ఉన్న తరుణంలా సెక్యూరిటీని అలర్ చేసింది. ఏప్రిల్ 25, 26 తేదీల్లో భారత్ సమ్మిట్, మే 7 నుంచి మిస్ వరల్డ్-2025 ఈవెంట్లు ఉండటంతో పోలీసు వర్గాలు పటిష్టమైన నిఘా ఏర్పాటు-చేస్తున్నారు. భారత్ సమ్మిట్ లో జాతీయ, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరమైన అంశాలపై చర్చ జరగనుంది. ఈ సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సహా వంద దేశాల నుంచి దాదాపు 400 మంది హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా మిస్ వరల్డ్ పోటీ-లకు 140 దేశాల నుంచి కం-టె-స్టెంట్స్ హాజరవుతారు. ఇవన్నీ అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమాలు కావడంతో పోలీస్ యంత్రాంగానికి సవాల్ గా మారింది. ఈ కార్యక్రమాలకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు కార్యాచరణ రూపొందిస్తున్నారు. అందులో భాగంగా హెచ్ఐసీసీ, సైబరాబాద్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు పటిష్టమైన నిఘా ఏర్పాటు-చేయనున్నారు. కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడి జరిగిన తరుణంలో దేశ వ్యాప్తంగా మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్న కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికలతో రాష్ట్ర పోలీసులు అప్రమత్తం అయ్యింది. దీంతో కౌంటర్ ఇంటెలిజెన్స్ సహా అన్ని విభాగాలు అప్రమత్తం అయ్యాయి. హైదరాబాద్ సహా దేశంలో ఉగ్రవాద ప్రభావిత రాష్ట్రాలు మరింత అప్రమత్తంగా ఉండాలన్న హెచ్చరికలు జారీ చేసిన క్రమంలో ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేకంగా మానిటరింగ్ చేస్తోంది. ఈ క్రమంలో సీఎస్ శాంతికుమారి రాష్ట్ర పోలీస్ యంత్రాంగాన్ని అలర్ట్ చేశారు. నిఘా సంస్థలు హెచ్చరికలు జారీ చేసిన సందర్భంగా డీజీపీ జితేందర్ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులకు పలు అంశాలపై సూచనలు చేశారు. హైదరాబాద్‌లో ఇప్పటికే -టె-ర్రరిస్టుల దాడులకు గురైన ప్రాంతాలు సహా పర్యాటక ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశారు. కౌంటర్ ఇం-టె-లిజెన్స్ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. అనుమానితులు, సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా పెట్టినట్టు- తెలుస్తోంది. సైబరాబాద్ కమిషనరేట్ పరిసర ప్రాంతాలను గురువారం (ఏప్రిల్ 24) రాత్రి నుంచే తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. హైటెక్ సిటీ సహా విదేశీయులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో స్థానిక పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాతబస్తీ సహా అనుమానిత ప్రాంతాల్లో పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టనున్నారు.

# ఎన్‌డిఎ కూటమిలో చేరేందుకు కెటిఆర్ తహతహ

- జనతా గ్యారేజీలో హీరో కొడుకే విలన్
- అద్దంకి దయాకర్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**
ఎన్డీఏ కూటమికి దగ్గరయ్యేందుకు కేటీఆర్ ప్రయత్నాలు మొదలు పెట్టారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుకి మాజీమంత్రి కేటీఆర్ వల వేస్తున్నారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేటీఆర్ చంద్రబాబు గురించి పాజిటివ్‌గా మాట్లాడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం గాంధీభవన్‌లో అద్దంకి దయాకర్ మీడియాతో మాట్లాడారు. కనీసం కేసీఆర్ కుటు-ంబం నుంచి కాకుండా వేరే వెలమనైనా బీఆర్ఎస్ అధ్యక్షుడిని చేయగలరా అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. కేటీఆర్‌కి దమ్ముంటే పార్టీ అధ్యక్ష పదవి తీసుకొని బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తేవాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సవాల్ విసిరారు. అధ్యక్ష పదవి చేపట్టిన రెండు సంవత్సరాలకే కాంగ్రెస్ పార్టీని రేవంత్‌రెడ్డి అధికారంలోకి తెచ్చారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీకి జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరని ప్రశ్నల వర్షం కురిపించారు. కేటీ-ఆర్ వర్కింగ్ ప్రెసిడెంటో, నాన్ వర్కింగ్ ప్రెసిడెంటో ఆయనకే తెలియాలని ఎద్దేవా చేశారు. 25 సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీకా.. టీ-ఆర్ఎస్ పార్టీకా అని నిలదీశారు. తెలంగాణలో టీ-ఆర్ఎస్ పార్టీ లేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టి రెండేళ్లు అయిందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ చెప్పారు. జనతా గ్యారేజ్ సినిమాలో ఓనర్ కొడుకు విలన్ అయ్యారని.. బీఆర్ఎస్ పార్టీ జనతా గ్యారేజ్ అయితే పార్టీ ఓనర్ కొడుకు కేటీఆర్ విలనా అని సెటైర్లు గుప్పించారు. కమలం పువ్వు కాడికి గులాబీ పువ్వును అంటగడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు తాము వేర్వేరు కాదని కేటీఆర్ ఇప్పుడు ఎందుకు అంటు-న్నారని ప్రశ్నించారు. చంద్రబాబుకి తమకు సారూప్యత ఉందని కేటీ-ఆర్ చెప్పడం లేదా అని నిలదీశారు. హెచ్‌సీయూ భూముల విషయంలో బీఆర్ఎస్ హ్యాండిల్స్ నుంచి ఫొటోలు ఎందుకు డిలీట్ చేస్తున్నారో చెప్పాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నల వర్షం కురిపించారు.

# రెండుమూడు వారాల్లో కాళేశ్వరం నివేదిక

## సిద్ధంచేస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్



**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**
కాళేశ్వరం కమిషన్ ఫైనల్ రిపోర్టు రెండు మూడు వారాల్లో పూర్తి కానుంది. ప్రస్తుతం కమిషన్ విజిలెన్స్ రిపోర్టును స్టడీ చేస్తోంది. ఇప్పటి వరకు వివిధ కోణాల్లో ఇంజినీర్లను, నిర్మాణ సంస్థలను ప్రశ్నించి వారి వద్ద నుంచి అఫిడవిట్లను స్వీకరించిన కమిషన్ త్వరలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తోపాటు- అప్పటి మంత్రులు హరీశ్ రావు, ఈటల ను ప్రశ్నించే అవకాశం ఉందని తెలుస్తోంది. అక్రమాలపై విచారణ కోసం గత ఏడాది మార్చి 12న జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు- చేసింది. వివిధ కారణాలతో విచారణ ఆలస్యం అవుతుండటంతో ఇప్పటికే పలుసార్లు కమిషన్ గడవును పొడిగించగా ఈ నెలాఖరుతో గడువు ముగియనుంది. ఈనేపథ్యంలో మరోసారి ప్రభుత్వం కమిషన్ గడవు పొడిగించనున్నట్లు-సమాచారం. అయితే ప్రస్తుతం విచారణ కీలక దశకు చేరుకుంది. కమిషన్ తుది దశ విచారణను ఇవాళ ప్రారంభించింది. ఇప్పటికే అధికారులు, నిర్మాణ సంస్థలు, నిపుణులను ప్రశ్నించిన కమిషన్ దాని ఆధారంగా 400 పేజీల నివేదికను సిద్ధం చేసినట్లు- తెలిసింది. దాదాపు 90 శాతం రిపోర్టు పూర్తిచేసిన కమిషన్ ఎన్‌డీఎస్ఏ ఫైనల్ రిపోర్టు కోసం ఎదురుచూస్తున్నట్లు-సమాచారం. ఈ మేరకు తది నివేదిక కోసం ఎన్డీఎస్ఏకు మరోసారి లేఖ రాసింది. ఆ నివేదిక మరో మూడు వారాల్లో వచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఫైనల్ రిపోర్టును అందజేయనుంది.

# సంపాదకీయం..

## ఉగ్రవాదుల ఏరివేతకు కాశ్మీర్‌ను జల్లెడ పట్టాలి !

పర్యాటక స్వర్గధామం అయిన జమ్మూ కాశ్మీర్‌లో నరమేథం సృష్టించడం ద్వారా అక్కడ సాధారణ పరిస్థితులు రాకుండా...సామాన్య జనం అక్కడ లేకుండా..ముఖ్యంగా హిందువులను లేకుండా చేయాలన్న ముస్లిం ఉగ్రవాదుల కుట్రలో భాగమే తాజా నరమేధానికి నిదర్శనం. 370 ఆర్టికల్ రద్దు తరవాత కాశ్మీర్ అభివృద్ది చెంది, పర్యాటకంగా పునరుత్తేజం పొందడాన్ని ఉగ్రవాదులు, వారికి సహకరిస్తున్న పాక్ జీర్ణించుకోవడం లేదు. ఈ దాడిని ముందే పసిగట్టడంలో కూడా భద్రతాబలగాలు విఫలం అయ్యారు. ఇకపోతే ఇదొక అనుభవంగా, గుణపాఠంగా కాశ్మీర్‌ను మొత్తం మిలిటరీకి అప్పగించాలి. శ్రీలంకలో ఈలం అన్నది లేకుండా చేసేందుకు సైనిక చర్య చేపట్టి విజయం సాధించారు. అనేక దేశాల్లో ఇలాంటి ఆపరేషన్లు జరిగాయి. ఇప్పుడు కాశ్మీర్‌లో జల్లెడ్ పట్టాలి. అణువణువు పరిశీలించాలి.. అక్కడి స్థానికులను రక్షిస్తూనే... కొత్తగా వస్తున్న వారిపై నిఘా పెంచాలి. జల్లెలడ పట్టాలి. లెఫ్ట్ తీవ్రవాదం కన్నా ఇస్లామిక్ తీవ్రవాదం చాలా ప్రమాదకరం. మావోయిస్టులను ఏరివేసే పనిని పక్కన పెట్టి కాశ్మీర్‌లో ఇస్లామిక్ తీవ్రవాదులను ఏరివేసే కార్యక్రమాలను ముమ్మరం చేయాలి. ఈ క్రమంలో పాక్‌తో సరిహద్దుల్లో భద్రత పటిష్టం చేయాలి. అలాగే ఆక్రమిత కాశ్మీర్‌లో నరమేథానికి శిక్షణ ఇస్తున్న శిబిరాలను లేపేయాలి. అవసరమైతే పాక్ ఆక్మిత కాశ్మీర్‌ను విలీనం చేసుకోవాలి. అందుకు కార్యాచరణ సిద్దం చేయాలి. భారత్ అంటే బలమేమిటో సత్తా చాటి పాక్‌కు గట్టిగా బుద్ది చెప్పాలి. మాటలతో పాక్ దారికి రాదు. దానికి గట్టిగా ఉద్ది చెప్పేందుకు సైనిక చర్యకు దిగాలి. 2008లో ముంబై దాడి తర్వాత సివిలియన్లపై జరిగిన రెండో అతిపెద్ద ఉగ్రదాడి ఇదే. జమ్మూ కాశ్మీర్ ప్రాంతం పాకిస్తానీ తీవ్రవాదులకు ఇంకా నిలయంగానే ఉందని ఈ సంఘటన చెపుతున్నది. ఉగ్రసంస్థ మతపరమైన లక్ష్యాలను సాధించడానికి లేదా ఒక నిర్దిష్ట మత సమూహానికి వ్యతిరేకంగా దాడులు నిర్వహిస్తోంది. ప్రస్తుతం జరిగిన సంఘటన ఈ రకమైనదే. తహావూర్ హుస్సేన్ రాణాను అమెరికా భారత్‌కు అప్పగించిన తర్వాత దేశంలో ఉగ్రవాద చర్యలు జరిగే అవకాశం ఉందనే సమాచారం కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థ ముందుగానే తెలిపింది. అయితే, కేంద్రం, జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం సున్నిత పర్యాటక ప్రాంతమైన జమ్మూలో ముందుగానే కేంద్ర, రాష్ట్ర బలగాలను అప్రమత్తం చేయడంలో కొంత విఫలమైనట్టు ఒప్పుకోవాలి. ఇప్పటికైనా పర్యాటకులకు ఆటంకం లేకుండా నిరంతర గస్తీని పెంచాలి. బలగాలను ప్రతి గ్రామంలోనూ మొహరించాలి. ప్రపంచంలో ఇస్లామిక్ ఉగ్రవాదం భయంకరమైనదిగా నరరమేథం సృష్టిస్తోంది. దీనిని ప్రపంచ ముస్లింలు కూడా తీవ్రంగా వ్యతిరేకించాలే చర్యలకు పూనుకోవాలి. జమ్మూకాశ్మీర్లో మతపరమైన లక్ష్యాలు సాధించేందుకు ఉగ్రదాడులు జరుగుతున్నాయి. ఇస్లామిక్ టెర్రరిస్ట్ గ్రూపులు అయిన లష్కర్ -ఏ -తోయిబా, జైష్ -ఏ - మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థలు ఈ దాడులు చేస్తున్నాయి. వీరిని ఏరివేసేందుకు ఎలాంటి మీనమేషాలు లెక్కించరాదు. ఎంత కఠినమైన పనయినా వీరిని కలుపు మొక్కల్లా ఏరిపారేయాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వానికి ఉగ్రవాదాన్ని అణచివేసే శక్తి లేకపోవడం వల్ల కేంద్ర మిలిటరీ వ్యవస్థ జమ్మూకాశ్మీర్ ప్రాంతాన్ని తమ అధీనంలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. పాక్ తన కుయుక్తులను కేవలం ఉగ్రదాడులకే ఉపయోగిస్తోంది. పాక్‌ను ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మడం కాదు...దానిని అన్ని రకాలుగా నిర్వీర్యం చేయాలి. ఇప్పటికే అనేక మారణహోమాలు సాగాయి. ఇలాగే మిన్నకుంటే మరిన్ని దాడులు జరుగుతాయి. భారత్‌పై కన్నేస్తే అంతే సంగతులు అన్నట్లుగా పరిస్థితులు మారాలి. ఇజ్రాయిల్ తరహా శిక్షణతో సైన్యాన్ని రాటుదేలించాలి. పాక్‌ను ప్రపంచంతో వేరు చేసే అన్ని చర్యలు తీసుకోవాలి. అలాగే భారత్ నుంచి ఎలాంటి సాయం అందకుండా చూడాలి. ఈ క్రమంలో ఇలాంటి టెర్రరిస్టుల దాడులను తీవ్రంగా తీసుకోవాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉంది. తాజా దాడిలో ప్రత్యేకంగా హిందూవర్గంవారిని గుర్తించి మరీ కాల్పులు జరపడం అందరూ ఆలోచించా ల్సిన విషయం. పహల్గాంలో జరిగిన సంఘటనలో బాధితుల ముందు తీవ్రవాదులు చేసిన వ్యాఖ్యలు అత్యంత అమానవీయమైనవి. దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు వారి వ్యాఖ్యల్లో కనిపిస్తున్నాయి. గత మూడేళ్లుగా కాశ్మీర్ పర్యాటక రంగం పుంజుకుంది. కాశ్మీరీలకు ఉపాధి అవకాశాలు బాగా పెరిగాయి. ఈ తీవ్రవాదులు చేసిన మతాధార మారణకాండ..పుంజుకుంటున్న కాశ్మీర్ ఆర్థిక పరిస్థితిని తిరిగి దెబ్బతీసే అవకాశం ఉంది. అలాగే కాశ్మీర్ పర్యాటక రంగం మళ్లీ దెబ్బతింటే, అది కాశ్మీరీల ఉపాధిపైన తీవ్రమైన ప్రభావం చూపనుంది.ఈ క్రమంలో కేంద్రం తీసుకున్న కొన్ని చర్యలు సమర్థనీయమైనవే. పాక్ పౌరులకు భారత్‌లోకి నో ఎంట్రీ సార్క్ వీసాలన్నీ రద్దుచేయడాన్ని స్వాగితించాల్సిందే. 28మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చడమే కాకుండా ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన వారు లేదా, ఆ దేశంతో సంబంధాలున్న స్థానిక ఉగ్రవాదులుగా నిర్ధారణ అయిన నేపథ్యంలో భారత్ ఈ దాడిని తీవ్రంగా పరిగణించింది. సౌదీ అరేబియా పర్యటనను అర్ధంతరంగా కుదించుకుని బుధవారం ఉదయం భారత్ తిరిగివచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ ఉదయంనుంచి కశ్మీర్‌లో పరిస్థితిపైన ఎడతెరిపి లేకుండా కేంద్రమంత్రులు, ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. సాయంత్రం ప్రధాని మోడీ అధ్యక్షతన అత్యవసరంగా సమావేశమైన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సంచలన నిర్ణయాలు తీసుకొంది. సార్క్ ఒడంబడికలో భాగంగా సభ్యదేశమైన పాకిస్థాన్ పౌరులకు జారీచేసిన వీసాలన్నిటినీ రద్దు చేస్తున్నట్లు, ఈ వీసాలున్న పాకిస్థాన్ పౌరులు 48గంటల్లోగా భారత్‌ను వదిలి వెళ్లాలని, ఆ దేశ పౌరులను దేశంలోకి అనుమతించేది లేదని విదేశాంగ శాఖ ప్రకటించింది. ఇప్పటికే సరిహద్దు దాటిన పాక్ పౌరులు మే 1లోగా తిరిగి వెళ్లిపోవాలని ఆదేశించింది. అటారీ వాఘా వద్ద ఇరుదేశాల సరిహద్దుల్లో ఉన్న ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టునుసైతం తక్షణం మూసి వేయాలని నిర్ణయించింది. పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతును నిలిపివేసే దాకా సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపి వేయాలని కూడా సమావేశం నిర్ణయించింది. 1960లో ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం సింధు నదితో పాటుగా దాని ఉపనదుల ద్వారా పాక్‌లోని లక్షలాది ఎకరాలకు సాగు నీటితో పాటు పలు ప్రాంతాలకు తాగు నీరు లభిస్తుంది. మన దేశంలోని పాక్ దౌత్య కార్యాలయంలో ఉన్న రక్షణ లేదా, మిలిటరీ సలహాదారులను వెనక్కి పంపించి వేయాలని నిర్ణయించింది. అలాగే పాక్‌లోని మన దౌత్యకార్యాలయంలో ఉన్న ఈ సలహాదారులను కూడా వెనక్కి పిలిపిస్తారు. మే 1నుంచి మొత్తంమీద ఇరు దేశాల హైకమిషన్ కార్యాలయాల్లో సిబ్బందిని ఇప్పుడున్న 55నుంచి 30 కి కుదించాలని నిర్ణయించారు. ఇవ చేస్తూనే కాశ్మీర్‌ను మిలిటరీ కేంద్రంగా మార్చాలి. అక్కడ నిరంతర నిఘా పెంచాలి. ఉగ్రవాదుల ఏరివేతకు జల్లెడ పట్టాలి.

# ధాన్యం కొనుగోళ్లలో తిరకాసులు

- రైతులను నిండా ముంచుతున్న మిల్లర్లు

**ఖమ్మం,ఏప్రిల్24( వెలుతురు):**



జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల తరుగు విషయంలో కొందరు మిల్లర్లు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతుంది. రైతుల నుంచి ధాన్యం సేకరణ సమయంలో ఎలాంటి తరుగు తీయొద్దని మంత్రులు, కలెక్టర్లసహా అధికారులు స్పష్టంగా చెబుతున్నా మిల్లర్లు పట్టించుకోవడం లేదు. రెండు, మూడు రోజులుగా క్వింటాకు 4 నుంచి 5 కిలోల వరకు తరుగు తీస్తేనే ధాన్యం కొనుగోలు చేస్తామని, మిల్లు దగ్గరకు లోడ్ వచ్చినా తరుగు తీస్తేనే అన్‌లోడ్ చేసుకునేందుకు ఒప్పుకుంటామని మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా మిల్లర్లకు భయం కలగడం లేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఖమ్మం జిల్లాలో ఈ సీజన్ లో 1.85 లక్షల టన్నుల సన్న ధాన్యం, 73 వేల టన్నుల దొడ్డు రకం ధాన్యం కలిపి మొత్తం 2.58 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 1,317 మంది రైతుల నుంచి రూ. 24.66 కోట్ల విలువైన 10,628.760 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 8,900 టన్నుల సన్న రకం ధాన్యం కాగా, మిగతాది దొడ్డు రకం ధాన్యమని అధికారులు చెబుతున్నారు. రైస్ మిల్లుల దగ్గర, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో తరుగు పేరిట కోతలు లేకుండా పర్యవేక్షణ జరుపుతున్నామని ఒకవైపు ఆఫీసర్లు చెబుతున్నా, తరుగు తీస్తేనే కాంటాలు వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తయిన ధాన్యాన్ని తరలించేందుకు సరైన సమయంలో లారీలు అందుబాటులో ఉండడం లేదు.మరికొన్ని కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు అందుబాటులో లేని కారణంగా ఇప్పటి వరకు కాంటాలు ప్రారంభం కాలేదు. కారేపల్లి మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో మాదారం, సొసైటీ- ఆధ్వర్యంలో విశ్వనాథపల్లి, సీతారాంపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు- చేశారు. విశ్వనాథపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి కొందరు రైతులు మూడు రోజుల కిందనే ధాన్యం తీసుకొచ్చారు. బస్తాలు లేకపోవడంతో నిర్వాహకులు కొనుగోలు ప్రారంభించలేదు. కారేపల్లి సొసైటీ- సిబ్బంది 20 రోజుల కిందనే జిల్లా సివిల్ స్లపై అధికారికి బస్తాలు కావాలని ఇండెంట్ కూడా పెట్టారు. ఇప్పటి వరకు బస్తాలు రాలేదు. గన్నీ బస్తాల కొరతతో కొనుగోలు ప్రారంభించకపోవడంతో కేంద్రానికి ధాన్యం తెచ్చిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇకపోతే కొనుగోలు కేంద్రాల్లో తరుగు విషయంలో మిల్లర్లు ఇబ్బంది పెడుతుండడంతో బాధిత రైతులు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు మిల్లర్లు కూడా తమ పరిస్థితిని సమర్థించుకుంటున్నారు. తాము క్వింటాకు 67 కిలోల బియ్యాన్ని లేవీగా ఇవ్వాల్సి ఉంటుందని, ఈ సీజన్ లో పండిన ధాన్యాన్ని మర ఆడిస్తే 60 కిలోలు మాత్రం బియ్యం వస్తున్నాయని చెబుతున్నారు. ఎక్కువ వేడి కారణంగా బియ్యం నూకగా మారడంతో తాము నష్టపోతున్నామని, ధాన్యం తరుగు తీస్తేనే తమకు గిట్టుబాటు- అవుతుందని అంటున్నారు. ఒకవైపు అకాల వర్షాలతో ఎప్పుడు వాన కురుస్తుందోనన్న భయం ఉండగా, కాంటాలు పూర్తయిన ధాన్యాన్ని తరలించకపోవడంతో వాటిపై పట్టాలు కప్పి అక్కడే నిల్వ ఉంచారు.

# గోదావరి -బనకచర్లను ఆపండి

- నదీయాజమాన్య బోర్డులకు ఇఎన్‌సి లేఖ



**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**

గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ లేఖ రాసింది. గోదావరి - బనకచర్ల లింక్ విషయంలో ఏపీ ముందుకెళ్లకుండా చూడాలని లేఖలో పేర్కొంది. ఎలాంటి అనుమతుల్లేకుండా ప్రాజెక్టు చేపడుతున్నారని గతంలో తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపామని ఈఎన్సీ వెల్లడించింది. పనులు విభజన చట్టం, -ట్రైబ్యునల్ అవార్డులకు విరుద్ధమని... తెలంగాణకు నష్టం జరుగుతుందన్న ఈఎన్సీ తెలిపింది. ఈ నెల ఏడో తేదీన జరిగిన జీఆర్ఎంబీ సమావేశంలోనూ ఈ అంశాన్ని ప్రస్తావించామంది. ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆ రోజు జీఆర్ఎంబీ ఛైర్మన్, ఏపీ సభ్యులు సమాధానం ఇచ్చారని తెలిపింది. కానీ, మరుసటి రోజే గోదావరి - బనకచర్ల లింక్ కోసం ఏపీ ప్రభుత్వం జలహారతి కార్పోరేషన్ ఏర్పాటు- చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలంగాణ ఈఎన్సీ పేర్కొంది. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించి ఏపీని నిలువరించాలి. పోలవరం ప్రాజెక్టు, తాడిపూడి ఎత్తిపోతల పథకాలపై ఇందుకు సంబంధించిన ఎలాంటి టెండర్ల పక్రియ చేపట్టవద్దు. కృష్ణా జలాలకు సంబంధించి -ట్రైబ్యునల్ లో వాదనలు జరుగుతుండగా... జలాల మళ్లింపు కోసం ఉత్తర్వులు ఇవ్వరాదు. ఏపీ జారీ చేసిన జలహారతి కార్పోరేషన్ ఉత్తర్వులను నిలిపివేసేలా చూడాలని తెలంగాణ ఈఎన్సీ లేఖలో స్పష్టం చేసింది.



# అమరావతిలో చురుకుగా ప్రధాని సభ ఏర్పాట్లు

- మరోమారు అధికారులతో కలసి పరిశీలించిన మంత్రి
- ప్రధాని రాకతో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు

**అమరావతి,ఏప్రిల్24( వెలుతురు):**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మే2వ తేదీన రాజధాని అమరావతిలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో ప్రధాని ఏర్పాట్లకు సంబంధించి ఎలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. గురువారం సభ ఏర్పాటు చేసే వేదికను మంత్రి నారాయణ, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. అమరావతి రాజధాని పనులు పునః ప్రారంభానికి ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని తెలిపారు. మే 2వ తేదీన మోదీ రాకకు ఏర్పాట్లు- చేస్తున్నామని చెప్పారు. ప్రధాని పర్యటన సందర్భంగా 8 రోడ్డులను పోలీస్ అధికారులు గుర్తించారని.. ఎక్కడ ట్రాఫిక్ జామ్ నెలకొనకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ అన్నారు. ప్రధాని సభ కోసం వచ్చే వారు వాహనాలు పార్కింగ్ చేయడానికి 11 ప్రాంతాలను గుర్తించామని మంత్రి నారాయణ తెలిపారు. వైసీపీ హయాంలో గత ఐదు సంవత్సరాలు అమరావతి రైతులు ఇబ్బంది పడ్డారని చెప్పారు. కనీసం ముగ్గురు, నలుగురు అమరావతి రైతులను పిలిచి సన్మానించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావించారని అన్నారు. ప్రధాని కేవలం గంటన్నర మాత్రమే అమరావతి పర్యటన కోసం సమయం ఇచ్చారని తెలిపారు. ప్రధాని మోదీ భద్రత దృష్ట్యా పటిష్ట చర్యలు చేపడుతున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. అదనపు ల్యాండ్ పూలింగ్ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్నామని మంత్రి నారాయణ చెప్పారు. ప్రజలు ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరిస్తే చేస్తామని.. లేకపోతే భూసేకరణ విషయంపై ప్రభుత్వం ఆలోచిస్తుందని అన్నారు. హైదరాబాద్‌లో గతంలో ఒక ఎయిర్‌పోర్ట్ ఉండేదని... అయినా శంషాబాద్ నిర్మించారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో ఇప్పుడు రెండో ఎయిర్‌పోర్ట్ లేకపోతే పదిశాతం విమానాలు కూడా దిగేవి కావని అన్నారు. రానున్న 100 సంవత్సరాలను దృష్టిలో పెట్టు- కొని సీఎం చంద్రబాబు అమరావతి నిర్మాణాన్ని ఏర్పాటు- చేస్తున్నారని మంత్రి నారాయణ పేర్కొన్నారు.



# కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత సెర్చ్

- ఎదురు కాల్పుల్లో జవాన్ మృతి

**శ్రీనగర్,ఏప్రిల్24( వెలుతురు):**

జమ్మూ కాశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. గురువారం ఉదయం భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో జవాను మరణించాడు. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం.. జిల్లాలోని డూడు-బసంత్‌గఢ్ ప్రాంతంలో కాల్పులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందడంతో సెర్చ్ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. దట్టమైన అడవి ప్రాంతం కావడంతో ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు భద్రతా బలగాలు తీవ్రంగా శ్రమిస్తున్నారని.. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఉగ్రవాదులను ఎరివేసేందుకు బలగాలు సెర్చ్ ఆపరేషన్ ముమ్మరం చేశారు.

# యూఎస్ పర్యటన రద్దు చేసుకుని వచ్చిన రాహుల్



**న్యూఢిల్లీ,ఏప్రిల్24( వెలుతురు):**

పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ సభ్యుడు రాహుల్ గాంధీ అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. గురువారం ఉదయం న్యూఢిల్లీలో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ- (సిడబ్ల్యూసి) సమావేశానికి రాహుల్ గాంధీ చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అమెరికా పర్యటన రద్దు సంబంధించిన ప్రకటనను ఎక్స్ లో పోస్ట్ చేశారు. మంగళవారం జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో కనీసం 26 మంది మరణించారు. ముఖ్యంగా, పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సౌదీ అరేబియా పర్యటనను, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా..

- పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ...



**కూకట్ పల్లి ఏప్రిల్ 24 వెలుతురు:**
శేర్లింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పిఏసి చైర్మన్, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ 1వ ఫేస్, ఆల్విన్ కాలనీ 2వ ఫేస్, తులసి నగర్, శ్రీ తులసి నగర్, కాకతీయ నగర్, చంద్రమ్మ బస్తి, పంచమి కాలనీ, ఉజ్జయిని మహంకాళి నగర్ కాలనీలలో రూ. 2 కోట్ల 8 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణము పనులకు స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని అన్నారు. సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అఖిలభారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కన్నెబోయిన జ్యోతి బలరాం యాదవ్ మాజీ ఎంపీపీ రామన్నపేట ఎన్నిక



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 24**
అఖిల భారత యాదవ మహా సభ తెలంగాణ రాష్ట్ర మహిళా అదక్షురాలు బొంతు శ్రీదేవి యాదవ్ వారి స్వగృహం బంజర హిల్స్ యాదాద్రి భువనగిరి జిల్లా అఖిల భారత యాదవ మహా సభ జిల్లా అధ్యక్షురాలు గా నరాల నిర్మల వెంకటస్వామి యాదవ్ ,అఖిల భారత యాదవ మహా సభ జిల్లా ప్రధాన కార్యదర్శి గా కన్నెబోయిన జ్యోతి బలరాం యాదవ్, లను నియమించి వారికి నియామక పత్రాలు అఖిలభారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొంతు శ్రీదేవి చేతులమీదుగా వీరికి నియామక పత్రం లు అందజేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహా సభ యాదాద్రి జిల్లా అధ్యక్షులు సుక్కల సత్యం యాదవ్, యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండేబోయిన అయోధ్య యాదవ్, అఖిల భారత యాదవ, మహా సభ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఎడుమేకల అశోక్ యాదవ్, ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## హజ్రత్ సయ్యద్ షా అజీజోద్దీన్ ఖాద్రీ సాహిబ్ (RA) మరణం తీరని లోటు

- డాక్టర్ ఉజ్వల్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన సుప్రసిద్ధ, ప్రఖ్యాత వ్యక్తి, సూఫీ బా సఫా పిర్ తారిఖత్ రహ్బర్ షరియత్, హజ్రత్ సయ్యద్ షా అజీజోద్దీన్ ఖాద్రీ (%=ూ%) మరణం పట్ల రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి హజ్రత్ నివాసమైన మొహల్లా గడికి చేరుకుని, కుటుంబ సభ్యులను కలుసుకుని, తన తీవ్ర విచారం, దుఃఖాన్ని వ్యక్తం చేసి సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉజ్జల్ రెడ్డి మాట్లాడుతూ... హజ్రత్ మరణం పట్ల, కుటుంబ సభ్యులు మాత్రమే కాకుండా, మన జిల్లా సంగారెడ్డి ప్రజలు, ఆయా దేశాలలోని అన్ని మతాలకు చెందిన ప్రజలు నష్టపోయారని పేర్కొన్నారు. ఎందుకంటే హజ్రత్ ఖిబ్లా ముస్లింలలోనే కాకుండా అన్ని మతాలు, దేశాలలో కూడా అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తి అని అభివర్ణించారు. ప్రతిరోజూ హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు ఆయన ప్రార్థనల నుండి ప్రయోజనం పొందేవారని అన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ షా హుసాముద్దీన్ ఖాద్రీ ఖలాఫ్ అక్బర్, సయ్యద్ షా మొహిబుద్దీన్ ఖాద్రీ బాబా సాహిబ్, సయ్యద్ షా అఫ్సర్ పాషా ఖాద్రీ సాహిబ్, బ్రదర్ సజ్జాదా నషిన్, సయ్యద్ ఫర్హాన్ ఖాద్రీ బగ్దాదీ, సయ్యద్ జియావుద్దీన్ ఖాద్రీ బాగ్దాదీ, సయ్యద్ జియావుద్దీన్ ఖాజిద్ ఇమాం-మద్దీద్ ఇమాంతి-మద్జిద్ ఖాజ్ సర్పంచ్, మహమ్మద్ జమీల్ మైనార్టీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నరసింహారెడ్డి మండల అధ్యక్షుడు కాంగ్రెస్, మహమ్మద్ అక్బర్ కాంగ్రెస్ నాయకుడు, నాగిరెడ్డి పటేల్, శ్రీకాంత్ రెడ్డి, సయ్యద్ మోయిజ్ ఖాజీ, మహమ్మద్ ఇనాయత్ అలీ, మహమ్మద్ బర్కత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదం అంతం చేయాలి..?

**వెలుతురు న్యూస్ ఏప్రిల్ 24**
2019 ఆగస్టులో కాశ్మీర్ కు ప్రత్యేక ప్రతి పత్తి నుంచి ఆర్టికల్ 370 ను రద్దు చేసిన అనంతరం కాశ్మీర్లో అల్లర్లు సృష్టించాలని ఉద్దేశంతో హి జిబ ల్ ముజాయిద్దీన్, లష్కర్ ఏ తా యిబ , ఎల్ఈటి,కి చెందిన ఉగ్రవాద కమాండర్లు టిఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థను స్థాపించడం జరిగింది. టిఆర్ఎఫ్ సంస్థకు షైక్ సజ్జత్తుల్ సుప్రీం కమాండర్ గా వ్యవహరిస్తున్నారు, మరో ఉగ్రవాది బాసిత్ హమ్మద్ దా ర్ చీఫ్ ఆఫ్ ఆపరేషన్ కమాండర్ గా పనిచేస్తున్నాడు. ఈ సంస్థను భారతదేశం నిషేధించడం జరిగింది. కానీ ప్రస్తుతం దేశంలో కేంద్ర ప్రభుత్వం అంతం చేయాల్సింది. నక్సలిజాన్ని కాదు ఈ దేశంపై కన్నేసి అరాచకాన్ని సృష్టిస్తున్న నరమేధాన్ని చేస్తున్న ఉగ్రవాదాన్ని అంతమొందించాలి అది ఈ కేంద్ర ప్రభుత్వం బాధ్యత ఆపరేషన్ కగార్ తో భూ సమస్యలు, పేద ప్రజల కోసం పోరాటం చేస్తున్న నక్సలైట్లను అంతం చేయడం కాదు కేంద్ర హొం మంత్రి అమిత్ షా చేయాల్సిన బాధ్యత ప్రస్తుత కర్తవ్యం. మంగళవారం మధ్యాహ్నం సమయంలో భూతల స్వర్గం జమ్మూ కాశ్మీర్లో మినీ స్విట్జర్లాండ్ పిల్చుకునే పహల్గాం బైసరాన్ ప్రాంతంలో ఉగ్రవాదుల కా ల్పుల మోతతో యుద్ధ వాతావరణం నెలకొల్పి సుమారు 30 మంది భారతీయుల ప్రాణాలను లష్కరి ముసుకు సంస్థ అయిన టిర్ ఎఫ్(ది రెసిస్టెన్స్ ఫ్రంట్) కాల్చి చంపేసింది. అందమైన మైదానాలు మంచుకొండలతో భూతల స్వర్గంగా ప్రకృతి సిద్ధంగా ఉన్నటువంటి అటవీ ప్రాంతం సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం కి ఎలాంటి రవాణా సౌకర్యాలు లేకుండా కాలినడకన గుర్రాల ద్వారా మాత్రమే వెళ్ళగలిగే ప్రాంతం బైసారం ప్రాంతం. వేసవి కాలం కావడంతో, పర్యాటకులు తాకిడి ఎక్కువగా ఉంది. ఉగ్రవాదులు అదును చూసి భారీ ఆయుధాలతో అటవీ ప్రాంతం ద్వారా ప్రకృతిని ఆస్వాదిస్తున్న పర్యాటకులపై అమాంతం కాల్పులకు తెగబడ్డారు. అదే టైంలో అక్కడికి చేరుకున్న రెండు పర్యాటక బస్సులను సైతం ఉగ్రవాదులు చుట్టుముట్టి అందులో ఉన్న వారిపై కూడా విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. అంతేకాకుండా సైన్యం రూపంలో దుస్తులు ధరించి మరి కాల్పులు జరపడంతో పర్యాటకులకు అక్కడున్న వారందరికీ ఏం జరుగుతుందో అన్న భయాందోళన గురై చేరుకునే లోపే సుమారు 30 మంది బలైపోయారు. ఇకపోతే ప్రస్తుతం కాశ్మీర్లో పాలిస్తున్నటువంటి ఎన్సిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఉగ్రవాద సంస్థలకు సానుభూతిగా వివరిస్తూ అండదండలు అందిస్తున్నాయి. అనేది జగమెరిగిన సత్యం. అడుగడుగునా కేంద్ర బలగాలు మొహరించి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సహకారం లేకుండా సైన్యం గాని ప్రజలు గాని ప్రశాంతమైన వాతావరణం సుఖమైన జీవితాన్ని అనుభవించలేరు. అంతేకాకుండా ఉగ్రవాదంపై ఉక్కు పాదాన్ని మోపాలి. దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు స్వచ్ఛంద సంస్థలు అందరూ ఏకతాటిపై వచ్చి ఈ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ పై నిషేధం విధించాలి. వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందకుండా ప్రపంచవ్యాప్తంగా ఆంక్షలు విధించే విధంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలి. అంతేకాకుండా కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నటువంటి పాకిస్తాన్ మరియు ఆ దేశం పెంచి పోషిస్తున్న ఉగ్రవాద సంస్థల మూలాలను తుడిచిపెడుతూ ప్రతీకార చర్య తీసుకోవాలని ప్రజలంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. అది పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం శాంతి కోరుకుంటూ ఇతర దేశాలు ఉగ్రవాదాన్ని ఆకాంక్షిస్తే సమస్య పరిష్కారం కాదు మాటకు మాట తూటాకు తూటా అనే సమాధానమవుతుంది కావున వెంటనే ఎంత రిస్క్ అయినా సైనిక చర్యను ప్రకటించి భారతదేశంలో ముఖ్యంగా కాశ్మీర్ ప్రాంతంలో ఉగ్రవాద మూలాలను లేకుండా చర్యలు తీసుకోవాలి అప్పుడే భారతదేశం ఆధ్యాత్మికత ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుంది. ఈ పాశవిక దాడిలో మృతి చెందిన కుటుంబాలకు దేశ ప్రజలంతా సానుభూతి తెలియజేస్తూ గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయాలి.



విశ్లేషణ: కూనూరు శ్రీనివాస్ గౌడ్

## రాష్ట్ర ద్వితీయ ర్యాంకర్ అద్నాన్ కు ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే మాణిక్ రావు



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల పరధిలోని శేఖాపూర్ గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ ఆటో డ్రైవర్, హుమెర బేగం (గృహిణి)ల కుమారుడు షేక్ అద్నాన్ సమీ ఇటీవలే విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాలలో ఎంపిసి గ్రూపులో 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించి రాష్ట్ర వ్యాప్తంగా రెండవ ర్యాంక్ సాధించిన సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు సన్మానం చేసి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకప్పుడు చదువులో శేకపూర్ గ్రామం వెనకబడి ఉందని, మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామం నుంచి విద్యార్థులు ఎస్సెస్సి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఫలితాల్లో సత్తాచాటి తమ గ్రామ పేరును రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు చేస్తున్నారని, ముఖ్యంగా ఆటో డ్రైవర్ అయిన మహేబూబ్ పాష బ్రతుకు దేరువు కోసం హైదరాబాద్ వెళ్లి తమ కుమారునికి ఉన్నత విద్యావంతుడు చేయాలనే సంకల్పంతో తన కుమారుడైన షేక్ అద్నాన్ ను ఇంటర్మీడియట్ లో జాయిన్ చేయడంతో మార్చిలో జరిగిన పరీక్షల ఫలితాల్లో రాష్ట్రస్థాయి రెండవ ర్యాంక్ సాధించడం మాములు విషయం కాదని, భవిష్యత్తులో కూడా అద్నాన్ చదువుల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, మాజీ సర్పంచ్ చిన్న రెడ్డి, యువ నాయకులు మిథున్ రాజ్, గణేష్ పూర్ గ్రామ మాజీ సర్పంచ్ మొహమ్మద్ గౌసోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి డిఎస్ఓ కాశీ విశ్వనాథంను కాపాడుతున్నదెవరు..?

- ధాన్యం పేరుతో కోట్లాది రూపాయలు దండుకున్న ఘనుడు
- ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినా పట్టించుకోరా...?
- జిల్లా ఉన్నతాధికారుల తీరుపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తా
- బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**వనపర్తి వెలుతురు ఏప్రిల్ 24:**
వనపర్తి జిల్లాలో ధాన్యం పేరుతో కోట్లాది రూపాయలు దండుకుంటూ... తీవ్ర అవినీతికి పాల్పడుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం వనపర్తి జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ డీఎస్ఓ అవినీతి అక్రమాలపై గత కొన్ని నెలలుగా ప్రధాన పత్రికల్లో చాలా కథనాలు వస్తున్నా కూడా ఉన్నతాధికారులు స్పందించడం లేదన్నారు. కరెంటు లేని మిల్లులకు, యంత్రాలు లేని మిల్లులకు ధాన్యం కేటాయించినట్టు ఆధారాలు ఉన్నప్పటికీ జిల్లా ఉన్నతాధికారుకు ఆయనను ఎందుకు కాపాడుతున్నారో అర్థం కావటం లేదన్నారు. డిఎస్ఓ కాశి విశ్వనాథ్ చేస్తున్న అక్రమాలకు ఉన్నతాధికారులకు ఏమైనా భాగస్వామ్యం ఉందేమో అన్న అనుమానం జిల్లా ప్రజలకు కలుగుతుందన్నారు. బ్లాక్ లిస్టులో ఉన్న మిల్లులకు, పిడిఎస్ బియ్యం పట్టుబడి, కేసులు నమోదైన వారికి ధాన్యం కేటాయించట్లేదని నీతి వాక్యాలు చెబుతున్న ఉన్నతాధికారులు నిబంధనలకు పాతర పెట్టి అసోసియేషన్ పెద్దలకు మరియు బడా మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలన్నారు. సాధారణ మిల్లర్లకు ఒక న్యాయం...బడా మిల్లర్లకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. కాసులిస్తే ఉన్నతస్థాయి అధికారులను సైతం తప్పుదోవ పట్టించే స్థాయిలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తెగబడుతున్నారని, ఎలాంటి పని చేయడానికైనా సిద్ధమవుతున్నారన్నారు. వనపర్తి మండలంలో అసంపూర్తిగా ఉన్న ఓ బియ్యం మిల్లుకు పూర్తి స్థాయిలో యంత్రాలు ఏర్పాటు చేయని, విద్యుత్తు కనెక్షన్ లేకపోయినా ధాన్యం కేటాయించారని, వీటిలో 47 వేల బస్తాలు దారి మళ్లినట్లు ఇటీవల విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారుల తని ఖీల్లో బయటపడిందన్నారు. మిల్లుల్లో మర ఆడించే యంత్రాలు తొలగించి ఏడాదైనా అధికారులకు సమాచారం లేకపోవడం విస్తు గొలిపే అంశమని, సీఎంఆర్ ధాన్యం కేటాయించిన మిల్లులు ఎక్కడ ఉన్నాయి? అవి మర ఆడిస్తున్నాయా? లేవా? అనేది కూడా తెలియని దుస్థితి జిల్లాలో నెలకొందన్నారు. కొందరు అధికారులు నిబంధనల్లోని చిన్న చిన్న వెసులుబాటును ఆసరాగా చేసుకొని వ్యక్తిగత ప్రయోజనాల కోసం మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా పౌరసరఫరాల శాఖలో ఓ ప్రైవేటు వ్యక్తి అన్నీ తానై కార్యకలాపాలు సాగిస్తున్నాడని, ప్రధాన పత్రికలో కథనం ప్రచురితమైందని దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డీఎస్ఓ అవినీతి అక్రమాలపై జిల్లా కలెక్టరు గారికి, సివిల్ సప్లయ్ కమిషనర్ గారికి మరియు డీజీ (విజిలెన్స్) గారికి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అవినీతి అధికారులను ప్రోత్సహిస్తున్న జిల్లా ఉన్నతాధికారుల తీరుపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్, శ్రీరంగపురం మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్ మ్యాదరి రాజ, రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మాణిక్ రావుకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ శాసన సభ్యులు కొనింటి మానిక్ రావు దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంఘం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడం పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ రెడ్డి, తాజా మాజీ సర్పంచులు చిన్నారెడ్డి, విజయ్, నాయకులు లక్ష్మణ్ యాదవ్, బాబు మియ తదితరులు కలిసి వారికి వివాహ వార్షికోత్సవం శు భాకాంక్షలు తెలియజేశారు.

## స్టేట్ మొదటి ర్యాంకు సాధించిన ఐశ్వర్యకు సన్మానించిన ఉజ్వల్ రెడ్డి



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:**
కోహిర్ పట్టణానికి చెందిన శ్రీనివాస్ చారి కుమార్తె ఐశ్వర్య, తెలంగాణ గురుకుల కళాశాల హొతి కే నందు చదువుతు, ఇటీవలే విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షల ఫలితాలలో %వీూజ% లో 470 మార్కులకు గాను 468 మార్కులతో స్టేట్ మొదటి ర్యాంకు సాధించిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి విద్యార్థినికి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ...భవిష్యత్తులో మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోహిర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామలింగారెడ్డి, జహీరాబాద్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నరసింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పట్లోల శ్రీకాంత్ రెడ్డి, చెరుకుపల్లి మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, యువజన కాంగ్రెస్ విభాగం రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, యూత్ అసెంబ్లీ నాయకులు పి నాగిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రతాప్ రెడ్డి, నర్సింలు యాదవ్, అశ్విన్ పాటిల్, ఎక్స్ కౌన్సిలర్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడి అమానుషం

- రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నేత పోలగోని వెంకటేష్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:**



జమ్ముకశ్మీర్లోని పహల్గామ్లో ఉగ్రవాదులు జరిపిన దాడులు అమానుషమని యూత్ కాంగ్రెస్ నేత పోలగోని వెంకటేష్ గౌడ్ అన్నారు. ఉగ్రదాడి తనను తీవ్ర దిగ్భాంతికి గురి చేసిందన్నారు. ముఖ్యంగా ఉగ్రదాడిలో 20 మందికి పైగా మృతి చెందడం తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టికల్-370 ఎత్తివేత తరువాత జమ్ముకశ్మీర్ అంతా ప్రశాంతంగా ఉందని ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం ఉట్టిదేనని ఈ ఘటనతో రుజువైందన్నారు. సాధారణ ప్రజలకు రక్షణ కల్పించలేని దుస్తితిలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎంతోకాలం మనుగడ సాగించలేదని ధ్వజమెత్తారు. ఉగ్రదాడిలో హైదరాబాద్కు చెందిన ఐబి అధికారి మనీష్ రంజన్ మరణించడం బాధాకరమన్నారు.?

# అమాయకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

## మీ పాపం పండింది... కనుకనే భారతదేశం జోలికి వస్తున్నారు

### భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్

**యాదగిరిగుట్ట వెలుతురు ఏప్రిల్ 24:**

శాంతి సహనం ప్రేమ అనే హిందుత్వ భావాలు హిందూమత సాంప్రదాయం ప్రకారం ప్రజలకు అలవాటు పడ్డాయని, అంతమాత్రాన భారతదేశ ప్రజల్లో పోరాడే తత్వం లేకుండా పోయిందని పక్క దేశాలు భావించడం, అనాగరికంగా అమాయకులపై ఉగ్రదాడులకు పాల్పడడం, చేతకాక అమాయక పౌరులపై కాల్పులు జరపడం, నిస్సిగ్గుగా మతాల మధ్య చిచ్చు రేపడం, మనదేశంలో తిండికి లేకున్నా పక్క దేశాలపై ఓర్వలేని తనంతో అలజడులు సృష్టించాలని, ఏ దేశాలైతే సంపూర్ణ హిందుత్వ భారతదేశంపై దాడులకు తెగ పాల్పడుతున్నారో ఆ దేశాలన్నీ మట్టి కొట్టుకుపోయే సమయం ఆసన్నమైనట్లుగా అనిపిస్తుందని, అఖండ భారతావనిలో అలజడులు సృష్టించి, దేశ ప్రజలను చంపిన ఏ ఒక్కడు ఇప్పటివరకు ప్రపంచంలో బ్రతకలేదని, వారికి ఆఖరి ఘడియలు సమీపించినప్పుడే అఖండ భారతావని పై దాడులకు పాల్పడుతారని, జమ్మూ కాశ్మీర్లోని పహల్గాంలో అమాయక పౌరులపై ఉగ్రవాది దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని మతాలను గౌరవిస్తూ, లిఅన్ని మతాల ప్రజల పండుగలను కూడా తమ పండుగలుగా భావిస్తూ సర్వమత సమ్మేళనంతో, సౌభ్రాతృత్వంతో అఖండ భారతావని ప్రపంచ దేశాలలోనే దిగ్విజయంగా అభివృద్ధి చెందాలని భావిస్తున్న ప్రజల మధ్య మతాల చిచ్చు రేపాలనుకొని, మతాలను అడ్డం పెట్టుకొని మారణ కాండను కొనసాగించాలనుకున్న వారికి భారతదేశంలో ఎల్లప్పుడూ గట్టిగా బుద్ధి చెబుతూనే ఉన్నప్పటికీ, వారికి సరిగ్గా జ్ఞానోదయం కాక మితిమీరిన చేష్టలతో లిచెదురుమదురు సంఘటనలకు పాల్పడుతున్నారని, వారికి భారత ప్రభుత్వం ఇలాగైనా గట్టి సమాధానం చెబుతుందని అన్నారు. ఈ సందర్భంగా పహల్గాం ఘటనలో మృతి చెందిన అమాయక పౌరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబాలకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, కేంద్ర ప్రభుత్వం అతి త్వరలోనే ముష్కరులను గుర్తించి వారికి తగిన గుణపాఠం చెబుతుందని, ఈ విషయంలో దేశ ప్రజలందరూ ఏకతాటిపై నిలబడి జరుగుతున్న ఘటనకు సంయమనం కోల్పోకుండా ప్రభుత్వాలకు సహకరించి, ఇలాంటి తీవ్రంగా కలిచి వేసే సంఘటనలను ఎప్పటికప్పుడు ఖండిస్తూ ఐకమత్యంతో అందరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రజలందరూ మనోధైర్యం కోల్పోకుండా అందరూ ఏకీకృతమై ప్రభుత్వాలకు సహకరించాలని, కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సంస్థలను దేశంలో నుండి నిర్మూలించాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు




## కాశ్మీర్లో హిందువులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు జరిపిన మారణకాండకు నిరసనగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వీరపట్నం మండల కేంద్రంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన బిజెపి శ్రేణులు

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఏప్రిల్ 24:**

మంగళవారం కాశ్మీర్ లోయలోని పెహల్గాంలో విహారయాత్రకు వెళ్లిన భారతీయ హిందువులను పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అతి కిరాతకంగా కాల్చి చంపిన సంఘటనకు నిరసనగా ఈరోజు బీజేపీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని మండల శాఖ అధ్యక్షులు. నగర శాఖ అధ్యక్షులు. శేఖర్ రెడ్డి. ముత్యాల మహేందర్ గార్ల ఆధ్వర్యంలో ఓం చౌరస్తా దగ్గర నుండి బస్టాండ్ ఎమ్మార్వో ఆఫీస్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ నిన్న కాశ్మీర్ లోయలోని పహల్గాం పాకిస్తాన్ ప్రేరేపిత తీవ్రవాదులు అక్కడికి వెళ్లిన పర్యాటకులను మీరు హిందువా ముస్లిమా అని అడిగి పాయింట్లు విప్పదీసి హిందువులని నిర్ధారించుకున్న తర్వాత కేవలం హిందువులనే చంపడం చాలా దారుణమైన చర్య అని దీనిని ఖండిస్తూ ఈరోజు దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ నిరసన కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది ఈ సందర్భంగా హిందువులందరూ ఏకం కావాలని, ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న వివిధ రాజకీయ పార్టీల కుహనా లౌకికవాదుల మాయలో పడొద్దని ఏదో ఒక రోజు ఆ ఉగ్రవాదం దేశమంతా పాకి మన ప్రాంతానికి కూడా వచ్చే ప్రమాదం ఉంది కాబట్టి తీవ్రవాదులకు వ్యతిరేకంగా హిందూ ధర్మ రక్షణ కోసం దేశం కోసం పనిచేసే భారతీయ జనతా పార్టీని భారత దేశంలోని హిందువులంతా ఆదరించాలని




ఆయన పిలుపునిచ్చారుబి ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్ రెడ్డి. బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ నిట్టు శ్రీశైలం. జిల్లా అధికార ప్రతినిధి దొండ రమణారెడ్డి. మాజీ మండల అధ్యక్షులు దండె శ్రీశైలం యాదవ్. మొగిలి గణేష్. మాజీ కౌన్సిలర్ టేకుల రామ్ రెడ్డి. బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి దూసరి సందీప్ గౌడ్. బిజెపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి, అర్జున్. సతీష్ ముదిరాజ్. రాఘవేందర్, శశిధర్ రెడ్డి, విట్టల్ రెడ్డి విజయ్ కుమార్. జన్గె శ్రీనివాస్. సురేష్. శివ. భాను. తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

(మొదటి పేజీ తరువాయి..)

ప్రజావ్యతిరేకతను అణచివేయడం సాధ్యం కాదన్న ఆయన.. మేనిఫెస్టో అమలు చేయకపోతే ప్రతి వైఎస్సార్సీపీ కార్యకర్త నిలదీస్తాడని చెప్పారు. బలం లేకపోయినా స్థానిక సంస్థల్లో టీడీపీ పోటీ చేస్తోంది. ప్రజలు ఓడించారు కాబట్టే.. చంద్రబాబు తన సొంత నియోజకవర్గం చంద్రగిరిని విడిచిపెట్టి కుప్పం వెళ్లిపోయాడు. అక్కడ బీసీలు ఉన్నారు.. వారు ఆర్థికంగా ఇతరత్రా బలంగా ఉండరు కాబట్టి, వారిని తొక్కితొక్కిపెట్టవచ్చని చంద్రబాబు కుప్పంలో పాగావేశారని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఉప ఎన్నికలు, అవిశ్వాస తీర్మానాల సమయంలో వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులు తెగువ చూపారని.. వారందరికీ సెల్యూట్ చేస్తున్నానని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో గురువారం ఆయన భేటీ అయ్యారు. ముందుగా జమ్ముకశ్మీర్లోని ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన వారి మృతికి సంతాపంగా వైఎస్ జగన్, వైఎస్సార్సీపీ నాయకులు కాసేపు మౌనం పాటించారు. అనంతరం సమావేశం ప్రారంభించారు. చంద్రగిరి ఎంపీపీ ఉప ఎన్నికల్లో గెలిచాక జై జగన్, జై వైఎస్సార్సీపీ అన్నారని కేసులు పెట్టారు. గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు తిరిగే ధైర్యం లేదు. తిరిగితే ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నీ విధ్వంసం. ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లడాన్ని నరకంగా మార్చేశారు. విద్యా, వైద్య రంగాలు దారుణంగా తయారయ్యాయి. చంద్రబాబుగారు అధికారంలో వచ్చాక 4 లక్షలు పెన్షన్లు తీసేశారు. అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. బెల్టుషాపులు గుడి, బడి పక్కనే కనిపిస్తున్నాయి. ప్రతి బాటిల్పైన రూ.20ల ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. వైఎస్సార్సీపీలో కన్నా ఇసుక రేటు రెండింతలు పెరిగింది. ఉచితం అని చెప్పి.. దోచుకుంటున్నారు. పైనుంచి కిందిదాకా ముడుపులు చెల్లిస్తేనే మైనింగ్ అయినా, పరిశ్రమ అయినా నడిచేది. అవినీతినుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ టాపిక్స్ ఎంచుకుంటున్నారు. విశాఖపట్నంలో ఊరూపేరు లేని ఉర్సా లాంటి కంపెనీలకు రూ.3,000 కోట్లు- ఖరీదు చేసే భూములిస్తున్నారు. ఒక చిన్న ఇంట్లో రెషిడెన్షియల్ అపార్ట్మెంట్ కట్టే కరెంటు బిల్లు ఆ కంపెనీ కడుతుంది. అమెరికాలో వాళ్ల ఆఫీసు చూస్తే.. అది కూడా చిన్న ఇల్లే. రూపాయికి ఇడ్లీ వస్తుందో లేదో తెలియదు కానీ చంద్రబాబు హయాంలో ఉర్సా లాంటి ఊరూ పేరు కంపెనీకి రూ.3,000 కోట్ల డబ్బులు దోచిపెడుతున్నారు. విశాఖఫట్నంలో లూలు గ్రూపులకు, లిల్లీ గ్రూపులకు రూ.1500- 2000 వేల కోట్లు- ఖరీదు చేసే భూములను.. టెండర్లు లేకుండా కట్టబెట్టారు. లెఫ్ట్, రైట్, సెంటర్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. అమరావతి నిర్మాణ పనుల్లోనూ దోపిడీ. 2018లో ఐదేళ్ల కిందట చంద్రబాబు హయాంలో టెండర్లు పిలిచినప్పుడు పనుల విలువ రూ. రూ.36,000 కోట్లు-. అప్పట్లో ఇప్పటికన్నా స్టీలు, సిమెంట్లు రేట్లు ఎక్కువ. అయినా కూడా ఆ రూ.36,000 కోట్ల విలువ ఈరోజు రూ.78,000 కోట్లకు పెంచేశారు. టెండర్లు రింగ్ ఫార్మ్ చేసి వాళ్ల కాంట్రాక్టర్లకే ఇచ్చుకుంటున్నారు. మొబలైజేషన్ అడ్వాన్సులు కొత్తగా ఇవ్వడం మొదలుపెట్టాడు. 10 శాతం మొబలైజేషన్ అడ్వాన్సులు ఇవ్వడం, అందులో 8శాతం కమిషన్లుగా తీసుకోవడం.. ప్రభుత్వం చేసిన అప్పులన్నీ ఎక్కడకు పోతున్నాయో తెలియడంలేదు. గతంలో ఎందుకు జగన్ చేయగలిగాడు.. చంద్రబాబు ఎందుకు చేయలేకపోతున్నాడని అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. జగన్ నేరుగా బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి వేసేవాడు. ఇప్పుడు చంద్రబాబు హయాంలో బటన్లు లేవు.. నేరుగా ఆయన జేబులోకే పోతున్నాయి. ఇదే విషయాన్ని ఎన్నికల సమయంలో మొత్తుకుని చెప్పాను. చంద్రబాబు నాయుడుని నమ్మడం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే. ఈ రోజు ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోంది. వీటికి సమాధానం చెప్పుకోలేక ప్రతిరోజూ డైవర్షనే. ఒక రోజు లడ్డూ, మరోరోజు బోటు-.. ఇంకోరోజు ఐపీఎస్ ఆధికార్ల అరెస్టులు అంటూ డైవర్షన్లు చేస్తున్నారని మండిపడ్డారు. కరెంటు బిల్లులు షాక్ కొట్టేలా పెంచారు.. వీటి గురించి అడిగితే.. ఆయన చేసిన లిక్కర్ స్కాంను మరలా ఇంకొకరు మీద రుద్ది అరెస్టు చేస్తాడు. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక సెన్సేషన్ క్రియేట్ చేసి దాన్నుంచి టాపిక్ డైవర్షన్ చేయడం పరిపాటిగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో పాలన జరుగుతుంది. ఎంతో మంచి చేసిన మనమే ప్రతిపక్షంలో కూర్చొన్నాం. ఇక ఏ మంచీ చేయకుండా, మోసం చేసిన చంద్రబాబు పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పక్కరలేదన్నారు. ఇంత మోసం చేసిన మనిషిని ప్రజలు సింగిల్ డిజిట్ రాని పరిస్థితుల్లోకి పరిమితం చేస్తారు.ఆ రోజు వస్తుంది. కచ్చితంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండమైన మెజార్టీతో అధికారంలోకి వస్తుంది. ప్రతి కార్యకర్తకు.. మన ప్రభుత్వంలో మీ జగన్ 2.0లో తోడుగా ఉంటాడు అని హామీ ఇస్తున్నాను. ఈ రోజు కార్యకర్త ఎంతలా ఇబ్బంది పడుతున్నాడో చూస్తున్నానని వైఎస్ జగన్ అన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో అవినీతి విరుచుకుపడిందని, ప్రజలపై భారం పెడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థల్ని దెబ్బతీశారని జగన్ విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వంలో 4 లక్షల పింఛన్లు తీయించారని, ప్రభుత్వ విద్యా వ్యవస్థను పూర్తిగా దిగజార్చారని జగన్ విమర్శించారు. జగన్ హయాంలో డైరెక్ట్ బెనిఫిట్ ద్వారా నేరుగా ఖాతాల్లోకి డబ్బులు వెళ్లేవని గుర్తుచేశారు. వైసీపీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేసిన జగన్, 'జగన్ 2.0లో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానఅని స్పష్టం చేశారు. చంద్రబాబునాయుడుని నమ్మడం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే. ప్రజలు మోసాన్ని గుర్తించి ఆయనను సింగిల్ డిజిట్కు పరిమితం చేస్తారని జగన్ హెచ్చరించారు.

## పేదరిక నిర్మూలన, జీవనోపాధి విభాగంలో పినపళ్ల పంచాయితీకి ఉత్తమ అవార్డు

**కోనసీమ,ఏప్రిల్24( వెలుతురు):**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పినపళ్ల గ్రామపంచాయతీకి రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు దక్కింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేటగిరిలకు సంబంధించి పలు పంచాయతీలకు ఈ అవార్డులను జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా అమరావతిలో గురువారం అందించారు. పేదరిక నిర్మూలన, జీవనోపాధి విభాగంలో పినపళ్లకు ఈ అవార్డు దక్కింది. పంచాయతీరాజ్ రూరల్, డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశి భూషణ కుమార్ , పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ ల చేతుల మీదుగా సర్పంచ్ సుభాష్ తో పాటు- గ్రామ కార్యదర్శి షణ్ముఖ వీర్రాజు ఈ అవార్డును అందుకున్నారు. 2021 లో ప్రతిష్టాత్మంగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో జనసేన పార్టీ నుంచి సుభాష్ సర్పంచ్గా గెలుపొందారు. అప్పటి నుంచి పినపళ్ల గ్రామాభివృద్ధికి విశేష కృషిచేస్తూ వస్తున్నారు. ఇప్పటికే లక్షలాది రూపాయలతో గ్రామాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లారు. యువకుడైన సుభాష్ తనకున్న రాజకీయ పరిజ్ఞానంతో పాలకులు, ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ గ్రామాభివృద్ధికి తగిన నిధులు రాబట్ట గలుగుతున్నారు. గత రెండు ఏళ్లుగా ఈ గ్రామపంచాయతీ అభివృద్ధికి సంబంధించి పలు సర్వే బృందాలు ఆ గ్రామం వచ్చి పరిశీలించాయి. చివరకు అభివృద్ధితో పాటు- ఆ గ్రామ పరిధిలో గల ఓఎన్జిసి, ఫ్యాక్టరీ ద్వారా జీవనోపాధి అవకాశాలు మెరుగు పడడంతో ఆ విభాగం నుంచి ఈ అవార్డు దక్కింది. ఈ అవార్డు రావడానికి సహకరించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు, కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావుకు, ఆలమూరు ఎంపీడీవో, ఇన్చార్జి డిఎల్పిఓ ఎ.రాజుకు, ఇతర అధికారులకు, ఓఎన్జిసి, ఫ్యాక్టరీ యాజమాన్యానికి, గ్రామస్తులకు సుభాష్ కృతజ్ఞతలు తెలిపారు.




## నల్లకుంటలో మజ్జిగ పంపిణి..




**వెలుతురు,హైదరాబాద్ 24ఏప్రిల్ :**

నల్లకుంట మాతా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మిడి శ్రవణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద గురువారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్ రెడ్డి, రామ్మోహన్ రావు, దేవిరెడ్డి విజితా రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వొద్దు

- కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ ఎ.శ్రీనివాస్



**వెలుతురు,హైదరాబాద్ 24 ఏప్రిల్ :**

మైనర్లకు తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వొద్దని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ ఎ.శ్రీ నివాస్ హెచ్చరించారు. పోలీస్ ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు గురువారం కాచిగూడ నింబోలిఅడ్డలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. అనంతరం సీఐ మాట్లాడుతూ...మైనర్లకు వాహనాలు ఇవ్వడం, నడపమని ప్రోత్సహిం చడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపైనా, వాహన యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్ల డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఎవరైనా మైనర్లు బైక్లు నడుపుతుంటే జరిమానాతో పాటు నాలుగు రోజుల పాటు సోషల్ సర్వీస్ అదేవిధంగా తమ వాహనం స్వాధీనం చేసుకుంటా మని ఆయన స్పష్టం చేశారు. సరైన ధ్రువ పత్రాలు లేని వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించి, అనంతరం వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎఎస్ఐ అనిల్ గౌడ్, సిబ్బం ది తదితరులు పాల్గొన్నారు.

## జితెందర్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హరినాథ్ రెడ్డి...



**వెలుతురు,హైదరాబాద్ 24ఏప్రిల్:**

న్యూఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారుడిగా నియమితులైన ఏపీ.జితెందర్ రెడ్డిని గురువారం టీపీసీసీ కార్యదర్శి అజయ్ కుమార్, సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రామ్మోహన్ రావు, బొమ్మిడి శ్రవణ్, దేవిరెడ్డి విజితా రెడ్డి,బి. మధుసూదన్ రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

## జమ్మూ కాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడి ముమ్మాటికి హిందువులపై టార్గెట్ దాడి

- ఎల్ మహేందర్.



**సంగారెడ్డి జిల్లా వెలుతురు ఏప్రిల్ 24:**

జమ్ము కాశ్మీర్లో నిన్న జరిగిన ఉగ్రదాడిలో చనిపోయిన 30 మంది పైగా టూరిస్టులు దాడి ప్రత్యేకంగా హిందువులను అడిగి వారి ఆధార్ చూసి మరి కాల్చి చప్పడం అంటే ఇది మన దేశంలో పై హిందుత్వంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి పాకిస్తాన్ బంగ్లాదేశ్ లాంటి ఉగ్రదేశాలు. ప్రత్యేకంగా దేశంలో హిందువులను టార్గెట్ పెట్టి చంపడం అనేది నీచమైన చర్య దీనికి ప్రతికారంగా 30 మందికి బదులు 300 పైగా ఉగ్రవాదులను ఎన్కౌంటర్ చేయడమే లక్ష్యం దేశాన్ని గతంలో. పుల్ వామ దాడి కి ప్రతికారంగ. ఏలా జరిగిందో మరి ఇప్పుడు అదే రీతిలో తిరిగి గుణపాఠం తప్పదని తెలియజేస్తనను మన. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను భారతదేశంలో కొన్ని పార్టీలు వాళ్ళ స్వార్థం కోసం ఉగ్రవాదులను. ఉగ్రదేశాలను ప్రోత్సహించే వారిని ఆ దేశాలంటే మాకు ఇష్టం ఆదేశాలే బాగున్నాయి భారత్ ఉండి మన దేశంలో ఉన్నటువంటి పార్టీలకు గుణపాఠం తప్పదు రాబోయే రోజుల్లో భారతదేశం హిందూ దేశంగా ప్రపంచంలోని నెంబర్ వన్ దేశంగా ముందుకెళ్తూ భారత ప్రధాని నరేంద్ర మోడీ గారు వారి సంకల్పంతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తుంటే ఈ ఉగ్రవాదులు ప్రత్యేకంగా పాకిస్తాన్ బంగ్లాదేశ్ లాంటి దేశాలు సహకరిస్తూ మన దేశంపై దాడులు జరిగే విధంగా ప్రోత్సహిస్తూ కాబట్టి ఆ దేశాలు కూడా మూల్యం చెల్లించుకొక తప్పదు.

# నేటినుంచి భారత్ సమ్మిట్

- ఘనంగా నిర్వహిస్తామన్న భట్టి



**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**
భాగ్యనగరంలో భారత్ సమ్మిట్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు– తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. నేటి నుంచి జరిగే ఈ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో నిపుణులను ఆహ్వానిస్తున్నట్లు– తెలిపారు. ప్రపంచశాంతి, అహింస, న్యాయం, పెట్టు–బడులే లక్ష్యంగా ఈ సమ్మిట్ నిర్వహించనున్నట్లు– చెప్పారు. ఈ సమ్మిట్‌లో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, నిపుణులకు తెలంగాణ ప్రభుత్వ విజన్ గురించి వివరిస్తాం. ఇందిరా మహిళా శక్తి బజార్లు, గ్రామాల్లో ఉపాధి కల్పన తదితర అంశాల గురించి చెబుతాం. ఎకనమిక్ జస్టిస్, పొలిటికల్ జస్టిస్, సోషల్ జస్టిస్, జెండర్ జస్టిస్, యూత్ జస్టిస్, ఎకలాజికల్ జస్టిస్, పీస్ జస్టిస్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తాం అని మంత్రి తెలిపారు.

# నరమేథం సృష్టించిన వారిని వదలబోం

- వారికి అండదండగా ఉన్న వారినీ వదలం
- ప్రపంచదేశాలకు అర్థమయ్యేలా మోదీ హెచ్చరిక



**పాట్నా,ఏప్రిల్24( వెలుతురు):**
కాశ్మీర్‌లో నరమేథం సృష్టించిన ముష్కరులను, వారికి అండగానిలిచిన వారిని వదిలి పెట్టబోమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలకు భారత్ హెచ్చరిక అర్థం అయ్యేలా ఇంగ్లీష్‌లో కూడా మాట్లాడారు.ప్రధాని నరేంద్ర మోదీ సాధారణంగా హిందీలో ప్రసంగిస్తుంటారు. అంతర్జాతీయ వేదికలపైనా ఇదే భాషలో భారత వైఖరిని స్పష్టం చేస్తుంటారు. కానీ, నేడు బిహార్‌లో నిర్వహించిన ఓ సభలో మాత్రం అరుదైన రీతిలో ఒక్కసారిగా తన ప్రసంగాన్ని హిందీ నుంచి ఆంగ్లంలోకి మార్చారు. పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ.. ఇంగ్లీష్‌లోనూ హెచ్చరించడం గమనార్హం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తన బలమైన సందేశాన్ని ప్రపంచ దేశాలకు సూటిగా చేరవేసేందుకు ఆంగ్లంలో ప్రసంగించినట్లు– తెలుస్తోంది. ఇండియా విల్ ఐడెంటిఫై, ట్రాక్ అండ్ పనిష్ ఎవ్రీ టెర్రరిస్ట్ అండ్ దేర్ బ్యాకర్స్' అంటూ ప్రధాని మోదీ ఆంగ్లంలో స్పష్టం చేశారు. బిహార్ గడ్డ నుంచి యావత్ ప్రపంచానికి ఒక విషయం స్పష్టం చేస్తున్నా. ఉగ్రవాదులను, వారికి అండగా నిలిచేవారిని భూమిపై ఎక్కడున్నా సరే వెంటాడతాం. ఉగ్రవాదంతో దేశ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేరు. ఉగ్రవాదాన్ని శిక్షించకుండా వదిలిపెట్టబోం. బాధితులకు న్యాయం చేకూరేలా అన్ని విధాలా ప్రయత్నిస్తాం. ఈ విషయమై దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉందని అంటూ ప్రధాని మోదీ ఇంగ్లీష్‌లో పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి వేళ భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెప్పారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు అని పేర్కొన్నారు. కేవలం ప్రపంచ దేశాలకు తెలిసేలా చేసేందుకే మోడీ ఆంగ్లలో ప్రసంగించినట్లు అర్థం అవుతోంది.

# నేడు ఢిల్లీకి వెళ్లనున్న సిఎం చంద్రబాబు

- మరోమారు ప్రధాని మోడీతో భేటీ



**అమరావతి,ఏప్రిల్24( వెలుతురు):**
ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరోమారు శుక్రవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని సీఎం చంద్రబాబు కలవనున్నారు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రధానితో చంద్రబాబు భేటీ అవనున్నారు. మే 2వ తేదీన ఏపీలో ప్రధాని మోదీ పర్యటించనున్న సమయంలో చంద్రబాబు భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో ఏపీ పర్యటనకు సంబంధించిన విషయాల గురించి సీఎం చంద్రబాబు చర్చించనున్నారు. ఏపీ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులను మే2న ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఏపీకి మోదీని సీఎం చంద్రబాబు ఆహ్వానించనున్నారు. అమరావతి, ఏపీకి సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. రాత్రికి ఢిల్లీలోనే సీఎం చంద్రబాబు బస చేస్తారు. శనివారం ఉదయం సీఎం చంద్రబాబు ఢిల్లీ నుంచి బయలుదేరి విశాఖపట్నానికి చేరుకుంటారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం జిల్లా పర్యటనకు సీఎం చంద్రబాబు వెళ్లనున్నారు.

# స్కూటీలు..తులం బంగారం ఏమాయె

- ప్రజలు మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ
- వరంగల్ పర్యటనలో కవిత విమర్శలు



**వరంగల్,ఏప్రిల్24( వెలుతురు):**
వరంగల్ గడ్డ అంటే ఉద్యమాల గడ్డని, తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందని.. వరంగల్ లో సభ పడితే విదేశాల్లో ఉన్న వాళ్ళు కూడా వచ్చి మద్దతు తెలిపారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గుర్తు చేసారు. వరంగల్ జిల్లాలో ఆమె పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆమె ఓరుగల్లులోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ ఆమె ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఎల్కతుర్తి లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆపై మీడియాతో ముచ్చటించారు. తెలంగాణ ఉనికిని కోల్పోతున్న సమయంలో కేసీఆర్ పిడికిలి బిగించి తెలంగాణ ఉద్యమంతో అందరినీ ఒక్క తాటికి పైకి తెచ్చి తెలంగాణ ను ఉనికి కాపాడాడన్నారు. 2001లో కేసీఆర్ పెట్టిన తెలంగాణ పార్టీ టిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తిచేసుకుందని తెలిపారు. ఇక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆడపిల్లల్ని మోసం చేసిందని.. స్కూటీలు ఇస్తామని విద్యార్థులు మోసం చేసారని అన్నారు. అలాగే బంగారం ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేసారని తెలిపారు. ఇలా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలంటే మహిళలు సభకు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. తెలంగాణ తలపై కాళేశ్వరం నిర్మించి రైతన్నకు మరోసారి ఇచ్చిన కేసీఆర్ కు మద్దతుగా రైతన్నలు పెద్ద ఎత్తున సభలో పాల్గొనలన్నారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీలో 12 మంది చనిపోతే ఒత్తిడి మేరకు మాత్రమే తెలంగాణ ఇచ్చిందని, ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ మళ్లీ మోసం చేస్తుంది కుట్రలు చేస్తుందని ఆమె పేర్కొన్నారు. ఆ కుట్రలన్నిటిని పటాపంచలు చేయాలంటే ఈ సభను విజయవంతం చేయాలని ఆమె కోరారు. కేసిఆర్ మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించే లాగా రిజర్వేషన్ తీసుకువచ్చిన ఘనత ఉందని, ఎల్కతుర్తి సభలో ప్రత్యేక మహిళా గ్యాలరీలను ఏర్పాటు– చేస్తున్నమని, సభకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటామని అవ్విడా తెలిపారు. కాంగ్రెస్ నాయకుల్లారా ఖబర్దార్.. ప్రజలకు నీ మోసం ఏంటో తెలిసిపోయిందని, 16 నెలల్లోనే మీరు ఏమి చేయలేరని తెలంగాణ ప్రజలకు తేలిపోయిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకుల్లారా అవాకలు చెవాకులు పేలుస్తున్నారు. మా సభలో పల్లీలు, బఠానీలు అమ్ముకునే అంత మంది కూడా మీరు ఉండరు. అవాకులు, చివాకులు పేలిస్తే చూస్తూ ఊరుకోమని అన్నారు. రూపాంతరం చెందడం అనేది సర్వసాధారణం.. టీ–ఆర్ఎస్ బీఆర్ఎస్ గా రూపాంతరం మాత్రమే చెందింది.. పార్టీ మారలేదని ఆవిడ మాట్లాడారు.

# ఉద్దేశ్య పూర్వకంగానే దాడులు

- కాశ్మీర్ ఘటనపై కాంగ్రెస్ మండిపాటు
- 25న క్యాండిల్ ర్యాలీలకు పిలుపు

**న్యూఢిల్లీ,ఏప్రిల్24( వెలుతురు):**
పహల్గాం ఉగ్ర దాడి ఘటనను కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి సీడబ్ల్యూసీ తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేసింది. ఇది పిరికిపంద చర్య, పాకిస్థాన్ పన్నిన కుట్రగా పేర్కొంది. దేశవ్యాప్తంగా భావోద్వేగాల్ని రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగానే హిందువులను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపింది. ఈ ఘటనలో నిఘా వైఫల్యాలు, భద్రతా లోపాలపైనా సమగ్ర విశ్లేషణ తప్పనిసరి అని పేర్కొంది. ఐక్యత అత్యంత అవసరమైన ఈ సమయంలో రాజకీయాలు చేయడం దిగ్భ్రాంతికరమని తెలిపింది. అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తుల భద్రతను జాతీయ ప్రాధాన్యతగా పరిగణించి.. అందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు– చేయాలని కేంద్రాన్ని కోరింది. పహల్గాం దాడి మృతులకు నివాళు లర్పించేందుకు ఏప్రిల్ 25న దేశ వ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ తెలిపారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దేశం యావత్తు ఒక్కటిగా ఉందని, ఈ విషయంలో కేంద్రానికి అండగా ఉంటామని తాజా పరిణామాలపై కర్ణాటక డిప్యూటీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ స్పష్టం చేశారు. దేశ సమగ్రతే తమకు అత్యంత ముఖ్యమన్న ఆయన.. కేంద్ర




ప్రభుత్వానికి అండగా నిలబడతామన్నారు. కొందరు దీన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తుం డటంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలంతా కలిసి శాంతిని కాపాడుకోవాలని, ఈ సమయంలో రాజకీయాలు చేయడం తగదన్నారు.

# రాజకీయాల్లో మంచి సంప్రాదాయం ఉండాలి

- కూటమి నేతల తీరుపై బొత్స మండిపాటు




**విశాఖపట్నం,ఏప్రిల్24( వెలుతురు):**
ఏపీలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆర్థిక మూలాల మీద దెబ్బ కొడతామని కూటమి నేతలు బెదిరించడం కరెక్ట్ కాదని మండిపడ్డారు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ. రాజకీయాల్లో ఇటువంటి సాంప్రదాయం మంచిది కాదని హితవు పలికారు. కూటమి నేతలు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా మెజార్టీ కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారని అన్నారు. ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తాజాగా విశాఖలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ.. కశ్మీర్‌లో తీవ్రవాదుల కాల్పులు కారణంగా 26 మంది చనిపోవడం బాధాకరం. మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు చనిపోవడం దురదృష్టకరం. వారి కుటు–ంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆర్థిక మూలాల మీద దెబ్బ కొడతామని కూటమి నేతలు బెదిరించారు. నేనెప్పుడూ ఇటు–వంటి రాజకీయాలను చూడలేదు. రాజకీయాల్లో ఇటు–వంటి సాంప్రదాయం మంచిది కాదు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల కోసం ప్రత్యేక విమానాలను ఏర్పాటు– చేశారు. 11 నెలల మేయర్ పదవి కోసం అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ 11 నెలల కాలంలో ఏం చేస్తారో ప్రజలకు చెబుదాం. ఎన్ని ప్రలోభాలు పెట్టినా మెజార్టీ కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారు. వారందరినీ అభినందిస్తున్నాను అంటూ వ్యాఖ్యలు చేశారు.

# పాక్ గగనతలం మూసివేత

## ప్రత్యామ్నాయా మార్గాల్లో విమాన ప్రయాణాలు

**న్యూఢిల్లీ,ఏప్రిల్24( వెలుతురు):**
భారత్– పాక్ మధ్య నెలకొన్న ద్వైపాక్షిక ఉద్రిక్తతల నేపథ్యంలో టాటా గ్రూపునకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా కీలక ప్రకటన చేసింది. భారత్‌కు చెందిన విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు– ప్రకటించిన నేపథ్యంలో ఇకపై ప్రత్యామ్నాయ మార్గంలో విమానాలు నడపనున్నట్లు వెల్లడించింది. దీంతో ఆ మేర ప్రయాణ సమయం పెరగనుంది. భారత్‌కు చెందిన విమానాలకు పాకిస్థాన్ తన గగనతలం నుంచి ప్రయాణాలపై ఆంక్షలు విధించింది. దీంతో ఉత్తర అమెరికా, యూకే, యూరప్, పశ్చిమాసియా దేశాల నుంచి వచ్చే,వెళ్లే విమానాలు ప్రత్యామ్నాయ సుదూరపు మార్గంలో ప్రయాణిస్తాయి. ప్రయాణికులకు కలిగిన ఈ అసౌకర్యానికి మేం చింతిస్తున్నాం. గగనతలం మూసివేత మా చేతిలో లేని వ్యవహారం. ఏదేమైనా ఎయిరిండియా ప్రయాణికులు, సిబ్బంది భద్రత మాకు ముఖ్యం'అని ఎయిరిండియా ఎక్స్ పోస్టులో పేర్కొంది. పాకిస్థాన్ ఎయిర్‌స్పేస్ మూసివేతతో తాము నడిపే కొన్ని అంతర్జాతీయ విమానాలపై ప్రభావం పడుతోందని ఇండిగో సంస్థ పేర్కొంది. వీలైనంత తొందరగా గమ్యస్థానాలకు చేర్చడంలో తమ సిబ్బంది ప్రయత్నిస్తారని తెలిపింది. ఒకవేళ మీరు ప్రయాణించబోయే విమానంపైనా దీని ప్రభావం ఉంటే స్టేటస్ చెక్ చేసి తమ వెబ్‌సైట్ ద్వారా రీ బుకింగ్ లేదా రిఫండ్‌ను పొందొచ్చని ప్రయాణికులకు సూచిస్తూ 'ఎక్స్' వేదికగా ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది.




# మోడీకి ఇజ్రాయిల్ ప్రధాని ఫోన్

- కాశ్మీర్ ఘటనపై సంపూర్ణ మద్దతు

**న్యూఢిల్లీ,ఏప్రిల్24( వెలుతురు):**
ప్రధాని నరేంద్రమోడీకి, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఫోన్ చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఇరువురు నేతలు చర్చించుకున్నట్లు– విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గురువారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దాడికి పాల్పడిన టె–ర్రరిస్టుల్ని, వారి మద్దతుదారుల్ని న్యాయం ముందు నిలబెట్టాలనే భారతదేశ దృఢ సంకల్పానికి ఇజ్రాయిల్ మద్దతుగా నిలిచింది. జోర్డాన్ రాజు అబ్దుల్లా –2 కూడా ప్రధాని మోడీకి ఫోన్ చేసినట్లు– విదేశాంగ శాఖ తెలిపింది. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ, భారత దేశానికి మద్దతుగా ఉంటామని చెప్పారు. బుధవారం, భారతదేశంలోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ పహల్గామ్ దాడిని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదంపై పోరాటంలో సాంకేతికత, పద్ధతి మరియు నిఘా వంటి రంగాలలో భారతదేశానికి నిరంతర సహకారం ఉంటు–ందని ఆయన హామీ ఇచ్చారు. అంతకుముందు, ఈ రోజు తెల్లవారుజామున విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌కి ఫ్రెంచ్ విదేశాంగ మంత్రి జీన్ నోయెల్ బారోట్ ఫోన్ చేసి, సంఘీభావం ప్రకటించారు.

# హైదరాబాద్‌లో విదేశీయుల తిష్ట

- వీసా గడువు ముగిసినా ఇక్కడే మకాం
- మాజీ ఎమ్మెల్సీ ప్రభాకర్

**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**



హైదరాబాద్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సూచించారు. వీసా గడువు తీరిన చాలా మంది బంగ్లా, పాక్ దేశస్థులు హైదరాబాద్‌లో ఉన్నారన్నారు. వీరందరిని వెంటనే వెనక్కి పంపి వేయాలని డిమాండ్ చేశారు. వీరి ఏరివేతకు పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్ లో స్లీపర్ సెల్స్ ఉన్నారని గతంలో చాలా సందర్భాల్లో రుజువైందని.. స్లీపర్ సెల్స్ కు హైదరాబాద్ ఎంపీ మద్దతు ఉందని ఆరోపించారు. దీంతో పాటు– బీఆర్ఎస్ ఉత్సవాలపై కూడా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడారు. 'బీఆర్ఎస్ ఏం సాధించిందని ఉత్సవాలు జరుపుతున్నారు?యువరాజుకి పట్టం కట్టేందుకు ఉత్సవాలు చేస్తున్నారా? బీర్ఆర్ఎస్ రూలింగ్ లోనే కాదు... ప్రతిపక్షంలో కూడా ఫెయిలైన పార్టీ. బీఆర్ఎస్ కు సేనాధిపతి తిరుగుబాటు– తప్పదు. మిషన్ కోసం ఏర్పాటు– చేసిన పార్టీ కమీషన్‌లు తీసుకుంది. నాలుగు కోట్ల మంది కొరకు పార్టీ అని ఒక్క కుటు–ంబానికే పరిమితం చేశారు. బీఆర్ఎస్‌కు ఉత్సవాలు జరుపుకునే అర్హత లేదని మండిపడ్డారు.

# నాగారం భూదాన్ భూములపై పిటిషన్

**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**
మహేశ్వరం మండలం నాగారం భూదాన్ భూముల్లో అక్రమాలు జరిగాయని మహేశ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.భూదాన్ భూముల్లో అక్రమాలపై ప్రభుత్వం, భూదాన్ బోర్డుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై సీబీఐ లేదా ఈడీతో దర్యాప్తు చేయించాలని కోరారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ భాస్కర్‌రెడ్డి.. వివాదాస్పద భూమిపై ఎలాంటి లావాదేవీలు నిర్వహించొద్దని ఆదేశించారు. దర్యాప్తు నిర్వహిస్తే వాస్తవాలు బయటికొస్తాయన్నారు. ఈ మేరకు ప్రభుత్వం, సీబీఐ, ఈడీతోపాటు– ప్రతివాదులకు నోటీ–సులు జారీ చేశారు. విచారణను జూన్ 26కు వాయిదా వేశారు. పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రతివాదులుగా ప్రభుత్వంతోపాటు– పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, వారి భార్యలు, పిల్లలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది.

## కాళేశ్వరం..రెండో దశ విచారణ...



**కరీంనగర్, ఏప్రిల్ 24, ( వెలుతురు)**


ఆసియాలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పథకంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రచారం చేశారు. అయితే నిర్మించిన మూడేళ్లకే ప్రాజెక్టులోని లక్ష్మీ బ్యారేజీ పిల్లర్లు కుంగాయి. అన్నారం బ్యారేజీ పిల్లర్ల వద్ద బుంగ పడింది. ఈ నేపథ్యంలో 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో విచారణకు ఆదేశించింది. విచారణకు కమిషన్‌ను నియమించింది.కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ రేపటి నుంచి రెండో దశ దర్యాప్తును చేపడుతోంది. మొదటి దశలో ప్రాథమిక విచారణ పూర్తి చేసిన కమిషన్, ఇప్పుడు మరింత లోతైన పరిశీలనకు సిద్ధమైంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగడంతో సంబంధిత అంశాలపై దష్టి కేంద్రీకరించిన ఈ విచారణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి నీటిపారుదల మంత్రి హరీశ్‌రావులకు నోటీసులు జారీ కానున్నాయి.ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తీసుకున్న నిర్ణయాలు, ఖర్చులు, ఒప్పందాలు, పనుల నాణ్యతను కమిషన్ సమగ్రంగా పరిశీలించనుంది. కోట్లాది రూపాయల బడ్జెట్‌తో నిర్మితమైన ఈ ప్రాజెక్టులో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో, కమిషన్ గడువు మరో రెండు నెలలు పొడిగించే అవకాశం ఉంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది.కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్), విజిలెన్స్ విభాగం నివేదికలు ప్రభుత్వానికి అందాయి. ఈ నివేదికలను అధ్యయనం చేసిన తర్వాత, ఇంజనీర్లు, అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. ఈ ప్రక్రియ అనంతరం కేసీఆర్, హరీశ్‌రావులను విచారణకు పిలిచే అవకాశం ఉంది.కాళేశ్వరం విచారణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారనుంది. ప్రజలలో నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు ఈ దర్యాప్తు కీలకమని ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి. విచారణ ఫలితాల ఆధారంగా తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉంది.తాజాగా కాళేశ్వరం కమిషన్ విచారణతో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ సభకు బ్రేక్ పడే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. విచారణ నేపథ్యంలో కేసీఆర్, హరీశ్‌రావు కమిషన్ ఎదుట హాజరయ్యే అవకాశం ఉంది. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ పాతికేళ్ల సభకోసం విస్తృతంగా ఏర్పాటు చేస్తోంది. ఈ తరుణంలో విచారణ కమిషన్ రంగంలోకి దిగడం ఇప్పుడు రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. మరి కమిషన్ నిర్ణయాలు ఎలా ఉంటాయో చూడాలి. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ తదుపరి దశలో కీలక నిర్ణయాలు, బాధ్యుల గుర్తింపు రాష్ట్ర రాజకీయ, పరిపాలనా వాతావరణంపై గణనీయ ప్రభావం చూపనున్నాయి.

## ఆర్ట్స్ కాలేజీకు గుర్తింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ( వెలుతురు)**

ఉస్మానియా విశ్వవిద్యాలయంకు సంబంధించి విశిష్టమైన చిహ్నంగా నిలిచిన ఆర్ట్స్ కళాశాల భవనం మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. దేశంలోని అత్యంత ప్రసిద్ధమైన ట్రేడ్‌మార్క్ భవనాల జాబితాలో ఈ చారిత్రాత్మక నిర్మాణం తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ముంబైలోని తాజ్ హోటల్ , స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనాల తర్వాత.. ఈ ఘనత సాధించిన మూడవ కట్టడంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల నిలవడం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం.మేరకు ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాన్ని ఓయూ పూర్వ విద్యార్థి , ప్రముఖ ట్రేడ్‌మార్క్ న్యాయవాది సుభజిత్ సాహా.. ఓయూ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. కుమార్ గారికి అందజేశారు. సుభజిత్ సాహా ఈ ప్రతిష్ఠాత్మక ట్రేడ్‌మార్క్ కోసం గత సంవత్సరం దరఖాస్తు చేశారు. ఈ ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రేషన్ ద్వారా ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రత్యేక అనుమతి లేకుండా ఆర్ట్స్ కళాశాల భవనం యొక్క చిత్రాన్ని ఎలాంటి వాణిజ్య ప్రకటనలలో గానీ, ఇతర వ్యాపార అవసరాలలో గానీ ఉపయోగించడానికి వీలు లేదు.ఆర్ట్స్ కళాశాల భవనం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిందని వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. కుమార్ అన్నారు. ఇప్పటికే ఎంతో గుర్తింపు , ప్రాధాన్యం కలిగిన ఈ భవనానికి ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రేషన్ లభించడం మరింత గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. ఇది ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులందరికీ గర్వకారణమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ భవనం కేవలం ఒక నిర్మాణం కాదని, తరతరాల విద్యార్థుల జ్ఞాపకాలతో ముడిపడిన ఒక చారిత్రక సంపద అని ఆయన అభివర్ణించారు. భవిష్యత్తులో ఈ భవనం ప్రత్యేకతను కాపాడుకోవడానికి ఈ ట్రేడ్‌మార్క్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.మరోవైపు.. తెలంగాణ స్టార్టప్ వ్యవస్థకు ఊతమిచ్చే T-హబ్‌కు ప్రతిష్ఠాత్మకమైన 'బెస్ట్ కాన్సీవ్డ్ కోహోర్ట్ 2025' అవార్డు లభించింది. ఢిల్లీలో జరిగిన స్టార్టప్ మహాకుంభ్ 2025లో సెమీకండక్టర్ ప్రోగ్రామ్‌కు T-హబ్ ఈ అవార్డును గెలుచుకుంది. ఈ అవార్డు T-హబ్ విజన్ , స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో దానికున్న నిబద్ధతకు నిదర్శనం.

## భారీగా తగ్గిన ఉల్లిపాయల ధరలు



**హైదరాబాద్, ఏప్రిల్ 24, ( వెలుతురు)**

రాష్ట్రంలోని మధ్య తరగతి ప్రజలకు శుభవార్త. ప్రతిఒక్కరి ఇంట్లో నిత్యావసరాల వస్తువుల జాబితాలో ఉల్లిపాయలు కూడా ఉంటాయి. అయితే, ఇటీవల కాలంలో ఉల్లిపాయ ధరలు భారీగా పెరిగాయి. గత నెలలో హోల్ సేల్ మార్కెట్లో కిలో ఉల్లిగడ్డలు రూ. 40 నుంచి రూ.50 వరకు విక్రయాలు చేశారు. దీంతో పేద వర్గాల ప్రజలు తమ వంటల్లో ఉల్లిపాయను దూరం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, ప్రస్తుతం ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయి.కొత్త పంట మార్కెట్ కు వస్తుండటంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. ధరలు సగానికి తగ్గిపోయాయి. ప్రస్తుతం కిలో ఉల్లిగడ్డ ధర రూ. 15 నుంచి రూ.20 వరకు విక్రయాలు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ లోని మెయిన్ హోల్ సేల్ మార్కెట్లు అయిన ఉస్మాన్ గంజ్, మలక్ పేట, సికింద్రాబాద్ మోండా, బోయిన్ పల్లితోపాటు పలు రైతు బజార్లకు పెద్దెత్తున ఉల్లి వస్తుంది. దీంతో ధరలు పడిపోతున్నాయి.మహారాష్ట్ర, కర్నూల్ నుంచి ఉల్లి ఎక్కువగా దిగుమతి అవుతుంది. తెలంగాణలోని వికారాబాద్ జిల్లా పరిధిలోని తాండూరు, మెదక్ జిల్లాలోని నారాయణఖేడ్, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలోని కొల్లాపూర్, అలంపూర్, నల్గొండ తదితర ప్రాంతాల్లో 40వేల ఎకరాల్లో ఉల్లి సాగవుతుంది. ప్రతీయేటా ఏప్రిల్, మే నెలల్లో పంట చేతికి వస్తుంది. దీంతో మార్కెట్లకు ఉల్లిగడ్డలు భారీగా వస్తున్నాయి. హైదరాబాద్ సిటీలోని మార్కెట్లకు రోజుకు 15వేల నుంచి 18వేల క్వింటాళ్లు ఉల్లిగడ్డలు వస్తున్నాయి. మరోవైపు ఉల్లిపై 20శాతం ఎక్స్ పోర్ట్ ట్యాక్స్ ఎత్తివేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని కారణంగానూ ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయి.

# ఇంక పాకిస్తాన్ కు నీటి కష్టాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24, ( వెలుతురు)**

పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో మరోసారి పాకిస్థాన్ కుట్ర బయటపడుతోంది. రహస్య సమాచార వర్గాల ప్రకారం, ఉగ్రవాద దాడి పాకిస్థాన్‌లోనే స్కెచ్ వేశారని తెలుస్తోంది. దాడి వెనుక హాఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడైన సైపుల్లా కసూరి చేయి ఉందని చెబుతున్నారు. అందుకే పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పడానికి భారతదేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో అత్యంత ముఖ్యమైన నిర్ణయం సింధు జల ఒప్పందాన్ని రద్దు చేయడం. భారతదేశం తీసుకున్న ఈ నిర్ణయంతో పాకిస్థాన్ నీటి కోసం దిక్కుతోచని స్థితిలో పడే ప్రమాదం ఉంది. పహల్గాం ఉగ్రవాద దాడిలో 26 మంది ప్రాణాలను బలిగొన్నారు. అప్పటి నుంచి యావత్ భారతం ఆగ్రహంతో ఊగిపోతోంది. పాకిస్థాన్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే ఆసక్తితో కేంద్రంవైపు ప్రజలంతా ఎదురు చూశారు. ప్రధానమంత్రి మోడీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 1960లో జరిగిన సింధు జల ఒప్పందాన్ని రద్దు చేయాలని నిర్ణయించారు. భారతదేశం తీసుకున్న ఈ నిర్ణయం ఒక్కసారిగా పాకిస్థాన్ మొత్తం దాహం కేకలతో అల్లాడిపోనుంది. ఇంతకీ సింధు జల ఒప్పందం గురించి పూర్తి వివరాలు ఏంటో చూద్దాం. భారత-పాకిస్థాన్ విభజన తరువాత రెండు దేశాల నీటి అవసరాలను తీర్చడానికి ఈ ఒప్పందం కుదిరింది. 1960 సెప్టెంబర్ 19న అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయుబ్ ఖాన్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. దీని ప్రకారం, బ్యాస్, రావి, సట్లెజ్, సింధు, చినాబ్, జీలం అనే ఆరు నదుల నీటి వినియోగానికి సంబంధించిన నియమాలు నిర్ణయించారు. ఈ ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌కు చినాబ్, జీలం, సింధు అనే మూడు పశ్చిమ నదుల నుంచి పూర్తిగా నీరు లభిస్తుంది. అదే సమయంలో భారతదేశానికి సట్లెజ్, బియాస్, రావి నదుల నీరు లభిస్తుంది.స్వాతంత్ర్యం తరువాత పాకిస్థాన్‌తో అనేక యుద్ధాలు చేసిన భారతదేశం ఎప్పుడూ ఈ




ఒప్పందం అమలులోకి రాకముందు 1948 ఏప్రిల్ 1న భారతదేశం నీటిని ఆపివేసింది. దీని వల్ల పాకిస్థాన్ పంజాబ్‌లోని 17 లక్షల ఎకరాల భూమి నీరు లేక బీడుగా మారింది. ఇప్పుడు ఈ ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయడం ద్వారా భారతదేశం పాకిస్థాన్‌ను కుంగదీసింది. నిజానికి, పాకిస్థాన్‌లోని పంజాబ్, సింధ్ ప్రాంతాలు వాటి నీటి అవసరాలను తీర్చుకోవడానికి చినాబ్, జీలం, సింధు వంటి నదుల నీటిపై పూర్తిగా ఆధారపడి ఉన్నాయి. కానీ ఇప్పుడు పాకిస్థాన్‌కు ఈ నదుల నీరు లభించదు.

ఒప్పందాన్ని ఉల్లంఘించలేదు. పాకిస్థాన్‌కు నీటి సమస్య రాకుండా చేసింది. అయితే, దీర్ఘకాలంగా భారతదేశంలో ఈ జల ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్లు వస్తున్నాయి. ఇప్పుడు భారతదేశం ఆ నిర్ణయాన్ని తీసుకుంది. ప్రపంచ బ్యాంకు దీర్ఘకాలిక మధ్యవర్తిత్వం తరువాత భారతదేశం, పాకిస్థాన్ మధ్య సింధు జల ఒప్పందం జరిగింది. ఈ

## మాస్టారు... మాస్టార్ మీరు సూపర్

**మహబూబాబాద్, ఏప్రిల్ 24, ( వెలుతురు)**

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకప్పుడు విద్యా కేంద్రాలుగా వెలుగొందిన ఈ బడులు, నేడు తల్లిదండ్రుల ప్రైవేట్ మోజుతో కళ తప్పిపోతున్నాయి. గ్రామంలో ఒకరు తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమం పేరుతో లక్షలు గుమ్మరిస్తుంటే, మిగిలిన వారు కూడా అదే బాటలో పరుగెడుతున్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతున్నా.. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. పక్కింటి వారిని చూసి తమ పిల్లలను ప్రైవేట్ పరం చేసే ధోరణి సమాజంలో వేళ్లూనుకుపోయింది.నెలనెలా లక్షల జీతం తీసుకునే వారికి ఇది పెద్ద భారం కాకపోయినా, రోజువారీ కూలీ చేసుకునే పేద తల్లిదండ్రులకు ఇది పెను భారంగా అవుతుంది. అయినా.. సమాజంలో తమ స్థాయిని నిలబెట్టుకోవడం కోసం వారు అప్పులు చేసి మరీ ప్రైవేట్ బడులకు తమ పిల్లలను పంపుతున్నారు. "ఒక గొర్రె బాయిలో పడితే మిగతా గొర్రెలు కూడా దాని వెంటే వెళ్తాయి" అన్న చందంగా.. ఊరైనా పట్టణమైనా ఇదే పరిస్థితి నెలకొంది.ఈ నేపథ్యంలో.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఎలాగైనా తమ బడిని నిలబెట్టుకోవాలనే తపనతో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కల్లెం వీరారెడ్డి చేసిన ప్రయత్నం మాత్రం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. బడిబాట కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఆయన తన ఉపాధ్యాయ బృందంతో కలిసి ఉపాధి హామీ పనులకు వెళ్లారు. అక్కడ కూలీ చేస్తున్న తల్లిదండ్రులను కలుసుకొని.. చేతులు జోడించి వేడుకున్నారు. "అయ్యా, అమ్మా.. ప్రభుత్వ బడుల్లో ఎంతో అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారు. మీరు కష్టపడి సంపాదించిన డబ్బును ప్రైవేట్ బడులకు వృథా చేయకండి. మీ పిల్లలను మా బడిలో చేర్పించండి. ఒకవేళ మా చదువులో లోపం ఉంటే మమ్మల్ని నిలదీయండి" అని ఆయన ఆవేదనగా విన్నవించారు.ప్రధానోపాధ్యాయుడి ప్రయత్నం.. ఆ మాటల్లోని నిజాయితీ కూలీల హృదయాలను తాకింది. వారిలో చలనం వచ్చింది. తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివిస్తామని వారు హామీ ఇచ్చారు. మొదటి రోజు 14 మంది విద్యార్థులు చేరగా.. రెండో రోజు మరో 17 మంది బడిలో అడుగుపెట్టారు. ఒక ఉపాధ్యాయుడు తలచుకుంటే ప్రభుత్వ బడుల రూపురేఖలు ఎలా మార్చవచ్చో వీరారెడ్డి నిరూపించారు. మిగిలిన ఉపాధ్యాయులు కూడా ఇదే స్ఫూర్తితో పనిచేస్తే.. తెలంగాణలోని ఏ ప్రభుత్వ పాఠశాల కూడా విద్యార్థులు లేకుండా వెలవెలబోదు. పిల్లల నవ్వులు, చదువుల సందడితో ఆ బడులన్నీ కళకళలాడుతాయి.



## ఒక్కో మార్కుతో లక్షా 85 వేల మంది ఫెయిల్

**హైదరాబాద్, ఏప్రిల్ 24, (న్యూస్ పల్స్)**

తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఒక్క మార్కు తేడా అనేకమంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపింది. బోర్డు వర్గాల ప్రకారం, దాదాపు 1.85 లక్షల మంది విద్యార్థులు ఒక్క మార్కు తేడాతో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ఇది విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆవేదనను కలిగించింది. ఈ ఏడాది మొత్తం ఉత్తీర్ణత శాతం 71.37గా నమోదైంది. ఇందులో బలమైన ప్రదర్శన కనబర్చిన గురుకుల విద్యా సంస్థలు 83.17 శాతం ఉత్తీర్ణతతో ముందున్నాయి. అంతేకాకుండా, కొన్ని కళాశాలల్లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులు మెరిశారు. బైపీసీ స్ట్రీమ్‌లో ఓ విద్యార్థిని 997 మార్కులతో టాప్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. అలాగే ఎంపీసీలో నలుగురు విద్యార్థులు 996 మార్కులు సాధించారు. దేవరకొండ గిరిజన సంక్షేమ పాఠశాలలో చదివిన విద్యార్థిని కూడా బైపీసీలో 996 మార్కులు సాధించడం విశేషం.ఇదిలా ఉంటే..1.85 లక్షల మంది ఫెయిల్ కావడంపై విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారు చెప్పినట్లు, గ్రేస్ మార్కులు, రీ%-%వెల్యూయేషన్ విధానాలపై స్పష్టత అవసరం. అలాగే, విద్యార్థుల మెరుగైన మానసిక స్థితిని పరిగణలోకి తీసుకుని, మరింత హృదయపూర్వక పరీక్షా విధానం అవసరమని సూచిస్తున్నారు. రీవాల్యువేషన్, రీకౌంటింగ్‌లో ఇందులో చాలా మంది పాస్ అయ్యే అవకాశం ఉంది.ఇక మే 22 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ మే మొదటి వారంలో విడుదలయ్యే అవకాశం ఉంది. ఇందులో ఫెయిల్ అయిన విద్యార్థులు ఫాస్ అయ్యే అవకాశం ఉంది.

## భూ భారతి చట్టం -2025 తీసుకురావడం చారిత్రాత్మకం

**ధరణిలో వచ్చిన అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తూ రూపొందించినదే నూతన భూ భారతి చట్టం**

**వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి**

**వనపర్తి , ఏప్రిల్ 24, ( వెలుతురు)**

ఎన్నికల సందర్భంగా అప్పటి పి.సి.సి. అధ్యక్షులుగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ధరణి వల్ల రైతులు అనుభవిస్తున్న కష్టాలను చూసి ఎన్నికల్లో గెలిపిస్తే మాయదారి ధరణి చట్టాన్ని బంగాళాఖాతంలో పడేస్తామని చెప్పడంతో రాష్ట్ర ప్రజలు తమ ఓటు వేసి గెలిపించారని, అందుకు అనుగుణంగా 14 నెలల్లో ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందనీ శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. బుధవారం పెబ్బేరు మండలంలోని కంచిరావు పల్లి రైతువేదిక, శ్రీరంగాపూర్ మండలంలోని కామన్ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం - 2025 అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి పాల్గొన్నారు ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ గత ప్రభుత్వం 18 లక్షల ఎకరాల భూమిని మాయం చేసి తీసుకొచ్చిన మాయదారి ధరణి చట్టాన్ని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బంగాళ ఖాతంలో వేయడం జరిగిందని, ధరణి స్థానంలో రైతులకు మేలు చేసే రైతు పక్షపాతి అయిన భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని అన్నారు. ధరణి చట్టం ప్రకారం తహసిల్దార్ ఒకసారి రిజిస్ట్రేషన్ చేస్తే అందులో తప్పులు ఉన్నా, ఏ సమస్య ఉన్న తిరిగి సరి చేసేందుకు తహసీల్దార్ కు గానీ, ఆర్డీఓ లేదా కలెక్టర్ కు సైతం అధికారం లేకుండా ఉండేదన్నారు దాదాపు 9.5 లక్షల సాదా బైనామా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని స్పష్టం చేశారు. అన్నదమ్ముల మధ్య గొడవలు ఏర్పడ్డాయని, సమస్యల పరిష్కారానికి సివిల్ కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చేదని, అయినప్పటికీ చాలా సమస్యలు పరిష్కారం కాకుండా ఉండిపోయాయన్నారు ఇలాంటి ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తూ భూ భారతి చట్టం తీసుకురావడం జరిగిందనీ తెలియజేశారు. భూభారతి చట్టం ప్రకారం సమస్యలు ఉంటే ఆర్డీఓ, కలెక్టర్ కు అప్పీల్ చేసుకునే రెండెంచెల అప్పీల్ వ్యవస్థ భూ భారతి చట్టంలో కల్పించడం చాలా కీలకమన్నారు. భూసమస్యల పరిష్కారానికి గతంలో డబ్బులు కట్టి సివిల్ కోర్టులో కేసు పెట్టాల్సి వచ్చేదని, ఇప్పుడు ఒక్క రూపాయి కట్టకుండా, అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని తెలియజేశారు. దరఖాస్తు చేసుకున్న 30



రోజుల్లో ఏ చర్య తీసుకోకుంటే ఆటోమేటిక్ గా పరిష్కారం అయిపోతుందని తెలిపారు. భూ సమస్యలు, సర్వే చేయడానికి త్వరలో 1000 మంది సర్వేయర్ల నియామకం చేపట్టడం జరుగుతుందని, అదేవిధంగా మరో 600 మంది ప్రైవేట్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి సేవలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం రెవెన్యూ అధికారుల పై నిందలు మోపి వి.ఆర్. ఒ వ్యవస్థను రద్దు చేసిందని, భూ భారతి చట్టం ప్రకారం తిరిగి రెవెన్యూ వ్యవస్థను తీసుకురావడం జరుగుతుందన్నారు.ప్రభుత్వ అధికారులను గుండెల్లో పెట్టుకొని సమస్యలు పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక 26 లక్షల మంది రైతులకు రూ. 2.00 లక్షల వరకు రైతు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. పేదలు అందరికీ సన్న బియ్యం ఉచితంగా అందించాలనే ఉద్దేశ్యంతో 3.10 కోట్ల మందికి రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి 56 యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ మంజూరు చేయడం జరిగింది వనపర్తి జిల్లాలో సైతం 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ ను మంజూరు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా విశ్రాంత ఐ.ఏ.ఎస్. మురళి సలహాలు సూచనల మేరకు ప్రతి మండల కేంద్రంలో రూ . 5 కోట్ల వ్యయంతో అన్ని మౌలిక సదుపాయాలతో పాఠశాల నిర్మించి బస్సులు ఇచ్చి చుట్టు పక్కల గ్రామాల నుంచి విద్యార్థులను తరలించి విద్యాభ్యాసం చేయించడం జరుగుతుందన్నారు. యాసంగిలో పండించిన ప్రతి గింజను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని, తాలు, మట్టి ఎక్కువగా లేకుండా ఉండేందుకు కోత యంత్రాలకు ఆర్.పి.యం 19-20 పెట్టీ కోతలు చేపట్టాలని సూచించారు. బిప్రతి సెంటర్ లో లాగ్ బుక్ పెట్టీ వచ్చిన ధాన్యం వివరాలు నమోదు చేసుకొని ప్రతి రోజు తేమ శాతం కొలుస్తూ నిబంధనల ప్రకారం తేమ వచ్చిన వెంటనే కొనుగోలు చేస్తారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కొరకు ఏ ఒక్కరికి ఒక్క రూపాయి ఇవ్వొద్దని, అర్హులైన పేద ప్రజలకు తప్పకుండా మంజూరు అవుతాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు 425 నుండి 600 చదరపు అడుగులో మాత్రమే ఇల్లు నిర్మించుకోవాలని అప్పుడే బిల్లు పడుతుందన్నారు. లేనిపక్షంలో పేద ప్రజలు అనవసరంగా అప్పుల బారిన పడిపోతారని సూచించారు మహిళలను కోటీశ్వరులు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. అద్దె బస్సు, పెట్రోల్ బంక్, సోలార్ లైట్లు నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేసి రాష్ట్రంలో 74 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా రూ. 10 వేల కోట్ల వ్యయంతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకొచ్చిందని, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు శ్రీరంగాపూర్ దేవాలయ పరిధిలో పర్యాటక అభివృద్ధి కొరకు 150 కోట్లు మంజూరు చేయడం జరిగిందని అందుకు పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. శ్రీరంగాపూర్ డ్యామ్ కింద ఉన్న ఇళ్ల ముందు డ్యాం నీళ్ళు వస్తున్నాయని త్వరలోనే ఒక పరిష్కారం చూపిస్తామని తెలియజేశారు. భూ భారతి చట్టం గురించి జిల్లా కలెక్టర్ ఆదర్శ ఆరబీ, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం మాట్లాడి ప్రజలకు అవగాహన కల్పించారు. పెబ్బేరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, పెబ్బేరు తహసిల్దార్ లక్ష్మీ, శ్రీరంగాపూర్ తహసిల్దార్ మురళి, ఎంపీడీఓ రవీందర్ , మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# సరిహద్దుల్లో భారత జవాన్‌ను బంధించిన పాక్

- తక్షణమే విడుదల చేయాలని భారత్ డిమాండ్





**న్యూఢిల్లీ,ఏప్రిల్24( వెలుతురు):**
పహల్గాం ఉగ్రదాడి ఘటనతో భారత్-పాక్ మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. భారత జవానును పాకిస్తాన్ బందీగా చేసుకుంది. భారత్, పాక్ సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ జవాన్‌ను పాక్ బంధించింది. తమ భూభాగంలోకి ప్రవేశించాడని పాక్ ఆరోపించింది. బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌ను అక్రమంగా బంధించడంపై భారత్ మండిపడింది. బుధవారం ఫిరోజ్‌పూర్ బోర్డర్ దగ్గర 182వ బెటాలియన్‌కు చెందిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పీకే సింగ్ ప్రమాదవశాత్తూ బోర్డర్ దాటాడు. పాకిస్తాన్ రేంజర్లు బీఎస్ఎఫ్ జవాన్ పీకే సింగ్ ను బంధించారు. ఆ సమయంలో పీకే సింగ్ బీఎస్ఎఫ్ యూనిఫాం ధరించి సర్వీస్ రైఫిల్‌తో ఉన్నారు. సరిహద్దు అవతల పొలం పనులు చేసుకుంటు-న్న రైతులకు తోడుగా ఉన్న పీకే సింగ్ ఒక చెట్టు కింద నీడలో కూర్చుని ఉండగా పాక్ రేంజర్లు ఆయనను బంధించారు. పీకే సింగ్ నిర్బంధంపై సరిహద్దులోని భద్రతా దళాల మధ్య సమావేశం కొనసాగుతోంది. బీఎస్ఎఫ్ జవానును తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని భారత్ స్పష్టం చేసింది. పహల్గాం ఘటన తర్వాత జరిగిన పరిణామాలతో భారత జవాను నిర్బంధం చర్చనీయాంశమైంది. ఏప్రిల్ 23న సాయంత్రం జవానును పాక్ నిర్బంధించింది.

## హైదరాబాద్‌లో మరోసారి ఈడీ దాడులు

**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**
హైదరాబాద్‌లో మరోసారి ఈడీ దాడులు కలకలం రేపుతున్నాయి. ఏకకాలంలో ఏకంగా 13 మంది హవాలా ఆపరేటర్లపై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే పలువురుని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే, గతంలోనూ దేశవ్యాప్తంగా హవాలా వ్యాపారులపై ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఢిల్లీ, జైపూర్, బెంగాల్, కోల్‌కతాలోనూ దాడులు చేశారు. తనిఖీల్లో భారీ మొత్తంలో హవాలా డబ్బుని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

## సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్‌పై ఆర్టికల్స్ ఆఫ్ ఛార్జ్




**అమరావతి,ఏప్రిల్24(వెలుతురు):**
సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్‌పై ఆర్టికల్స్ ఆఫ్ ఛార్జ్ నమోదైంది. సర్వీసు నిబంధనల ఉల్లంఘన, వివిధ అభియోగాలతో ఆర్టికల్స్ ఆఫ్ ఛార్జ్‌ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. సీఐడీ చీఫ్‌గా, అగ్నిమాపకశాఖ డీజీగా నిబంధనలు ఉల్లంఘించారని తేలడంతో ప్రభుత్వం ఆయనపై చర్యలు తీసుకుంది. ప్రభుత్వానికి తెలియకుండా పలుమార్లు సునీల్ విదేశీ పర్యటనలకు వెళ్లినట్లు- విచారణలో తేలింది. 2022లో జార్జియా పర్యటనకు అనుమతి తీసుకొని యూఏఈకి, మరోసారి అనుమతి లేకుండా స్వీడన్ వెళ్లాడని ప్రభుత్వం పేర్కొంది. వెయింటింగ్‌లో ఉన్నప్పుడూ అనుమతి తీసుకోకుండా అమెరికా వెళ్లాడని మూడో ఛార్జ్ నమోదు చేసింది. మరోవైపు 2019లో అమెరికా వెళ్తానంటూ యూకే వెళ్లినట్లు- ఆరో ఆర్టికల్ ఆఫ్ ఛార్జ్, 2021లో ప్రభుత్వానికి తెలియకుండా యూఏఈ వెళ్లినట్లు- ఐదో ఛార్జ్ నమోదు చేసింది.

## 14 మంది మావోయిస్టుల లొంగుబాటు




**వరంగల్,ఏప్రిల్24( వెలుతురు):**
ఓవైపు నక్స్ల్స ఏరివేత కార్యక్రమంముమ్మరంగా సాగుతున్న వేళ..కొందరు లొంగుబాట పట్టారు. వరంగల్‌లో 14 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిని ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మీడియా ముందుకు తీసుకొచ్చారు. ఒక్కో మావోయిస్టుకు రూ.25వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ..రెండు నెలలుగా మావోయిస్టుల లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నాం. ఈ ఏడాది 250 మంది సరెండర్ అయ్యారు. నేడు 14 మంది లొంగిపోయారు. వీరిలో ఇద్దరు ఏరియా కమిటీ- సభ్యులు ఉన్నారు. తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.25వేలు అందజేశాం. మావోయిస్టులు హింసాయుత విధానాలు వదిలివేసేలా చేయడమే మా ఉద్దేశం. ఏ రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు వచ్చి లొంగిపోయినా సహకారం అందిస్తాం. జనజీవన స్రవంతిలో కలిస్తే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

## బాలుడి కిడ్నాప్..గంటలోనే ఛేదించిన పోలీసులు

**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**
పాతబస్తీ చంద్రాయణగుట్ట ప్రాంతంలో ఓ చిన్నారి కిడ్నాప్ కలకలం రేపింది. అయితే, ఈ సంఘటనలో పోలీసులు వేగంగా స్పందించడంతో గంటలోనే బాలుడిని రక్షించి, కిడ్నాపర్లను పట్టు-కోవడం విశేషం. ఇందుకు సంబంధించిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఒక బాలుడిని అతని బాబాయి సాదిక్ దగ్గరకు తీసుకెళ్లారు. సాదిక్ బాలుడిని ఓ వైన్ షాప్ కు తీసుకెళ్లాడు. అక్కడ మద్యం సేవించిన సాదిక్ స్పృహ కోల్పోయి రోడ్డు పక్కనే పడిపోయాడు. ఈ సమయంలో బాలుడు ఒంటరిగా ఉన్నదాన్ని గమనించిన ఒక కిడ్నాప్ ముఠా పిల్లాడిని ఎత్తుకెళ్లింది. బాలుడు కనిపించకపోవడంతో వెంటనే ఆ బాలుడి బాబాయి, తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి సీసీకెమెరా ఫుటేజ్ ద్వారా విచారణ ప్రారంభించారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు త్వరిత చర్యలు తీసుకుని గంటలోనే బాలుడిని కిడ్నాప్ చేసిన ముఠాను పట్టుకున్నారు. ఈ ఘటనలో పోలీసులు చూపిన స్పందనకు ప్రజల నుండి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నారుల భద్రతపై పెద్దల బాధ్యత ఎంత ముఖ్యమో ఈ సంఘటన మరొకసారి గుర్తు చేసింది.

# బాహుబలి సభకు భారీ ఏర్పాట్లు




**వరంగల్, ఏప్రిల్ 24, ( వెలుతురు)**
25 ఏళ్ల వైభవాన్ని చాటిచెప్పేలా అట్టహాసంగా ఏర్పాట్లు చేస్తోంది గులాబీ పార్టీ. బాహుబలి వేదిక.. ఉద్యమ ప్రస్థానాన్ని గుర్తు చేసేలా ప్రదర్శనలు.. ఇలా చెప్పుకుంటే పోతే ఎన్ని విశిష్టతలు ఉండబోతున్నాయని భారతీయ రాష్ట్ర సమితి పార్టీ సంకేతాలు ఇస్తోంది. పోరాటాల పురిటిగడ్డ వరంగల్ వేదికగా కనీవినీ ఎరుగని రీతిలో జనసమీకరణ చేసి తమ సత్తా చాటుతామంటోంది కారు పార్టీ. ఇంతకీ ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయి.వరంగల్‌ను సెంటిమెంట్‌గా భావిస్తున్న గులాబీ పార్టీ.. మూడు జిల్లాల సరిహద్దు అయిన ఎల్కతుర్తి దగ్గర రజతోత్సవ మహాసభ నిర్వహించేందుకు పార్టీ ప్లాన్ చేసింది. ఏప్రిల్ 27వ తేదీన జరగబోయే ఈ మహాసభకు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాల సరిహద్దు ప్రాంతం వేదికైంది. తమ సత్తా ఏంటో ఈ సభ ద్వారా చాటుతామంటోంది కారు పార్టీ కేడర్. సభకు సుమారు పది లక్షల మంది కార్యకర్తలు వస్తారని పార్టీ అంచనా వేస్తోంది. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చే జనాలకు ఏ మాత్రం ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ప్లాన్ ప్రకారం ఏర్పాట్లు జరుగుతున్నాయి. సమయం దగ్గర పడుతుండటంతో పనులు వేగవంతంగా సాగుతున్నాయి.మొత్తం 1213 ఎకరాల్లో బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందులో 159 ఎకరాల్లో సభా ప్రాంగణం. 5 ఎకరాల విస్తీర్ణంలో సభా వేదిక ఉంటుంది. ఐదు వందల మంది కూర్చునేలా బాహుబలి వేదిక నిర్మాణమవుతోంది. సభకు వెనుకాలే 4 ఎకరాలు వీఐపీ పార్కింగ్‌కు కేటాయించారు. ఇక 150 ఎకరాల్లో పబ్లిక్, %ఎంఞ%, ప్రెస్ సహా ఉద్యమకారులకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన స్థలాన్ని భోజన వసతి, పార్కింగ్ కోసం కేటాయించారు. ఎటువైపు నుంచి వచ్చే వాహనాలు అటువైపే పార్క్ చేసేలా.. ఐదు ప్రాంతాల్లో పార్కింగ్‌కు ఏర్పాటు చేస్తున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పది లక్షల మజ్జిగ ప్యాకెట్లు, 10 లక్షల వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నారు.రాజకీయ పార్టీలు పెట్టే బహిరంగ సభలకు కొంత డబ్బులు ఖర్చు అవ్వడం కామన్ విషయమే. ఇక ఎన్నికల సమయంలో పెట్టే భారీ బహిరంగ సభలకు అయితే కోట్లల్లో ఖర్చు అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో భారీ బహిరంగ సభలకు కేరాఫ్ అడ్రస్ కచ్చితంగా భారత రాష్ట్ర సమితినే. ఉద్యమ కాలం నుంచి అధికారంలో ఉన్న ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చున్న బహిరంగ సభలు నిర్వహించడంలో ఆ పార్టీ ప్రత్యేకత వేరు. మిగతా రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలోనే బహిరంగ సభలో నిర్వహిస్తే బీఆర్ఎస్ మాత్రం కనీసం ఏడాదికి ఒకటి రెండు బహిరంగ సభలో నిర్వహిస్తూ వస్తుంది. అధికారంలో ఉండగా కొంగర కలాన్‌లో ఐదు లక్షల మందితో పెద్ద ఎత్తున సభ నిర్వహించి సక్సెస్ చేసింది. అధికారంలో ఉండగానే రైతు మహాసభ నిర్వహించింది. ఇక వరంగల్లో ఉద్యమ కాలంలో పోరుగర్జన, సింహ గర్జన లాంటి సభలను లక్షలాది మందితో సక్సెస్ చేసుకుంది. కానీ ఇప్పుడు అంతకు మించి అంటూ మరోసారి గులాబీ సత్తా చాటేందుకు ముందుకు వస్తుంది బీఆర్ఎస్.తనకు అచ్చి వచ్చిన వరంగల్‌లోనే మరో అతి భారీ బహిరంగ సభకు తెరలేపింది. ఏప్రిల్ 27వ తేదీన పార్టీ 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా ఈ బాహుబలి బహిరంగ సభ జరగనుంది. ఇందుకోసం 10 లక్షల మందిని సమీకరించాలని టార్గెట్‌గా పెట్టుకుంది గులాబీ పార్టీ. అయితే జన సమీకరణం పక్కన పెడితే ఖర్చు కూడా బాహుబలి స్థాయిలోనే కనిపిస్తుంది. ఇప్పటికే అధికారికంగా ప్రతి నియోజకవర్గానికి 25 లక్షల రూపాయలు పార్టీ తరపున చెక్కులు విడుదల చేశారు. ఈ అమౌంట్ దాదాపుగా రూ. 30 కోట్లు. దీంతోపాటు 1200 ఎకరాలను రైతుల దగ్గర లీజుకు తీసుకుంది పార్టీ. ఈ 1200 ఎకరాల్లో చదును చేయడం, బారికేడ్లు వేయడం, రోడ్లు వేయడం, స్టేజ్, గెస్ట్ ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఇలా కేవలం సభాస్థల వద్ద మరొక 20 నుంచి 25 కోట్ల రూపాయలు ఖర్చే అవకాశం కనిపిస్తుంది.వీటితోపాటు రాష్ట్రవ్యాప్తంగా 500 మంది ఆర్టిస్టులతో వాల్ రైటింగ్ నిర్వహిస్తుంది పార్టీ. ఏప్రిల్ 20వ తేదీన మొదలుపెట్టి వారం రోజులపాటు అంటే బహిరంగ సభ జరిగే 27 వరకు రాష్ట్రవ్యాప్తంగా గులాబీ జెండాలు ఫ్లెక్సీలు, హోర్డింగులు పెట్టించనుంది. వీటితోపాటు పేపర్లు టీవీల్లో అడ్వర్టైజ్మెంట్ లు కూడా.. వీటి కోసం మరొక 20 %-% 25 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇక జన సమీకరణ కోసం ఇప్పటికే ఆర్టీసీకి రూ. 9 కోట్లు చెల్లించింది భారత రాష్ట్ర సమితి. వీటితోపాటు ప్రైవేటు వాహనాలు. మధ్యలో వారికి భోజనాలు, సభా స్థలం వద్ద పది లక్షల మజ్జిగ ప్యాకెట్లు, 10 లక్షల వాటర్ ప్యాకెట్లు, కూలర్లు ఇలా వీటన్నింటికీ మరో పాతి కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇలా గులాబీ బాహుబలి బహిరంగ సభ కోసం దాదాపు రూ. 100 కోట్ల దాకా ఖర్చు పెట్టనుంది పార్టీ. ఈ లెక్కన తెలుగు రాష్ట్రాల్లో జన సమీకరణ పరంగా చూసిన, ఖర్చుపరంగా చూసిన ఇదే భారీ బహిరంగ సభ.ఈ బహుబలి సభకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలంతా ఏర్పాట్లలో బిజీ బిజీగా ఉన్నారు. సభా ఏర్పాట్ల దగ్గర నుంచి జనసమీకరణ వరకు అనేక కమిటీలు ఏర్పాటు చేసుకుని సమన్వయంతో పనిచేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ నేతలు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

# కొండగట్టులో కోతులు



**కరీంనగర్, ఏప్రిల్ 24, ( వెలుతురు)**
జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వాం దేవస్థానానికి ప్రతి రోజూ పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. ఇతర రాష్ట్రాల నుంచీ.. ఇక్కడికి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. ఇక్కడ కొండపైన కొలువై ఉన్న అంజనేయస్వామి ఆలయానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ చాలా యేళ్లుగా కోతులు ఉన్నాయి. అయితే.. గతంలో.. కొండపైన భారీ వృక్షాలు.. వివిధ రకాల పండ్ల చెట్లు ఉండటంతో.. ఎలాంటి సమస్య రాలేదు. అయితే అటవీ విస్తీర్ణం తగ్గడంతో పాటు పండ్ల చెట్లు కనుమరుగువుతున్నాయి. దీంతో కోతులన్నీ ఇక ఆలయానికి చేరుకుంటున్నాయి. మొత్తం ఆలయ పరిసర ప్రాంతాల్లోనే కోతులు సంచరిస్తున్నాయి. 15 యేళ్లుగా కోతులు భక్తులను ముప్పితిప్పలు పెడుతున్నాయిఈ నేపథ్యంలోనే కోతుల ఆహారం కోసం గతంలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. కొండ కింద.. మంకీ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ రకాల పండ్ల మొక్కలు పెంచి.. వాటిని అక్కడికి తరలిస్తామని నిర్ణయం తీసుకున్నారు. కానీ, కేవలం బోర్డు మాత్రమే ఏర్పాటు చేశారు. తరువాత ఇక్కడ ఎలాంటి పండ్ల మొక్కలు నాటలేదు. ఆహారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కోతులన్నీ కొండపైన తిష్ట వేస్తున్నాయి. కొండ సమీపంలో చెట్లు ఉన్నా.. అధికంగా కలప చెట్లు ఉంటాయి. పండ్ల చెట్లు లేవు. దీని కారణంగా భక్తులను వానరాలు టార్గెట్ చేస్తున్నాయి. కడుపు నింపుకోవడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నాయి. భక్తుల చేతిలో ఏం ఉంటే.. అవి ఎత్తుకొని వెళ్తున్నాయి.ఇక్కడ ప్రసాదం తీసుకోవాలంటే.. భక్తులు భయపడుతున్నారు. అంతేకాకుండా చాలా మంది భక్తులు స్వామి వారి సన్నిధిలో గడుపుతారు. వంట చేసుకోవడం కూడా ఇబ్బందిగా ఉంది. ఆహార పదార్థాలు ఎత్తుకొని వెళ్తున్నాయి. భక్తులు చేతిలో కర్ర పట్టుకొని కాపాలా ఉంటున్నారు. ముఖ్యంగా కొండగట్టులో ఎలాంటి పండ్ల చెట్లు లేకపోవడంతో భక్తులు ఇచ్చే ఆహారంపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఎండకాలంలో.. ఆహారం కోసం మరింత ఇబ్బంది పడుతున్నాయి.అయితే, కొంత మంది భక్తులు.. ఇక్కడికి వచ్చి వివిధ రకాల పండ్లు ఇక్కడికి వచ్చి కోతులకు పెడుతున్నారు. కానీ.. అ ఏమాత్రం సరిపోవడం లేదు. సహజంగానే హనుమాన్ ఆలయాల వద్ద ఎక్కువగా కోతులు ఉంటాయి. వాటికి కడుపు నింపేందుకు అధికారులు ఎలాంటి ఆలోచన చేయడం లేదని భక్తులు మండిపడుతున్నారు. పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు నాటి.. కోతుల జోన్ ఏర్పాటు చేసి వాటికి ఆహారాన్ని అందించాలని భక్తులు కోరుతున్నారు. ప్రతి రోజూ ఇక్కడ కోతులు రంగం చేస్తున్నాయి. ఒక్కసారి కోతి పైకి వస్తే.. చేతిలో ఏం ఉన్న వదిలిపెట్టి వెళ్తారు. గతంలో చేతిలో ఉన్న బ్యాగ్‌లు, సెల్‌పోన్లు ఎత్తుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి. వాటిని మళ్లీ కోతుల నుంచీ తీసుకోవడానికి భక్తులు నానా తంటాలు పడాల్సి వస్తుంది.అయితే.. మంకీ ఫుడ్ కోర్టును అభివృద్ధి చేసి, భారీగా పండ్ల మొక్కలు పెంచితే తప్ప కొంత మేరకు భక్తులకు బాధలు తప్పేలా లేవు. లేదంటే.. భయం.. భయంగానే భక్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ కోతులు ఎక్కువగా ఉన్నాయని, చేతిలో ప్రసాదం పట్టుకుంటే ఎత్తుకొని వెళ్తున్నాయని భక్తులు అంటున్నారు. చాలా జాగ్రత్తగా తీసుకొని వెళ్తున్నామని చెబుతున్నారు. పిల్లలు భయపడుతున్నారని అంటున్నారు. కోతుల కోసం.. పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు నాటి, వాటికి ఆహారాన్ని అందించాలని భక్తులు కోరుతున్నారు.

# పాకిస్తాన్ లో ట్రైనింగ్... టెక్నాలజీకి దూరం... ఉగ్రవాదుల ప్లానింగ్...

**శ్రీనగర్, ఏప్రిల్ 24, ( వెలుతురు)**
మొత్తం ఏడుగురు ఉగ్రవాదులు పహల్గాం దాడికి పాల్పడినట్లు తెలుస్తుంది. దాడి చేసిన వారిలో ఇద్దరు స్థానిక ఉగ్రవాదులు కూడా ఉన్నట్లు తెలుస్తుంది. విదేశీ ఉగ్రవాదులు మాట్లాడిన ఉర్దూ పాకిస్తాన్‌లోని కొన్ని ప్రాంతాలకు చెందింది. వారితో ఇద్దరు స్థానిక ఉగ్రవాదులు ఉన్నట్లు అనుమానిస్తున్నట్లు భద్రతా సంస్థకు చెందిన ఓ అధికారి తెలిపారు. అధికారులు బుధవారం ముగ్గురు ఉగ్రవాదుల స్కెచ్‌లను విడుదల చేశారు. వారి గురించిన సమాచారం ఇచ్చిన వారికి ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున రివార్డు కూడా ప్రకటించారు. నిందితుల్లో గతేడాది %ూఖీ% కాన్వాయ్‌పై జరిగిన దాడిలోనూ ఓ అనుమానితుడి హస్తం ఉన్నట్లు ఉన్నత వర్గాలు భావిస్తున్నాయి. మిగతా ఇద్దరు కుల్గాంలోని బిజ్‌బెహరా, థోకెర్‌పోరాకు చెందినవారని భావిస్తున్నారు.వీరు 2017లో పాకిస్తాన్‌కు వెళ్లి గత ఏడాదే తిరిగి జమ్మూకి వచ్చారు. వారు పాకిస్తాన్‌లో శిక్షణ పొందారని సమాచారం. ఆ ఇద్దరు ఉగ్రసంస్థ జైష్-ఎ-మొహమ్మద్‌తో సంబంధం కలిగి ఉన్నారు. ఈ దాడి అమలు చేయడానికి లష్కరే-ఎ-తోయిబా, జైష్‌తో పొత్తు పెట్టుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు కేంద్ర నిఘా సంస్థ వెల్లడించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా అనేక ఉగ్రవాద దాడుల్లో భాగస్వామిగా ఉన్న లష్కరే అగ్ర కమాండర్ సైఫుల్లా కసూరి అలియాస్ సైఫుల్లా ఖలీద్ ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. అతను 26/11 ముంబై దాడుల సూత్రధారి హాఫీజ్ సయీద్‌కు సన్నిహితుడు. దాడి అనంతరం ఉగ్రవాదులంతా పిర్ పంజాల్ శ్రేణిలోని ఎత్తైన ప్రాంతాలకు పారిపోయారు. సైన్యం, కేంద్ర పారామిలిటరీ దళాలతోపాటు జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు.దాడి చేసిన వారు బాడీ కెమెరాలను చిత్రీకరించి ఉంటారని పోలీసులు తిలిపారు. గత మూడేళ్లలో జమ్మూలో జరిగిన అన్ని దాడుల్లోనూ బాడీ, గన్-మౌంటెడ్ కెమెరాల ద్వారా వీడియోలను చిత్రీకరించారు. ఈ వీడియోలను ప్రచార ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారు. ఫుటేజీని ఉపయోగించి %ూజు% ప్రచార సామగ్రిని విడుదల చేస్తున్నారు. దాడి చేసిన వ్యక్తులు కాశ్మీర్‌లోకి ఎలా ప్రవేశించారో, వారు ఎంతకాలంగా లోయలో ఉంటున్నారో ఇప్పటికీ తెలియరాలేదు. సరిహద్దుల్లో ఉన్న దుర్భర పరిస్థితులను ఆధారంగా చేసుకుని ముష్కరులు దేశంలోకి ప్రవేశించి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. కానీ ఇందుకు సంబంధించి ఖచ్చిత ఆధారలు లభించలేదు. ఏజెన్సీలు వివరాలను ధృవీకరించేపనిలో పడ్డాయి. బుధవారం ఘటనా స్థలానికి %చీ×ూ% అధికారుల బృందం చేరుకుంది. దర్యాప్తును స్థానిక పోలీసుల నుంచి ఏజెన్సీ స్వీకరించే అవకాశం ఉంది. స్థానిక పోలీసులు సహాయం అందించాలని, సాక్షులందరి వాంగ్మూలాలను పరిశీలించాలని ఓ అధికారి తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దాడి జరిగిన బైసారన్ మైదానాన్ని సందర్శించారు. శ్రీనగర్‌లో పోలీసులు, ఇంటెలిజెన్స్ బ్యూరో, సైన్యంలోని ఉన్నతాధికారులతో భద్రతా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. దాడి బాధితులను కూడా ఆయన కలిశారు. బాధితుల్లో ఎక్కువ మందిని తల, ఛాతీపై కాల్పులు జరిపారు. 12 మంది బాధితుల తలలకు బుల్లెట్ గాయాలున్నాయి. వీటిని 'కోల్డ్ బ్లడెడ్ హత్యలు' అని అంటారని ఓ అధికారి తెలిపారు. అడవి నుంచి వచ్చి.. మారణహోమం ముగిసిన తర్వాత తిరిగి అడవిలోకి వెళ్లారు. దాడి సమీపంలో నంబర్ ప్లేట్ లేని బైక్ కనిపించింది. కానీ ఉగ్రవాదులు పారిపోయే సమయంలో దీనిని ఉపయోగించలేదని దర్యాప్తు అధికారులు తెలిపారు.దాడి జరిగిన ప్రాంతంలో పర్యాటకుల సౌకర్యం కోసం టెంట్లు, ప్లాస్టిక్ కుర్చీలు ఉంటాయి. కొంతమంది స్థానిక విక్రేతలు తిను బండారాలు అమ్ముతుంటారు. ఈ ప్రాంతానికి రవాణా సౌకర్యంలేనందున పర్యాటకులు కాలనడకన లేదంటే గుర్రంపై పహల్గామ్ మార్కెట్ నుంచి 5-6 కి.మీ దూరం ప్రయాణిస్తుంటారు. ఇక్కడికి నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. ఇది హపట్నార్‌ను మరోవైపు చందన్‌వారీకి అనుసంధానించే దట్టమైన అటవీ ప్రాంతం కూడా. ఈ అడవులనే ఉగ్రవాదులు ఆసరాగా చేసుకుని దాడికి తెగబడ్డారు. ఇలాంటి రద్దీ టూరిస్ట్ ప్లేస్‌లో భద్రతా చర్యలు ఎందుకు చేపట్టలేదనే విమర్శలు వస్తున్నాయి. నిజానికి, ఉగ్రవాదుల కదలికలు పసిగట్టడం అంత తేలికకాదు. ఈ ఉగ్రవాదులు చిన్న చిన్న సమూహాలుగా పనిచేస్తుంటారు. మైనస్ 10 డిగ్రీల సెల్సియస్ వద్ద కూడా అడవుల నుంచి వారు బయటకు రారు. ఎటువంటి గాడ్జెట్‌లను ఉపయోగించరు. అందుకే సాంకేతిక ద్వారా నిఘాను సేకరించే అవకాశం లేదు.అంతేకాకుండా వారు స్థిరంగా ఓ చోట ఉండరు. తమ స్థావరాలను ఎప్పటికప్పుడు మారుస్తూనే ఉంటారు. ఉదాహరణకు.. సోనార్గ్ శిఖరాలపై ఉగ్రవాదుల గుంపు ఉన్నట్లు సమాచారం అందితే అధికారులు స్పందించేలోపు ఉగ్రమూక వేరే ప్రాంతానికి తరలివెళ్లిపోతారు. ఇదంతా చేసేందుకు వారికి అడవులే ఆధారం. దాడి చేసిన వారు ఇటీవలే చొరబడినట్లు కనిపిస్తోందని మరో పోలీసు అధికారి తెలిపారు. బైసారన్ పర్వతాలు, దట్టమైన అడవులు ఉగ్రవాదులకు సహజ ఆశ్రయం కల్పిస్తుందని అన్నారు. అడవుల గుండా కోకర్నాగ్, కిష్త్వార్ వైపు గానీ లేదంటే బాలతాల్, సోనామార్గ్ వైపుగానీ వెళ్లే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాల స్థలాకృతి చూస్తే.. కిష్త్వార్ పర్వతాలు, దట్టమైన అడవుల ద్వారా జమ్మూలోని కథువాకు అనుసంధానించబడిన దోడా వరకు ఉన్నాయి. ఇటీవల కాలంలో కథువా ద్వారా చొరబాట్లు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

# సంపద సృష్టి పేరుతో బోల్తా

- పథకాలు లేకున్నా..అప్పుల వృష్టి
- మాజీ ఆర్థికమంత్రి బుగ్గన ఎద్దేవా




**అమరావతి, ఏప్రిల్24( వెలుతురు):**
సంపద సృష్టి తక్కువ.. అప్పులు ఎక్కువ.. అంటూ కూటమి ప్రభుత్వంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సెటైర్లు వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి.. అప్పు.. సంపద పరిస్థితి ఏంటి..? అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేంద్రంలో మద్దతు ఉందని చెప్పుకుంటున్నారు. కానీ, ఎటువంటి మార్పు లేదని ఆయన దుయ్యబట్టారు. అప్పు అంత ఉంది.. ఇంత ఉందని ఎవరు నోటికి ఏదోస్తే అది చెప్తున్నారు.. మట్కా లెక్కల మాదిరి అప్పు లెక్కలు మాట్లాడుతున్నారని ప్రజలు అంటున్నారన్నారని బుగ్గన అన్నారు. సంపదను సృష్టిస్తామని చెబుతుంటే అనుభవం గల నేతలని ప్రజలు వారిని నమ్మారని ఆయన పేర్కొన్నారు. ఇక, వైసీపీ దిగిపోయే నాటికి 81400 కోట్ల పన్ను ఆదాయం ఉంటే.. మా కంటే తక్కువగా మీ ఆదాయం ఉంది అని బుగ్గన అన్నారు. మా కంటే 7.5 శాతం తక్కువగా కూటమి ప్రభుత్వం సంపద సృష్టి ఉంది.. సంపద సృష్టి తక్కువ.. అప్పులు ఎక్కువ చేసింది కూటమి ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు.. సామాన్య మానవుడి కోసం మేం పరిపాలన చేశాం.. వైసీపీ అప్పు చేసింది అంటారు.. మా కంటే అప్పు ఎక్కువగా చేసి ఎవరికి పెడుతున్నారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. జగనన్న ఉన్నపుడు ఉన్న పథకాలు రావడం లేదని విమర్శించారు. మీరు అధికారంలో ఉన్నా పథకాలు రాలే..? కానీ, సంపద అంతా ఎక్కడికి పోతుంది అంటూ కూటమి ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు.

# ములుగు కర్రగుట్టల్లో ఎన్‌కౌంటర్

- ఐదుగురు మావోయిస్టుల మృతి




**ములుగు,ఏప్రిల్24( వెలుతురు):**
ములుగు జిల్లాలోని తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భీమారంపాడు సమీపంలోని అటవీప్రాంతంలో భద్రతా బలగాలతో జరిగిన భీకర పోరు ఐదుగురు మావోయిస్టులు మరణించారు. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మాతో పాటు దాదాపు 2500 మంది మావోయిస్టులు భీమారంపాడు సమీపంలోని కర్రగుట్టలో ఉన్నట్లు నిఘావర్గాలకు ఇటీవల సమాచారం అందింది. దీంతో కర్రగుట్ట అటవీ ప్రాంతంలో భద్రతాబలగాలు రెండు రోజులుగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టింది. అటవీ ప్రాంతం మొత్తాన్ని అష్టదిగ్బంధనం చేయడంతో పాటు హెలికాప్టర్లతోనూ మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే తారసపడ్డ మావోయిస్టులపై కాల్పులు జరిపి ఐదుగుర్ని హతమార్చారు. ఈ కూంబింగ్ ఆపరేషన్ నేపథ్యంలో భీమారంపాడు గ్రామస్తులు ఎవరూ కూడా బయటకు రావద్దని భద్రతా బలగాలు హెచ్చరికలు జారీ చేశాయి. కాగా, ఈ ఆపరేషన్ గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ హైకమిషన్ లో సంబరాలు

- కేక్ కట్ చేసుకున్న వీడియోపై దేశవ్యాప్తంగా నిరసనలు



**న్యూఢిల్లీ,ఏప్రిల్24( వెలుతురు):**
ఏప్రిల్ 22వ తేదీన పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి ప్రతీ భారతీయుడి మనస్సును కలచివేసింది. ఈ దాడిని ఖండిస్తూ.. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దాడికి దేశమంత కన్నీటిపర్యంతమవుతుంటే.. ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ అధికారులు సంబురాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. అందుకు ఆధారాలు కూడా ఉన్నాయి. తాజాగా ఆ కార్యాలయంలోకి ఓ వ్యక్తి కేకు తీసుకువెళ్లాడు. మీడియా ప్రతినిధులు ఆ కేకు ఎందుకని ప్రశ్నించగా.. అతను సమాధానం చెప్పకుండా తప్పించుకొని లోపలికి వెళ్లాడు. దీంతో పాక్ అధికారులు ఉగ్రదాడిని సెలబ్రేట్ చేసుకున్నట్లే తెలుస్తోంది. దీనిపై తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్థాన్ హై కమిషన్ ఎదుట పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు.

# చంద్రమౌళి కుటుంబ సభ్యులకు జగన్ ఫోన్ పరామర్శ

**అమరావతి,ఏప్రిల్24( వెలుతురు):**
కశ్మీర్ లోని పెహల్గామ్ ఉగ్రదాడిలో మృతి చెందిన జరజాపు చంద్రమౌళి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. గురువారం)చంద్రమౌళి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసిన వైఎస్ జగన్.. వారికి ధైర్యం చెప్పారు. కాగా, జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన చంద్రమౌళి మృతదేహం బుధవారం రాత్రి విశాఖకు చేరుకుంది. ఆయన ఇద్దరు కుమార్తెలు అమెరికా నుంచి గురువారం సాయంత్రం నగరానికి చేరుకునే అవకాశం ఉంది.. శుక్రవారం అంత్యక్రియలు జరగనున్నాయి.

# ఉగ్రదాడిపై సోకాల్డ్ సెక్యులరిస్టులు మాట్లాడరేం

- రాహుల్ విదేశాలకు వెళ్లినప్పుడల్లా ఏదో అలజడి
- మెదక్ ఎంపి రఘునందన్ రావు విమర్శలు




**సిద్దిపేట,ఏప్రిల్24( వెలుతురు):**
జమ్మూ కశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఖండించారు. ఈ సందర్భంగా అమరులకు సంతాపం తెలిపారు. పహల్‌గామ్‌లో తీవ్ర వాదుల చర్య దుర్మార్గమైనదని అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ... అన్యపుణ్యం తెలవని 27మంది పర్యాటకులను ఉద్రవాదులు దుర్మార్గంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లినప్పుడల్లా దేశంలో అలజడులు జరుగుతున్నాయని ఆరోపించారు. జమ్మూ కశ్మీర్‌లో తెలంగాణకి చెందిన 150మంది పర్యాటకులు ఉన్నారని తెలిపారు. ఈ దాడి ఘటనపై సోకాల్డ్ సెక్యులర్ మేధావులు ఎందుకు నోరు మెదపడం లేదని.. వారికి దేశం పట్ల ప్రేమ లేదా అని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. తమిళనాడు సిఎం స్టాలిన్, కమలహాసన్, ప్రకాశ్‌రాజ్ ఎందుకు జమ్మూ కశ్మీర్ ఘటనపై నోరు మెదపడం లేదని.. ఈ దేశంపై మీకు ప్రేమ లేదా అని ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. టెర్రరిస్ట్ సంస్థలపై మోదీ ప్రభుత్వం ఖచ్చితంగా చర్యలు తీసుకుంటు–ందని అన్నారు. రాబర్ట్ వాద్రా బీజేపీపై బురదజల్లటం మానుకోవాలని.. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ నిర్ణయాల వల్ల హైదరాబాద్‌లో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఒవైసీ పేద ముస్లింల కోసం ఆలోచించడం లేదని చెప్పారు. డెవలప్‌మెంట్‌కి ముస్లింలను దూరంగా ఉంచేది ఏంఐఎం పార్టీ అని విమర్శించారు. గత రెండు రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో జరుగుతున్న సంఘటనలు బాధాకరమని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఒక వర్గానికి చెందిన కొంతమంది శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మదర్సాల గురించి రేవంత్ ప్రభుత్వం ఆలోచించాలని చెప్పారు. తెలంగాణను ఇస్లామిక్ అడ్డాగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హిందూ ధర్మం పరమత సహనాన్ని పాటించమని చెబుతోందని అన్నారు. హిందూ దేవాలయాల మీద దాడులు చేస్తే ప్రజలు ఊరుకునే పరిస్థితిలో ప్రస్తుతం లేరని అన్నారు. మతం పేరిట జరిగిన దాడులను హిందువులు ఖండించాలని.. ఆలోచించాలని చెప్పారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మదర్సాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అల్లకల్లోలంగా మారిందని ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు.

# కాశ్మీర్ ఘటనపై కాంగ్రెస్ తీరు బాధాకరం

- భద్రతా వైఫల్యం పేరుతో రాజకీయ పాకులాట
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ బిజెపి లక్ష్మణ్

**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**
ఉగ్రదాడిపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు బాధాకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ భద్రతా వ్యవస్థ వైఫల్యాన్ని చూపించేందుకు ప్రయత్నిస్తూ రాజకీయ లబ్ధి కోసం మాట్లాడుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాజాగా జరిగిన కాంగ్రెస్ నేతలు సమావేశంలో దాడి ఘటనను పొలిటికల్ ఈవెంట్‌లా మార్చే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. భద్రతా సమస్యపై అసత్య ప్రచారాలు చేసి ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు కాంగ్రెస్ పూనుకుంటోందని విమర్శించారు. కాగా, కాంగ్రెస్ పార్టీకి పాకిస్తాన్ పట్ల ఉన్న ప్రేమ కొత్తది కాదని, ఇప్పటికే మన రాష్ట్రానికి చెందిన కొందరు కాంగ్రెస్ నేతలు పాకిస్తాన్‌ను ప్రేమిస్తున్నారని అన్నారు. అలాంటి



నేతలకు భారత భద్రతపై మాట్లాడే అర్హత లేదని ఆయన అన్నారు. అలాగే కాంగ్రెస్ నేతలు హిందువులపై దాడులను నెపంగా చూపించి 'సాఫ్రాన్ టెర్రరిజం' అంటూ మాట్లాడినవాళ్లే.. ఇప్పుడేమిటో 'ఇస్లామిక్ టెర్రరిజం', 'జిహాదీ టెర్రరిజం' అనే పదాలను ఉపయోగించేందుకు కూడా భయపడుతున్నారని విమర్శించారు. రాబర్ట్ వాద్రా చేసిన వ్యాఖ్యలు ఉగ్రవాదాన్ని సమర్థించేలా ఉన్నాయని పేర్కొంటూ, కాంగ్రెస్ పార్టీ అతని వ్యాఖ్యలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కావాల్సినప్పుడు మాట్లాడే బీఆర్ఎస్ పార్టీ ఈ విషయంలో మాత్రం నోరు మెదపకపోవడమేమిటని ఆయన అన్నారు. మజ్లిస్ పార్టీకి మద్దతు ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ఇలా చేస్తుందా అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ట్విట్టర్ లో చురుగ్గా ఉండే కేటీఆర్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్‌కు సహకరించారని అన్నారు. చివరగా కాంగ్రెస్ చౌకబారు రాజకీయాలు మానుకోవాలని, దేశ భద్రత వంటి సున్నిత అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు.

# హైబ్రిడ్ టెర్రరిస్టులతో.. పాకిస్తాన్ ఘాతుకం


### డిజిటల్ ఎవిడెన్స్ సేకరించిన ఎన్ ఐఏ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25, ( వెలుతురు)**
పహల్గామ్‌లో పర్యాటకుల ఊచకోత వెనుక హైబ్రిడ్ టెర్రర్ హస్తం బయటపడింది. పాక్‌లో నక్కిన టెర్రరిస్టు గురువుల ఆదేశాలతో ఈ దాడికి పాల్పడినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ మధ్యే పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్.. పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ నుంచి ముష్కరమూకకు ఎప్పటికప్పుడు ఆదేశాలు అందుతున్నట్టు పహల్గామ్ దాడి జరిగిన ప్రదేశం నుంచి NIA డిజిటెల్ ఎవిడెన్స్‌ను సంపాదించింది. కశ్మీర్ పండిట్ల ఊచకోత వెనుక కూడా హైబ్రిడ్ టెర్రరిస్టుల హస్తమే బయటపడింది. అందుకే దాడికి పాల్పడ్డ వాళ్లతో పాటు స్కెచ్ గీసిన వాళ్లను కూడా కఠినంగా శిక్షించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదన్నారు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్. హైబ్రిడ్ టెర్రరిజాన్ని కూడా ఉక్కుపాదంతో అణచివేయాలని కేంద్రం నిర్ణయించింది. కశ్మీర్ పాక్‌కి జీవనాడి అంటూనే.. 13లక్షల సైన్యం ఉన్న భారత్ తమనేం చేయలేదన్నారు. ఎన్నో త్యాగాల తర్వాత పాకిస్తాన్ ఏర్పడిందని.. దాన్ని ఎలా కాపాడుకోవాలో తమకు తెలుసన్నారు. ఉగ్ర దాడి వెనుక కీలక సూత్రధారి లష్కరే తోయిబా టాప్ కమాండర్ సైపుల్లా కసూరి అలియాస్ ఖలీద్ ఉన్నాడని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. ముసాతో పాటు రావల్‌కోటకు చెందిన మరో లష్కరే ఉగ్రవాది కోసం భద్రతా బలగాలు గాలిస్తున్నాయి. ఐదు రోజుల క్రితం ఓ సమావేశంలో.. జిహాద్ కొనసాగుతుంది.. తుపాకులు ఎక్కుపెట్టి ఉన్నాయని ప్రకటించాడు ముసా. అటు పాక్ ఆర్మీ చీఫ్.. ఇటు మునీర్ ప్రకటన చేసిన రోజుల వ్యవధిలోనే.. బైసరన్‌లో నరమేథం సృష్టించారు ఉగ్రవాదులు. పహల్గామ్ ఉగ్రదాడిలో పాకిస్తాన్ ప్రమేయం స్పష్టంగా బయటపడింది. అమాయక పౌరులను కాల్చి చంపింది పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులే.. అంతేకాదు వాళ్లకు ఆదేశాలు కూడా పాకిస్తాన్ నుంచే వచ్చాయి.. హైబ్రిడ్ టెర్రరిస్టులతో పాకిస్తాన్ ఈ ఘాతుకానికి పాల్పడింది. లష్కర్ స్లీపర్‌సెల్ పహల్గామ్‌లో నరమేథం సృష్టించింది. 2024లో ఆర్మీ క్యాంప్‌పై దాడి చేసిన ఉగ్రవాదుల బ్యాచే పహల్గామ్‌లో టూరిస్టులను ఊచకోత కోసింది. ఆ దాడి తరువాత సైలెంట్ గా ఉన్న ముష్కర మూక పహల్గామ్‌లో పంజా విసిరింది. వాళ్లకు టెర్రరిజం వృత్తి.. కానీ ముసుగులో మరో ఉద్యోగాలు చేస్తుంటారు. ఒకసారి అటాక్‌లో పాల్గొంటే మళ్లీ ఎప్పటికో దాడుల్లో పాల్గొంటారు. ఈ గ్యాప్‌లో సామాన్యుల్లా అమాయకుల్లా, రోజువారీ జీతగాళ్లలా బిల్డప్‌లు ఇస్తుంటారు. పహల్గావ్ ఉగ్రదాడి నిందితులు కూడా 2018లో పూంచ్ ఎటాక్ తర్వాత సైలెన్స్ అయ్యారు. –రెగ్యులర్ యాక్టివిటీస్ లేకపోవడంతో ట్రేసింగ్ కూడా సవాలే అని చెప్పుకోవాలి. ముసుగేసిన లష్కర్ ఇ తోయిబానే..టీఆర్ ఎఫ్ గా మారింది. విరుగుడుగా బలగాల ద్విముఖ వ్యూహంతో ముందుకెళ్తున్నాయి. ఇక కశ్మీర్ లోపలంతా ఏరివేత.. బోర్డర్‌లో ఉగ్రవేట కొనసాగుతోంది. హైబ్రిడ్ టెర్రర్ బ్యాచ్‌లో సభ్యులపై నిఘా వర్గాల దగ్గర కచ్చితమైన సమాచారం లేదు. టార్గెట్‌ను ఫినిష్ చేసిన తరువాత ఈ బ్యాచ్ చాలా కాలం సైలెంట్‌గా ఉంటుంది. టీమ్ సభ్యులు విడిపోయి మళ్లీ కలుస్తారు.. ఉగ్రవాద కార్యకలాపాలకు దూరంగా ఉంటారు.. తరువాత పాకిస్తాన్ నుంచి ఆదేశాలు రాగానే మళ్లీ దాడులు మొదలుపెడుతారు. పహల్గామ్‌లో ఇదే జరిగింది. పూంచ్‌లో దాడికి పాల్పడ్డ గ్రూపుకు పాక్ ఆర్మీ రిటైర్డ్ జవాన్ ఆసిఫ్ లీడ్ చేశాడు. ఈ గ్యాంగ్‌కు పాకిస్తాన్‌లో ఉన్న లష్కరే డిప్యూటీ చీఫ్‌గా వ్యవహరిస్తున్న సైఫుల్లా నుంచి ఎప్పటికప్పుడు ఆదేశాలు వస్తున్నాయి. పహల్గామ్ దాడి కోసం కరాచీ, ముజఫరాబాద్‌లో వార్ రూమ్‌ను ఏర్పాటు చేశాడు సైఫుల్లా..పాకిస్తాన్ నుంచి ముష్కరమూకకు ఎప్పటికప్పుడు ఆదేశాలు అందుతున్నట్టు పహల్గామ్ దాడి జరిగిన ప్రదేశం నుంచి %చీఞూ% డిజిటెల్ ఎవిడెన్స్‌ను సంపాదించింది. కశ్మీర్ పండిట్ల ఊచకోత వెనుక కూడా హైబ్రిడ్ టెర్రరిస్టుల హస్తమే బయటపడింది. అందుకే దాడికి పాల్పడ్డ వాళ్లతో పాటు స్కెచ్ గీసిన వాళ్లను కూడా కఠినంగా శిక్షించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదన్నారు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్. హైబ్రిడ్ టెర్రరిజాన్ని కూడా ఉక్కుపాదంతో అణచివేయాలని కేంద్రం నిర్ణయించింది.

## మహిళల రక్షణకే షీ టీంలు.

**కమాన్ పూర్ (పాలకుర్తి ) ఏప్రిల్ 25, ( వెలుతురు)**
మహిళల రక్షణకే షీ టీంలు పనిచేస్తున్నాయని ఎస్సై లావణ్య అన్నారు. గురువారంరామగుండం సి.పి ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జ్ ఎస్ ఐ లావణ్య ఆధ్వర్యంలో పాలకుర్తి లోని వంద రోజుల పని చేసే మహిళలకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా



6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్, మరియు సీనియర్ మెట్ కనుకయ్య మరియు మహిళలు పాల్గొన్నారు.

https://epaper.velthuru.com
శుక్రవారం 25 ఏప్రిల్ 2025
వెలుతురు


cinema




# అబీర్ గులాల్ భారత్‌లో నిషేధం

పాకిస్థాన్ నట–డు ఫవాద్ ఖాన్ హీరోగా నటించిన సినిమా 'అబీర్ గులాల్' ను భారత్ నిషేధించింది. వాణీ కపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ మూవీ పాకిస్థాన్ నటుడి సినిమా కావడంతో.. ఈ మూవీ ప్రకటన వెలువడిన క్షణం నుంచే బాయ్‌కాట్ చేయాలంటూ నెట్టింట వ్యతిరేకత మొదలైంది. పహల్గాం ఉగ్రదాడి పరిణామాల నేపథ్యంలో ఈ సినిమాని బ్యాన్ చేస్తున్నట్టు అధికారిక వర్గాలు వెల్లడించినట్టు– జాతీయ మీడియా పేర్కొంది. మే 9న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు చిత్ర బృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు, యూట్యూబ్లో ఈ సినిమా పాటలను తొలగించారు. ఈ విషయంపై మేకర్స్ స్పందించలేదు. ఉగ్రదాడిపై స్పందించకుండా.. అదే రోజు సోషల్ మీడియా వేదికగా సినిమాని ప్రమోట్ చేశారంటూ వాణీ కపూర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. పాకిస్థాన్ నటులను ప్రోత్సహిస్తున్నారంటూ బాలీవుడ్ పైనా కొందరు ట్రోల్స్ చేస్తున్నారు. రొమాంటిక్ కామెడీ నేపథ్యంతో ఆర్తి ఎస్. బగ్గీ 'అబీర్ గులాల్'ను తెరకెక్కించారు.

## విమర్శకులూ.. నా కుటుంబ సభ్యులే
- ఏఆర్ రెహ్మాన్



ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ గతేడాది తన భార్య సైరా భానుతో విడిపోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. 29 ఏళ్ల వైవాహిక జీవితానికి ఇద్దరూ పరస్పర అంగీకారం తో ముగింపు పలికామని చెప్పుకొచ్చారు. అయితే తాను విడాకుల ప్రకటించిన అనంతరం తనపై సోషల్ మీడియాలో చాలా విమర్శలు వచ్చాయని రెహమాన్ చెప్పుకోచ్చాడు. కానీ ఈ విమర్శలు తన కుటుంబసభ్యులే చేశారని అనుకుంటానని తెలిపాడు. సెలబ్రిటీల జీవితాల గురించి అందరూ తెలుసు కోవాలనుకుంటారు. వారి జీవితంలో ఏం జరుగుతుందో గమనిస్తారు, విమర్శిస్తారు. విమర్శల నుంచి ఎవరూ తప్పించుకోలేరు. నేనూ అంతే. నా గురించి తప్పుగా మాట్లాడేవారిని కూడా నా కుటుంబ సభ్యుల్లాగే భావిస్తాను. నేను ఒకరి కుటుంబం గురించి తప్పుగా మాట్లాడితే.. రేపు నా కుటుంబం గురించి ఎవరో తప్పుగా మాట్లాడుతారు. మన ఇండియన్ కల్చర్ ప్రకారం.. ఎవరూ అనవసరమైన విషయాలు మాట్లాడకూడదు, ఎందుకంటే ప్రతి ఒక్కరికీ సోదరి, భార్య, తల్లి ఉంటారు. ఎవరైనా బాధాకరమైన మాటలు అన్నప్పుడు, నేను, 'దేవుడా, వారిని క్షమించి, సన్మార్గంలో నడిపించు' అని రెహమాన్ చెప్పుకోచ్చాడు.

# నేను పక్కా భారత్ మూలాలున్న వ్యక్తినే

## ప్రభాస్ మూవీ హీరోయిన్ ఇమాన్వీ స్పష్టం



కాశ్మీర్‌లోజరిగిన మారణకాండ మీద ఆగ్రహవేషాలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్తాన్ నటీనటులను మన సినిమాల్లో నటింపజేయకూడదంటూ ఒక డిమాండ్ వినిపిస్తోంది. అందులో ముఖ్యంగా ప్రభాస్, హను రాఘవపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా మీద ఆ ఎఫెక్ట్ పడే అవకాశాలున్నాయి. ఎందుకంటే ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న ఇమాన్వీ పాకిస్తాన్ మూలాలు ఉన్న వ్యక్తి. ఆమె తండ్రి గతంలో పాకిస్తాన్ మిలిటరీలో పనిచేశారని, ప్రస్తుతం అమెరికాలో సెటిల్ అయిన ఆమె ప్రభాస్ హీరోయిన్‌గా నటిస్తోందని ప్రచారం జరుగుతోంది. ఇక ఈ ఘటన మీద ఆమె తాజాగా సోషల్ మీడియా వేదికగా స్పందించింది. జరిగిన దారుణం గురించి స్పందిస్తూ, కాశ్మీర్ ఘటనలో బాధితులైన వారందరికీ ఆమె సంతాపం వ్యక్తం చేసింది. ఇలాంటి వైలెన్స్ ను తాను ఖండిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. అలాగే, తన ఫ్యామిలీ గురించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం గురించి స్పందిస్తూ, 'మా కుటుంబం నుంచి ఎవరికీ పాకిస్తాన్ మిలిటరీతో సంబంధం లేదు. ఈ విషయం ఎలా పుట్టుకొచ్చిందో తెలియదు, కానీ ఈ విషయం సహా ఎన్నో విషయాలు నా గురించి తప్పుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నాయి. ఇంకా బాధించే విషయం ఏమిటంటే, బాధ్యత కలిగిన జర్నలిస్టులు, మీడియా అవుట్‌లెట్‌లు కూడా సోషల్ మీడియాని ఫాలో అవుతున్నారు కానీ నిజానిజాలు ఖరారు చేసుకుని స్పందించడం లేదు. నేను ఒక ప్రౌడ్ ఇండియన్–అమెరికన్. నేను హిందీ, తెలుగు, గుజరాతీ, ఇంగ్లీష్ మాట్లాడతాను. మా తల్లిదండ్రులు యూత్‌లో ఉన్నప్పుడే అమెరికాలోని లాస్ ఏంజిల్స్, కాలిఫోర్నియాకి షిఫ్ట్ అయ్యారు. వారు అమెరికా పౌరులయ్యారు. అమెరికాలో నా యూనివర్సిటీ– ఎడ్యుకేషన్ పూర్తయిన తర్వాత నటిగా, కొరియోగ్రాఫర్‌గా, డాన్సర్‌గా మారాలని అనుకున్నాను. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో నాకు వచ్చిన అవకాశాలకు నేను చాలా కృతజ్ఞురాలిని. ఖచ్చితంగా నేను భారత మూలాలు ఉన్న వ్యక్తిని. దయచేసి ఈ విషయంలో నన్ను బ్యాడ్ చేయకండి అంటూ ఆమె చెప్పుకొచ్చింది.

# శ్రీదేవిని బాగా ఆరాధించాను

## నటుడు నాని మనసులో మాట



తన సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాని ఎప్పుడూ ముందుంటారు. ఆయన నటించిన తాజా సినిమా 'హిట్ 3'. మే 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా గడపుతున్నారు నాని. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ.. తనకు ఇష్టమైన హీరోయిన్ గురించి చెప్పారు. శ్రీదేవి అంటే ఎంతో ఇష్టం. ఆమెను ఆరాధించాను. 'క్షణ క్షణం' సినిమా ఎన్నిసార్లు చూశానో లెక్కలేదు. లక్షల సార్లు చూడగలిగిన చిత్రమది. ఆమె అంత అందంగా ఎలా ఉన్నారో నాకు ఇప్పటికీ అర్థం కాదు. ఆ సినిమాకే శ్రీదేవి అందాన్ని తెచ్చారని తెలిపారు. 'హిట్ 3', అజయ్ దేవ్‌గణ్ 'రైడ్ 2' ఒకే రోజు విడుదలవుతున్నాయి కదా..



పోటీ తప్పదా అనే ప్రశ్నకు ఆసక్తికర సమాధానమిచ్చారు. రైడ్ 2'కు ప్రాధాన్యమివ్వండి. అజయ్ సర్‌తో నాకు పోటీ– లేదు. మీకు వీలుంటే 'హిట్ 3'ను థియేటర్‌లో చూడండి' అని చెప్పారు. 'హిట్' యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న సరికొత్త చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. నాని కథానాయకుడిగా శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా సిద్ధమవుతోంది. ఇందులో నాని సరసన శ్రీనిధి శెట్టి నటించారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీక్రి వచ్చి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు నాని. తాజాగా ఆయన ఓ అభిమానిని ప్రోత్సహించిన తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. 'హిట్ 3' ప్రమోషన్‌లో భాగంగా ఆయన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన ఓ అభిమాని తన వద్ద మంచి కథ ఉందని చెప్పారు. దీంతో నాని అతడిని స్టేజ్ పైకి పిలిచి మాట్లాడారు. కథకు సంబంధించిన స్క్రిప్ట్ పేపర్‌ను తీసుకున్నారు. తప్పకుండా దాన్ని చదివి రిప్లై ఇస్తానని చెప్పారు. 'మిమ్మల్ని చూస్తుంటే సినిమాపై మీకున్న అభిమానం కనిపిస్తుంది. ఇలానే ఉండండి. ఏదో ఒకరోజు గొప్ప దర్శకుడు అవుతారు' అని ప్రోత్సహించారు. అతడిని ప్రేమగా హత్తుకున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

# రాజాసాహబ్ విడుదలపై తొలగని సందిగ్ధత

బాహుబలి' మూవీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ప్రభాస్ రెంజ్.. క్రేజ్ ఎలా పెరిగిపోయిందో చెప్పక్కర్లేదు. కానీ, ఆ తర్వాత వచ్చిన సినిమాలు నిరాశనే మిగిల్చాయి. ఇక 'సలార్' హిట్ తో ఖుషీలో ఉన్న ఆయన ఫ్యాన్స్.. 'కల్కి 2898 ఏడీ' సినిమా భారీ విజయం సాధించడంతో పండగ చేసుకున్నారు. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో వరుస ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. 'రాజాసాబ్', దర్శకుడు సందీప్ రెడ్డి వంగ తో 'స్పిరిట్', 'కల్కి 2898 ఏడీ పార్ట్ – 2' ఇలా వరుస పెట్టి చూసుకుంటే అరడజను పైనే సినిమాలు లైన్ లో పెట్టాడు ప్రభాస్. అయితే ఇందులో విడుదలకు సిద్ధంగా ఉన్న మూవీ అంటే 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్నా ఈ మూవీని పూర్తి హార్రర్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు మేకర్స్. దీంతో ఇప్పటికే ప్రేక్షకులో ఈ మూవీ పై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ప్రభాస్ సరసన మాలవిక మోహన, నిధి అగర్వాల్ నటిస్తున్నారు. ఇక ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతుంది. కానీ ఇప్పటి వరకు రిలీజ్ డేట్ మాత్రం ప్రకటించలేదు. గతంలో ఏప్రిల్ 10న ఈ సినిమాను రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. కానీ, ఈ సినిమా పనుల్లో ఆలస్యం అవుతుండటంతో ఈ మూవీ రిలీజ్ వాయిదా పడింది. అయితే, తాజాగా ఈ సినిమా రిలీజ్‌పై దర్శకుడు మారుతి ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చారు. ఓ ఆటోరిక్షాపై రాజాసాబ్‌లోని ప్రభాస్ ఫోటో ఉండటాన్ని ఆయన తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోకు ఆయన 'అలర్ట్.. వేడి గాలులు మే లో మరింత పెరగనున్నాయి' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. దీంతో త్వరలోనే 'రాజా సాబ్' నుంచి ఓ సాలిడ్ అప్డేట్ అయితే రానుందని అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయానికి వచ్చిన ఎస్ఎస్ రాజమౌళి

ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని (ఆర్టీవో) సందర్శించారు. ఆయన తన అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్‌ను పునరుద్ధరించుకునేందుకు (రెన్యూవల్) వచ్చినట్లు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (జేటీసీ) రమేష్ అధికారికంగా తెలిపారు. లైసెన్స్ రెన్యూవల్ ప్రక్రియలో భాగంగా రాజమౌళి స్వయంగా ఆర్టీవో కార్యాలయానికి విచ్చేశారు. అక్కడ అవసరమైన దరఖాస్తు ఫారమ్‌పై సంతకం చేయడంతో పాటు, డిజిటల్ ఫోటో కూడా దిగారు. అధికార నిబంధనల ప్రకారం ఆయనకు పునరుద్ధరించిన అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్‌ను అందజేశారు. దర్శకధీరుడు రాజమౌళి తన అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్ రెన్యూవల్ కోసమే ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయానికి వచ్చారని జేటీసీ రమేష్ స్పష్టం చేశారు. సూపర్ స్టార్ మహేశ్ బాబుతో రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కనున్న తదుపరి భారీ చిత్రానికి సంబంధించి విదేశాల్లో చిత్రీకరణ జరపాల్సి ఉందని, అందుకోసమే ఈ అంతర్జాతీయ లైసెన్స్ అవసరం పడిందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన లైసెన్స్ రెన్యూవల్ చేయించుకున్నట్లు సమాచారం.

# ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి లాంటిదే

- లాడెన్‌కు పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్‌కు తేడాలి
- కాశ్మీర్ పహల్గాం దాడిని పోల్చిన పెంటగాన్ మాజీ అధికారి




**వాషింగ్టన్,ఏప్రిల్24( వెలుతురు):**
పహల్గామ్ ఉగ్ర దాడిని అక్టోబర్ 7, 2023న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన మారణహోమంతో అమెరికా పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రూబిన్ పోల్చారు. ఆనాడు ఇజ్రాయెల్ ప్రతీకారం తీర్చుకుందని.. అలాగే పాకిస్థాన్‌పై భారత్ ప్రతీకారం తీర్చుకోవాలని సూచించారు. ఐఎస్ఐతో సహా దాని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేయాలని సూచించారు. పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ రెచ్చగొట్టడం వల్లే పహల్గామ్ ఉగ్ర దాడి జరిగిందని తెలిపారు. దివంగత ఒసామా బిన్ లాడెన్‌కు అసిమ్ మునీర్‌కు పెద్ద తేడా లేదన్నారు. లాడెన్ గృహలో దాక్కుంటే.. అసిమ్ రాజగృహంలో ఉంటున్నాడని చెప్పారు. ఇద్దరికీ పెద్ద తేడా లేదని పేర్కొన్నారు. అక్టోబర్ 7న యూదులకు వ్యతిరేకంగా దాడి చేశారని.. ఇప్పుడు పహల్గామ్‌లో హిందువులకు వ్యతిరేకంగా దాడి చేశారని రూబిన్ గుర్తుచేశారు. అప్పటికీ.. ఇప్పటికీ పెద్ద తేడా లేదని.. ఇజ్రాయెల్‌పై జరిగినట్లుగానే.. భారత్‌పై జరిగిందని పేర్కొన్నారు. హమాస్‌పై ఐడీఎఫ్ దళాలు ఎలా దాడి శాయో.. ఇప్పుడే అదే మాదిరిగా భారత్ కూడా చేయాల్సిందేనన్నారు. ఐఎస్ఐను పూర్తిగా భారత్ నాశనం చేయాలని కోరారు. హహల్గామ్‌లో మంగళవారం జరిగిన మారణహోమంలో మొత్తం 28 మంది చనిపోగా.. 60 మందికి పైగా గాయపడ్డారు. మృతదేహాలను అధికారులు స్వస్థలాలకు తరలించారు. ఉగ్రవాదులు ఆర్మీ దుస్తుల్లో రావడంతో పర్యాటకులు గుర్తించలేకపోయారు. దీంతోనే భారీ నష్టం జరిగిపోయింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి ఘటన ను భారత్ సహా యావత్ ప్రపంచం తీవ్రంగా ఖండిస్తోంది. అప్పుడు అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత పర్యటనలో ఉన్నప్పుడు కశ్మీర్‌లో ఇలాంటి దాడే జరిగింది. మళ్లీ ఇప్పుడు అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్‌లో పర్యటిస్తుండగా పహల్గాంలో ముష్కరులు నరమేధానికి పాల్పడ్డారు. ఈ దాడిపై పాక్ స్పందిస్తూ తమకు సంబంధం లేదని, స్థానికులే ఈ ఘోరానికి పాల్పడ్డారని నిందిస్తోంది. ఇలాంటి నాటకాలు ఎన్ని ఆడినా.. ఆ దేశ వక్ర బుద్ధి ఎలాంటిదో అందరికీ తెలుసు. పహల్గాం దాడికి మనం చేయాల్సింది ఒక్కటే..! పాక్ ను ఉగ్రవాద ప్రేరేపిత దేశంగా, మునీర్‌ను ఉగ్రవాదిగా ప్రకటించాలని మైఖెల్ రూబిన్ అన్నారు. పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ రెచ్చగొట్టే ప్రసంగం తర్వాతే ఈ దాడి జరగడంతో వేళ్లన్నీ ఆయనవైపే చూపిస్తున్నాయి. అసీం మునీర్‌కు.. భారత్‌పై తీవ్రమైన ద్వేషంతో ఉంటాడన్న పేరుంది. ఆయన ప్రకటనలూ ఉగ్ర దాడికి పురిగొల్పేలానే ఉంటాయి.

## చంచల్‌గూడా జైలుకు అఘోరీ శ్రీనివాస్



**హైదరాబాద్,ఏప్రిల్24( వెలుతురు):**
అఘోరీ శ్రీనివాస్‌ను మహిళా జైలుకు తరలించారు. ఉమెన్ ట్రాన్స్ జెండర్ కావడంతో చంచల్ గూడ మహిళా జైలుకు పోలీసులు తరలించారు. యూపీలో అరెస్ట్ చేసిన అఘోరని బుధశారం హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అఘోరీ ప్రస్తుతం చంచల్ గూడ మహిళా జైలులో ఉన్నారు. మరో వైపు వర్షిణిని భరోసా సెంటర్‌కు తరలించినట్లు సమాచారం. రిమాండ్ నేపథ్యంలో అఘోరి శ్రీనివాస్‌ను ముందుగా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లిన పోలీసులు, అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఆయనను ట్రాన్స్ జెండర్ ఫీమేల్‌గా గుర్తించారు. దాంతో కంది సబ్ జైలు అధికారులు జైలులోకి ప్రవేశానికి నిరాకరించారు. దానితో పోలీసులు శ్రీనివాస్‌ను మరోసారి వైద్య పరీక్షల కోసం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య నివేదిక ఆధారంగా ఆయనను ఏ జైలుకు తరలించాలన్న దానిపై అధికారులు నిర్ణయం తీసుకున్నారు. చంచల్ గూడ మహిళా జైలుకు తరలించారు.

## ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత..

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,ఏప్రిల్24( వెలుతురు):**



ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు.ఎన్నికల కమీషన్ ఆదేశాల ప్రకారం సాధారణ తనిఖీల్లో భాగంగా గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు తదితరాలను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్ గోదామును ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలన్నారు. తనిఖీ ప్రక్రియలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వై రామయ్య( టీడీపీ), వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్రమౌళి ఉన్నారు.

# కాశ్మీర్‌లో పర్యాటకంపై తీవ్ర దెబ్బ

- ఉగ్రదాడితో ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులు

**శ్రీనగర్,ఏప్రిల్24( వెలుతురు):**
పహల్గాంలో రెండు రోజుల క్రితం జరిగిన ఉగ్రవాదుల దాడి అక్కడి పర్యాటక పరిశ్రమను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. టూరిజమే ప్రధాన ఆదాయ వనరుగా బతుకుతున్న స్థానికులు తమ జీనాధారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. పర్యాటకులు రాక చిరు వ్యాపారులు, ఉపాధి లేక దుకాణాలు, హోటళ్లలో పనిచేసే చిరుద్యోగులు తాము బతికేదెలా అని ఆందోళన చెందుతున్నారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో రెండు రోజుల క్రితం జరిగిన ఉగ్రవాదుల దాడి అక్కడి పర్యాటక పరిశ్రమను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. టూరిజమే ప్రధాన ఆదాయ వనరుగా బతుకుతున్న స్థానికులు తమ జీనాధారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. పర్యాటకులు రాక చిరు వ్యాపారులు, ఉపాధి లేక దుకాణాలు, హోటళ్లలో పనిచేసే చిరుద్యోగులు తాము బతికేదెలా అని ఆందోళన చెందుతున్నారు. పహల్గాంలో పర్యాటక పరిశ్రమే స్థానికులకు బతుకుదెరువు. అక్కడి స్థానికుల్లో వివిధ దుకాణాల ద్వారా పర్యాటకులకు అవసరమైన వస్తువులను విక్రయిస్తూ కొందరు, హోటల్‌లు, రెస్టారెంట్‌ల ద్వారా పర్యాటకులకు భోజనం, బస సౌకర్యాలు కల్పిస్తూ మరి కొందరు జీవిస్తున్నారు. వారి దగ్గర వివిధ పనులు చేస్తూ పలువురు కూలీలు, కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఉగ్రవాదుల దాడితో అక్కడ భయానక వాతావరణం నెలకొంది. పర్యాటకులంతా పహల్గాం నుంచి



తిరిగి వెళ్లిపోయారు. పలువురు స్థానికులు కూడా సురక్షిత ప్రాంతాలకు తిరిగి వెళ్లారు. దాంతో అక్కడి దుకాణాలు, హోటళ్లు మూతపడ్డాయి. దాంతో పరిస్థితి ఇలాగే కొనసాగితే తాము బతికేదెలా అని వారు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితి తమకు గతంలో ఎన్నడూ ఎదురుకాలేదని అవేదన వ్యక్తంచేస్తున్నారు. కాగా, గత మంగళవారం మధ్యాహ్నం ఐదుగురు ముష్కరులు పర్యాటకులే లక్ష్యంగా నరమేధం సృష్టించారు. విహారయాత్రకు వచ్చిన మహిళలు, పిల్లలను విడిచిపెట్టి పురుషులను కాల్చిచంపారు. అనంతరం తాపీగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ కాల్పుల్లో మొత్తం 28 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది.

# భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం

- సీ స్కిమ్మింగ్ టార్గెట్‌ను టెస్ట్ చేసిన భారత్
- లక్ష్యాన్ని ఛేదించిన వీడియోడ విడుదల

**ముంబై,ఏప్రిల్24( వెలుతురు):**
భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ కీలక పరిణామాలు చోటు చేసుకొంటున్నాయి. నౌకదళం పూర్తిగా అప్రమత్తతతో ఉంది. తాజాగా గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ తొలిసారి గగనతలంలో వస్తున్న లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. ఈ మేరకు నౌకాదళం వీడియోను విడుదల చేసింది. సీ స్కిమ్మింగ్ టార్గెట్‌ను కచ్చితమైన సమన్వయంతో విజయవంతంగా ఛేదించినట్లు- వెల్లడించింది. సముద్ర మార్గంలో రాడార్లను తప్పించుకోవడానికి నీటిపై అతి తక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లు, క్షిపణులు వంటి వాటిని సీస్కిమ్మింగ్ టార్గెట్‌లుగా పేర్కొంటారు. ఐఎన్ఎస్ సూరత్, వివిధ రకాల మిలటరీ ప్లాట్‌ఫామ్‌లతో కలిసి లక్ష్యాన్ని ట్రాక్ చేస్తూ ధ్వంసం చేసింది. ఇక టార్గెట్‌పైకి మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ ను వినియోగించారు. పహల్గాం ఉగ్రదాడితో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో తాము ఉపరితలంపై నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే క్షిపణి పరీక్షలు నిర్వహిస్తామంటూ పాక్ మిలటరీ నోటమ్ విడుదల చేసింది. ఈ పరీక్షలు 24, 25 తేదీల్లో చేపడతామని వెల్లడించింది. అదే సమయంలో ఐఎన్ఎస్ సూరత్ సరికొత్త మైలురాయిని చేరే సీస్కిమ్మింగ్ పరీక్షను నిర్వహించడం



గమనార్హం. వాస్తవానికి సర్ఫేస్ టు సర్ఫేస్ క్షిపణులపై ఎంఆర్-ఎస్ఏఎంలు ప్రభావవంతంగా పనిచేస్తాయి. విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ అరేబియా సముద్రంలోకి వచ్చింది. ఉపగ్రహ ఛాయా చిత్రాలు దీనిని ధ్రువీకరించాయి. ప్రస్తుతం కర్ణాటకలో కార్వార్ పోర్టు సమీపంలో ఇది గస్తీ కాస్తోంది. కాకపోతే కొన్ని వారాల ముందే అనుకొన్న ప్రణాళిక ప్రకారమే దీని మోహరింపు జరిగిందని చెబుతున్నా.. పహల్గాం దాడి వేళ ఈ సమాచారం బయటకు రావడం గమనార్హం. ఈ విజయవంతమైన పరీక్ష భారతదేశ రక్షణ సామర్థ్యాలను పెంపొందించడంలో మరో ముఖ్యమైన భూమిక పోషిస్తుంది.

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత ఈ పరీక్ష జరిగింది. పాక్ సైన్యం ఈ మారణ హోమానికి కుట్ర పన్నినట్లు- నివేదికలు అందుతున్న నేపథ్యంలో తాజా టెస్ట్ ఫైర్ పాకిస్తాన్‌కు ఒక వార్నింగ్ గా ట్రీట్ చేస్తున్నారు. అంతేకాదు, ఇవాళ లేదా రేపు పాకిస్తాన్ తన కరాచీ తీరప్రాంతం నుండి, దాని ప్రత్యేక ఆర్థిక మండలంలో, ఉపరితలం నుండి ఉపరితలం వరకు క్షిపణి పరీక్షను నిర్వహించాలని ప్రణాళికలు వేస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం నేపథ్యంలో మన టెస్ట్ ఫైర్ జరగడం విశేషం. పరీక్షా ప్రయోగం యొక్క వీడియోను పంచుకుంటూ, భారత నావికాదళం.. తాజా స్వదేశీ గైడెడ్ క్షిపణి విధ్వంసక నౌక ఒకా సూరత్ సముద్ర స్కిమ్మింగ్ లక్ష్యాన్ని విజయవంతంగా నిర్వహించిందని, ఇది మన రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో మరో మైలురాయిని సూచిస్తుందని పేర్కొంది. ఇప్పటికే దౌత్య విభాగంలో పాక్‌తో సంబంధాలను భారత్ మరింత తగ్గించుకొంది.

# ఉగ్రవాదులను నిర్దాక్షిణ్యంగా ఏరిపారేయాలి

- వారిటపట్ల కనికిరం చూపడంలో అర్థం లేదు
- అమాయకులను పొట్టన పెట్టుకున్న వారిని వదలకూడదు
- మధుసూధనరావు కుటుంబానికి పవన్ కళ్యాణ్ ఓదార్పు

**నెల్లూరు,ఏప్రిల్24( వెలుతురు):**
ఉగ్రవాదుల ఏరివేతలో కనికరం ఉండరాదని, వారిని క్షమించరాదని డిప్యూటి సిం పవన్ కళ్యాణ్ అన్నారు. వారికి మతం,మానవ్తంవ లేదన్నారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూదనరావుకు డిప్యూటీ-సీఎం పవన్ కళ్యాణ్ నివాళులర్పించారు. గురువారం కావలి చేరుకున్న పవన్.. నేరుగా మధుసూదనరావు ఇంటికి వెళ్లి.. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆపై కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. కాశ్మీర్‌లో కిరాతకంగా తూటాలు పేలిస్తే, దేశ వ్యాప్తంగా మధుసూదనరావుకు నివాళులర్పించారన్నారు. ఈ సంఘటనను కుటుంబ సభ్యులు ఇంకా నమ్మలేకపోతున్నారని తెలిపారు. వారితో మాట్లాడినప్పుడు... ఆయన భార్య, పిల్లలు ఏం జరిగింది.. ఎలా జరిగిందో చెప్పారన్నారు. వాళ్లు చెబుతుంటే తనకే పేగులు మెలబెట్టినట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ధర్మాన్ని ఆచరిస్తారని తెలుసుకుని హతమార్చారంటే ఎంతటి దారుణమని మండిపడ్డారు.




ఉగ్రవాదులు ఎక్కడున్నా సరే నిర్దాక్షిణ్యంగా ఏరేయాలి, మనకి కనికరం ఎక్కువైపోయింది అని అన్నారు. తాను మాట్లాడలేక పోతున్నానని.. రేపో, ఎల్లుండో మంగళగిరిలో ప్రెస్‌మీట్ పెట్టి అన్ని వివరిస్తానని తెలిపారు. శుక్రవారం వైజాగ్ కూడా వెళుతున్నానని చెప్పారు. ఎంత శాడిస్టికల్‌గా, మెతడాలికల్‌గా, కోల్డ్ బ్లెడెడ్‌గా చంపేశారన్నారు. కాశ్మీర్ రెండేళ్లుగా ప్రశాంతంగా ఉందనే ఇంతటి దారుణానికి, కిరాతకానికి పాల్పడ్డారని మండిపడ్డారు. సమ్మర్‌లో షూటింగ్ కోసం కాశ్మీర్‌కు చాలా సార్లు వెళ్లానని.. అక్కడ పరిస్థితులు తనకు తెలుసన్నారు. ఉగ్రవాదులు ఎక్కడున్నా నిర్దాక్షిణ్యంగా ఏరేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పవన్ వెంట మంత్రులు ఆనం, నాదెండ్ల, సత్యకుమార్, ఎమ్మెల్యేలు కావ్యా కృష్ణారెడ్డి, సోమిరెడ్డి, ఆర్ఎస్ఎస్ జాతీయనేత మధుకర్ ఉన్నారు.కాగా.. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రమూకల దాడిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మధుసూదన్‌రావు ప్రాణాలు కోల్పోయాడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా స్థిరపడ్డ మధుసూదన్ ఫ్యామిలీతో కలిసి పహల్గామ్ విహారాయత్రకు వెళ్లారు. అయితే ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో అతడు మృతిచెందాడు. బుధవారం రాత్రి మధుసూదన్ మృతదేహాన్ని చెన్నై ఎయిర్‌పోర్టుకు.. అక్కడి నుంచి రోడ్డు మార్గాన నెల్లూరు జిల్లా కావలికి తీసుకొచ్చారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీమున్నీరుగా విలపించారు. ఇక పెహల్గామ్ ఉగ్రదాడిలో మరో ఏపీ వాసి కూడా ప్రాణాలు కోల్పోయాడు. విశాఖకు



చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి చంద్రమౌళి ఉగ్రమూకల దాడిలో మృతిచెందాడు.





Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com